అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శనివారం 09-12-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 338 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు వెల : 6.50

విన్నపాలు వినవలె..

(మొదటిపేజీ తరువాయి)

నిలబడ్డారు. 9.30 గంటల ప్రాంతంలో అక్కడికి చేరుకున్న ముఖ్యమంత్రి... మొదటగా వికలాంగులకు ప్రాధాన్యతనిచ్చారు. వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని, విజ్ఞాపన పత్రాలను స్వీకరించారు. వాటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపడతామంటూ హామీనిచ్చారు. ఉదయం 11.15 గంటల వరకూ ఈ కార్యక్రమాన్ని ఆయన కొనసాగించారు. సీఎంతోపాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దనసరి అనసూయ (సీతక్క), ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాసరెడ్డి తదితరులు దర్బార్‌లో ఉన్నారు. అనంతరం సచివాలయంలో అత్యవసర సమీక్షా సమావేశాల కోసం ముఖ్యమంత్రి సెక్రటేరియట్‌కు బయల్దేరి వెళ్లారు. ఆ తర్వాత సీతక్క... ప్రతి ఒక్కరి నుంచీ వినతిపత్రాలను స్వీకరించారు. మరోవైపు ప్రజా దర్బార్ నిర్వహణకు ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లను పూర్తి చేసింది. ముఖ్యమంత్రి కార్యాలయం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, డీజీపీ రవిగుప్తా, జలమండలి ఎమ్‌డీ దానకిశోర్, జీహెచ్ఎమ్‌సీ కమిషనర్ రొనాల్డ్ రోస్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ తదితర అధికారులు ప్రజాదర్బార్ నిర్వహణను సమన్వయం చేశారు.

రిజిస్ట్రేషన్లకు 15 ప్రత్యేక డెస్కులు...

గ్రీవెన్సు రిజిస్ట్రేషన్లకు ప్రత్యేకంగా 15 డెస్కులను అధికారులు ఏర్పాటు చేశారు. ప్రతీ విజ్ఞాపన పత్రాన్ని ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసి, ప్రత్యేక గ్రీవెన్స్ నెంబరును కేటాయించారు. దరఖాస్తుదారులకు ప్రింటెడ్ ఎకనాలెడ్జ్‌మెంట్ ఇవ్వటంతోపాటు ఎస్ఎమ్ఎస్‌లను కూడా పంపే ఏర్పాటు చేశారు.

కుర్చీలు, ఇతర సౌకర్యాలు...

ప్రజా దర్బార్ కోసం వచ్చే ప్రజలు కూర్చోవటానికి వీలుగా లోపల 320 కుర్చీలను అధికారులు ఏర్పాటు చేశారు. బయట క్యూ లైన్లను, ఎండ నుంచి రక్షణ కోసం టెంట్లను, మంచినీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు.

పలువురి ఆందోళన...

సీఎం ప్రమాణం స్వీకారం చేసిన మరుసటి రోజే ప్రజాదర్బార్‌ను నిర్వహించటంతో అధికారులు తమ శక్తి మేరకు ఏర్పాట్లు చేసినప్పటికీ కొన్ని లోపాలు చోటు చేసుకున్నాయి. దర్బార్ లోపలికి వెళ్లేందుకు తమకు అనుమతినియ్యలేదంటూ కొందరు మహిళలు ప్రజా భవన్ ముందు ఆందోళనకు దిగారు. చాలా దూరంలో ఉన్న జిల్లాల నుంచి తాము సీఎంకు వినతిపత్రాలు ఇవ్వటానికి వస్తే సమయం లేదంటూ తిప్పి పంపటమేంటని వారు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. 'మొదటి రోజు కాబట్టి... కొంత అసౌకర్యం కలిగింది. ముస్ముందు ఇలాంటివి జరక్కుండా చూసుకుంటాం...' అని పోలీసులు వారికి సర్ది చెప్పారు. వచ్చిన దరఖాస్తుల్లో పింఛన్లు, ఇండ్లు, ఇండ్ల స్థలాలు, విద్య, వైద్య సహాయాలు తదితరాంశాలకు సంబంధించినవే ఎక్కువగా ఉన్నాయని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు.

ఫైల్స్ చించేసి...మిగిలినవి తీసుకెళ్లి...

- మాజీ మంత్రి తలసాని మాజీ ఓఎస్డీ కళ్యాణ్ నిర్వాకం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం మారడంతో పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ మాజీ ఓఎస్డీ కళ్యాణ్ పలు దస్త్రాలను ఎత్తుకెళ్లినట్టు తెలిసింది. హైదరాబాద్‌లోని పశుసంవర్ధక శాఖ కార్యాలయం బీరువాలో ఉన్న పాత ఫైళ్లను చించేసి...మిగిలిన ఫైల్స్ అన్ని సంచుల్లో మూట కట్టి తన కారులో తీసుకెళ్లారు. కాగా ఆయన పదవి ముగిసి...నాలుగు రోజులైంది. డిపార్టుమెంట్ల నుంచి ఎలాంటి ఫైల్స్ బయటికి తీసుకెళ్లొద్దని సీఎస్ శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయినా కూడా డిపార్టుమెంటు సిబ్బంది సహకారంతో ఫైల్స్ అన్ని చించేసి, బీరువాలోని ఫైల్స్‌ను ఎలుకలు కొడుతున్నాయని అందుకే ఫైల్స్ తీసుకెళ్తున్నట్టు సాకులు చెప్పి, తన కారులో వాటిని తరలించినట్టు సమాచారం దీనిపై మీడియా ప్రశ్నించగా ఇవేమీ ఇంపార్టెంట్ ఫైల్స్ కాదంటూ అక్కడి నుంచి తిన్నగా కారులో జారుకున్నారు. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చేసరికి అక్కడి నుంచి వెళ్లిపోయినట్టు అధికారులు వెల్లడించారు.

ఒడిషా టు హర్యానాకు గంజాయి

ఇద్దరిని అరెస్టు చేసిన ఎస్‌వోటీ పోలీసులు

- 510 కిలోల గంజాయి స్వాధీనం

నవతెలంగాణ- సిటీబ్యూరో



ఒడిషాలో గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్ శివారు ప్రాంతాల నుంచి హర్యానాకు తరిలిస్తున్న ఇద్దరిని ఎస్ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.8వేలతోపాటు 510కిలోల గంజాయి, ఆటో గూడ్స్‌వాహనం, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.1,28,50,000 ఉంటుందని పోలీసులు తెలిపారు. శుక్రవారం రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీ డీఎస్ చౌహాన్ వివరాలు వెల్లడించారు.

జమ్మూకాశ్మీర్‌కు చెందిన మోహన్, హర్యానాకు చెందిన ప్రవీణ్‌కుమార్ స్నేహితులు. ఇద్దరూ కలిసి గంజాయి స్మగ్లింగ్ చేయాలని పథకం వేశారు. ఇందులో భాగంగా ఒడిషాలో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేస్తున్న నిందితులు మనోహర్ అనే స్నేహితునితో కలిసి హర్యానాలోని హిస్సార్ ప్రాంతానికి సరఫరా చేస్తున్నారు. సమాచారం అందుకున్న మల్కాజ్‌గిరి ఎస్ఓటీ పోలీసులు రాచకొండ శివారు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా వేశారు. మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆటో ట్రాలీ వాహనాన్ని తనిఖీ చేయగా అందులో గంజాయి లభ్యమైంది. ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన విచారించారు. గూడ్స్‌ట్రాలీలో ప్రత్యేక క్యాబిన్‌ను ఏర్పాటు చేసిన గంజాయిని తరలిస్తున్నారు. ఎస్ఓటీ పోలీసులను సీపీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో డీసీపీలు డి.జానకి, గిరిధర్, అదనపు డీసీపీ ఎస్.సూర్యనారాయణ, ఏసీపీ వాసు, ఇన్‌స్పెక్టర్స్ రాములు, సైదులు, ఎస్ఐ పరమేశ్వర్ తదితరులు ఉన్నారు.

స్పౌజ్ బదిలీలు చేపట్టండి

- ప్రజాదర్బార్‌లో బాధితుల వినతులు

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

రాష్ట్రంలో స్పౌజ్ బదిలీలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డిని బాధితులు కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్ లో ప్రజాదర్బార్ సందర్భంగా బాధితు లు వినతిపత్రాలను సమర్పించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన 317 జీవో కారణంగా ఉద్యోగులైన భార్యా భర్తలను వివిధ జిల్లాలకు కేటాయించారని తెలిపారు. దీంతో భర్త ఒక జిల్లాలో, భార్య మరో జిల్లాలో, పిల్లలు, వృద్ధులైన తల్లిదండ్రులు వేర్వేరుగా ఉంటూ కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమైందని ఆందోళన వ్యక్తం చేశారు. రెండేండ్ల నుంచి ధర్నాలు, ప్రదర్శనలు, కుటుంబాలతో వినతులు, పిల్లలతో సహా రోడ్డెక్కినా గత ప్రభుత్వం కనికరించలేదని వివరిం చారు. 85 శాతం మహిళలే ఈ సమస్యను అనుభవిస్తున్నారని తెలిపారు. వందల కిలోమీటర్ల ప్రయాణం చేయలేక, పనిచేసే చోట కుటుంబాలను విడిచి ఉండలేక ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరిలో 615 మంది స్కూల్ అసిస్టెంట్ల స్పౌజ్ బదిలీలను ప్రభుత్వం చేపట్టిందని గుర్తు చేశారు. మిగిలిన 1,500 మంది ఎస్జీటీ, భాషా పండితులు, పీఈటీల స్పౌజ్ బదిలీలను పెండింగ్‌లో ఉంచిందని తెలిపారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి సీతక్కను కోరామని వివరించారు. ఈ కార్యక్రమంలో త్రివేణి, నరేష్, వివేక్, రామకృష్ణ, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లైవ్ టెస్టింగ్ క్యాప్సుల్‌తో రాకెట్ ప్రయోగించిన ఇరాన్

టెహ్రాన్: అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపడానికి ప్రణాళికలు రచిస్తున్న ఇరాన్ తాజాగా టెస్ట్ లివింగ్ స్పేస్ క్యాప్సుల్‌తో రాకెట్‌ను ప్రయోగించింది. ఈ విషయాన్ని ఇరాన్ ప్రభుత్వ వార్తా సంస్థ తస్నిమ్ ప్రకటించింది. బుధవారం గుర్తు తెలియని ప్రాంతం నుంచి ఈ రాకెట్‌ను ప్రయోగించినట్లు వెల్లడించింది.

'వడ్డీ రేటు ఎక్కువగా ఉంటే నిధులను ప్రభుత్వ ట్రెజరీలోనే ఉంచండి'

తిరువనంతపురం: బ్యాంకుల కంటే ఎక్కువ వడ్డీ రేటు ఇస్తుంటే ప్రభుత్వ ట్రెజరీలోనే నిధులను ఉంచాలని పబ్లిక్ సెక్టార్ యూనిట్లు (పిఎస్‌యు), ఇతర ప్రభుత్వ సంస్థలను కేరళ ఆర్థిక శాఖ ఆదేశించింది. ఈ మేరకు ఈ నెల 1న ప్రిన్సిపల్ సెక్రటరీ (ఫైనాన్స్) రవీంద్ర కుమార్ అగర్వాల్ సర్క్యులర్ జారీ చేశారు. 'బ్యాంకులు, ఇతర అవకాశాల కంటే ఎక్కువ వడ్డీ ఇస్తుంటే అన్ని పిఎస్‌యులు, స్వయంప్రతిపత్త సంస్థలు, ప్రభుత్వ యాజమాన్యం లేదా ప్రభుత్వ ప్రాయోజిత సంస్థలు తమ నిధులు, లాభాలను రాష్ట్ర ట్రెజరీలోనే ఉంచాలి' అని సర్క్యులర్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వ ట్రెజరీ కంటే తక్కువ వడ్డీ రేటు ఇస్తున్నా అనేక పిఎస్‌యులు, ఇతర సంస్థలు తమ నిధులు బ్యాంకుల వద్ద భారీగా డిపాజిట్ చేయడాన్ని ప్రభుత్వం గమనించిందని అన్నారు. పిఎస్‌యులకు తమ సొంత డిపాజిట్ల నుంచి గరిష్ట ప్రయోజనం పొందే హక్కు ఉందని అంగీకరిస్తున్నామని అన్నారు.

ఐదో సారీ తగ్గని వడ్డీ రేట్లు

రుణ గ్రహీతలకు మళ్లీ నిరాశ

- రెపో రేటు 6.5శాతమే
- ఆర్‌బీఐ నిర్ణయం
- వృద్ధి 7శాతంగా ఉండొచ్చు : గవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడి



న్యూఢిల్లీ : రిజర్వ్ బ్యాంక్ మరోమారు రుణ గ్రహీతలను నిరాశపర్చింది. కీలక వడ్డీ రేట్లను వరుసగా ఐదోసారి యథాతథంగా నిర్ణయించింది. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత ...5లో





విన్నపాలు వినవలె..

ప్రజా దర్బార్ కిటకిట

సీఎంకు వినతుల వెల్లువ

- వికలాంగులకు ప్రాధాన్యతనిచ్చిన రేవంత్
- సమస్యలు పరిష్కరిస్తామంటూ హామీ
- మంచినీరు, టెంట్లు తదితర ఏర్పాట్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తొలిరోజు ప్రజాదర్బార్ కిటకిటలాడింది. వివిధ జిల్లాల నుంచి వేలాదిగా తరలొచ్చిన ప్రజానీకంతో హైదరాబాద్ బేగంపేటలోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ (నిన్నటి వరకూ ప్రగతి భవన్) కిక్కిరిసిపోయింది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన మరుసటి రోజైన శుక్రవారం నిర్వహించిన ఈ దర్బార్‌కు విశేష స్పందన లభించింది. ఉదయం 7 గంటల నుంచే జనం పెద్ద ఎత్తున తరలొచ్చారు. తమ సమస్యలతో కూడిన వినతిపత్రాలతో వారు క్యూ లైన్లలో ...2లో

రోజుకో మంత్రి..ఎమ్మెల్యే...

జిల్లాకో అధికారి : సీఎం రేవంత్ నిర్ణయం

ప్రజా దర్బార్ తొలి రోజు అనుభవంతో సీఎం రేవంత్... ఆ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు కీలక నిర్ణయాలు తీసుకోబుతున్నట్టు సమాచారం. తాము ఊహించిన దానికంటే ఎక్కువగా, అంచనాలకు మించి దర్బార్‌కు జనం వచ్చారని ఆయన అధికారులతో ...13లో

81 వేల కోట్ల అప్పు ఎందుకైంది?

విద్యుత్ అధికారుల్ని ప్రశ్నించిన సీఎం రేవంత్‌రెడ్డి

సచివాలయంలో సమీక్షకు సీఎమ్‌డీ డీ ప్రభాకరరావు డుమ్మా

విద్యుత్ శాఖ అప్పులు రూ.81వేల కోట్లకు పెరగడానికి కారణాలు ఏంటని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అధికారుల్ని ప్రశ్నించారు. ఇంత పెద్దమొత్తంలో అప్పులు చేస్తుంటే అధికారులుగా మీరెలా మౌనంగా ఉన్నారని అడిగారు. విద్యుత్ శాఖపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో శుక్రవారంనాడాయన అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. రాష్ట్రంలో విద్యుత్ స్థితిగతులపై కూలంకషంగా చర్చించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి కార్యాలయం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇంధన శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ, జేఎమ్‌డీ శ్రీనివాసరావు, సింగరేణి సీఎమ్‌డీ ఎన్ శ్రీధర్, తెలంగాణ రాష్ట్ర దక్షిణ, ఉత్తర ప్రాంతాల విద్యుత్ పంపిణీ సంస్థల సీఎమ్‌డీలు జీ రఘుమారెడ్డి, ఏ గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విద్యుత్ రంగ స్థితిగతులను వివరించారు.



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్ శాఖపై సమీక్ష సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి అనేక సందేహాలను వ్యక్తంచేశారు. వాటికి సమాధానం చెప్పే ప్రక్రియలో అధికారులు మౌనం వహించినట్టు తెలిసింది. ప్రధానంగా యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) నిర్మాణం కోసం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ), రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్‌ఈసీ) ద్వారా తీసుకున్న దాదాపు రూ.30వేల కోట్లకు పైగా నిధుల్ని కాళేశ్వరం ప్రాజెక్టుకు మళ్లించిన విషయంపై ఆరా తీసినట్టు తెలిసింది. వైటీపీఎస్ నిర్మాణ ఆలస్యానికి ఇది కూడా కారణమేనా అని సీఎం రేవంత్‌రెడ్డి అడిగినట్టు సమాచారం. దీనితో పాటు మరికొన్ని విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం కోసం ఆర్థిక సంస్థల నుంచి అప్పులు తెచ్చి, వాటి దారిమళ్లింపుపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆయన అధికారుల్ని కోరినట్టు తెలిసింది. అలాగే డిస్కంలు పవర్ ఎక్స్ఛేంజ్‌ల నుంచి కొంటున్న విద్యుత్, ప్రయివేటు డెవలపర్స్ నుంచి కొంటున్న కరెంటు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని కూడా నివేదిక రూపంలో ఇవ్వాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి విద్యుత్ సంస్థలకు వచ్చిన నిధులు ఎన్ని? వాటిని ఎలా వినియోగించారు? అనే వివరాల్ని కూడా అడిగారు. విద్యుత్‌రంగంలో 2014కు ముందు ఉన్న పరిస్థితి...ఆ తర్వాతి స్థితిగతులపై తనకు సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆయన అధికారుల్ని ఆదేశించారు. విద్యుత్‌రంగంలో గత ప్రభుత్వ ఆర్థిక క్రమశిక్షణపై తొలి ప్రాధాన్యతగా శ్వేతపత్రం ...13లో

ఇదీ లెక్క...

విద్యుత్‌పై సమీక్షా సమావేశంలో అధికారులు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ వివరాలు...

- జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంల మొత్తం అప్పులు రూ.81,516 కోట్లు
- 2014-23 మధ్యకాలంలో డిస్కంల నష్టాలు రూ.50,275 కోట్లకు పెరిగాయి
- విద్యుత్ కొనుగోళ్లకు డిస్కంలు చేసిన అప్పులే రూ.30,406 కోట్లు
- ప్రతి నెలా రూ.1,300 కోట్లు అప్పుల తిరిగి చెల్లింపునకు కావాలి
- రూ.12,515 కోట్ల ట్రూఅప్ చార్జీల సొమ్ము ప్రభుత్వం నుంచి రావాలి.
- 2023 డిసెంబర్- 2024 మే వరకు రూ.11,058 కోట్ల నష్టాలొస్తాయని అంచనా.
- అప్పులు, క్లీన్ ఎనర్జీ సెస్, బొగ్గు ధరలు, విదేశీ బొగ్గు, పెరిగిన ఉద్యోగుల జీతాలే నష్టాలకు కారణం
- 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరాకు రూ.4,008 కోట్ల వ్యయం అవుతుంది.
- వారం రోజుల్లో మరోసారి సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన విద్యుత్‌శాఖపై పూర్తిస్థాయి సమీక్ష

రేవంత్‌కు ఖాళీ గల్లా

తక్షణావసరాలకు నిధులు కరువు

- రైతుబంధుకు డబ్బుల్లేవు !?
- తలపట్టుకున్న ఆర్థికశాఖ అధికారులు

వివరాలు 13లో

నేటి నుంచి మహిళలకు ఫ్రీ బస్ జర్నీ

ట్రాన్స్‌జెండర్స్‌కు కూడా...



- పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ, మెట్రోలైనర్‌లు ఎక్కొచ్చు
- రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా తిరగొచ్చు
- నివాస గుర్తింపు కార్డు చూపాలి
- పురుషులు, విద్యార్థులకోసం స్పెషల్ బస్సులు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని శనివారం నుంచి ప్రారంభించాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి నేటి మధ్యాహ్నం 1.40 గంటలకు అసెంబ్లీ ఆవరణ నుంచి ...5లో

ఆస్పత్రిలో మాజీ సీఎం కేసీఆర్



జారిపడి విరిగిన ఎడమకాలు తుంటి ఎముక

- యశోద ఆస్పత్రిలో శస్త్రచికిత్స పూర్తి
- కోలుకునేందుకు 6 నుంచి 8 వారాలు పడుతుందన్న డాక్టర్లు
- కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై సీఎం రేవంత్ రెడ్డి ఆరా
- మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం
- ఆస్పత్రిని సందర్శించిన వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ
- పరామర్శించిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు కె.జానారెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌజ్‌లో గురువారం (డిసెంబర్ 7 అర్ధరాత్రి) బాత్ రూంలో జారిపడటంతో మాజీ సీఎం, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌ను హైదరాబాద్ సోమాజీగూడలోని యశోద ఆస్పత్రికి తరలించారు. ఆయన వెంట సతీమణి శోభతో పాటు కుమారుడు కేటీఆర్, కుమార్తె కవిత, ...13లో

మహువా మొయిత్రాపై బహిష్కరణ వేటు

లోక్‌సభలో తీర్మానం ఆమోదం

- ఆమెకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వని స్పీకర్
- ప్రతిపక్షాల వాకౌట్
- గాంధీ విగ్రహం వద్ద నిరసన



పార్లమెంటు ఆవరణలో విపక్ష సభ్యుల నిరసన

మెగా డీఎస్సీ ప్రకటన ఎప్పుడు?



- ఆర్నెల్లలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ
- మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ హామీ
- నిరుద్యోగ యువత ఎదురుచూపు
- డీఎస్సీ వివరాలు సేకరించిన సీఎస్
- ఉపాధ్యాయ పోస్టులు పెరిగే అవకాశం
- విద్యామంత్రి రాగానే పరీక్షల తేదీలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా ఖాళీగా ఉన్న దాదాపు రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తాం. తొలి మంత్రివర్గ సమావేశంలోనే మెగా డీఎస్సీని ప్రకటించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను ఆర్నెల్లలో భర్తీ చేస్తాం.'అని కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చింది. ఆ పార్టీ అధికారంలోకి రావడంతో మెగా డీఎస్సీని ఎప్పుడు ప్రకటిస్తారనే అంశం చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డితోపాటు 11 మంది ...13లో

మహిళలే టార్గెట్‌గా.. సైకో కిల్లర్ హత్యలు

ఉపాధి ఆశ చూపి..ఏడుగురు హత్య

- ఓ మహిళ హత్య కేసు ఛేదించడంతో అసలు విషయం వెలుగులోకి..
- వికారాబాద్ జిల్లా తాండూర్‌లో ఘటన
- నిందితుడి అరెస్టు, రిమాండ్ : డీఎస్పీ శేఖర్‌గౌడ్



నవతెలంగాణ-తాండూరు

మహిళలే టార్గెట్‌గా.. ఎలాంటి ఆధారాల్లేకుండా హత్యలు చేయడం అతని నైజంగా మారింది. చిల్లర ఖర్చుల కోసం అడ్డా మీదుండే మహిళా కూలీలను టార్గెట్ చేస్తూ దారుణాలకు పాల్పడుతున్నాడు. ఇప్పటికే ఆరు హత్యలు చేసినా ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో తప్పించు తిరుగుతున్న ఈ సైకో కిల్లర్.. ఏడవ హత్యలో ఆధారాలతో దొరికి పట్టుబడ్డాడు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను వికారాబాద్ జిల్లా తాండూర్ డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శేఖర్‌గౌడ్, పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు. తాండూరు పట్టణం ధన్‌గర్ గల్లిలో నివాసముండే సర్వాబీ(42) అడ్డా కూలీగా పనిచేస్తుండేది. గత నెల 29న ఇంటి నుంచి పనికోసం వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదు. దాంతో ఈనెల 1న భర్త మహమూద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి పట్టణ సీఐ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కేసు విచారణ ముమ్మరం చేశారు. సీసీ కెమెరాలను ...13లో



అసెంబ్లీ సమావేశ ఏర్పాట్లను సమీక్షిస్తున్న సీఎస్

ఇక సభా సమయం..

నేడు శాసనసభలో ఎమ్మెల్యేల ప్రమాణం

- ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్ నియామకం
- దూరంగా ఉంటామన్న బీజేపీ ఎమ్మెల్యేలు
- అనారోగ్య కారణాలతో మాజీ సీఎం కేసీఆర్ కూడా
- మహాలక్ష్మి పథకం ప్రారంభించనున్న సీఎం రేవంత్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎన్నికల సమరం పరిసమాప్తమై కాంగ్రెస్ సారథ్యంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వేళ...ఇక సభా సమరం షురూ కానుంది. శనివారం రాష్ట్ర మూడో శాసనసభ సమావేశమవుతోంది. గత పదేండ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచిన అసెంబ్లీ ఈసారి కాంగ్రెస్ నేతృత్వంలో తొలిసారిగా భేటీ కానుంది. ముఖ్యమంత్రి హోదాలో ఎనుముల రేవంత్‌రెడ్డి మొదటిసారిగా సభలో అడుగుపెట్టనున్నారు. ఇరుపార్టీల్లో సీనియర్లు, ఎంతో అనుభవం గడించిన నేతలు సభకు హాజరుకానున్నారు. ఎనిమిదిసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన కేసీఆర్, ఆయన తర్వాత అత్యధిక సార్లు ఎన్నికైన హరీశ్‌రావు, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, ఆ తర్వాత స్థానాల్లో వరుసగా తలసాని శ్రీనివాసయాదవ్, దానం నాగేందర్ సీనియర్లుగా ఉన్నారు. వీరంతా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాబట్టి వారిని ప్రొటెం స్పీకర్‌గా నియమించడానికి కొత్త ప్రభుత్వం ఇష్టపడలేదు. కాంగ్రెస్ నుంచి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు కూడా అత్యధికసార్లు గెలిచిన వారిలో ఉన్నా... వారిద్దరూ మంత్రులుగా ఉండటంతో ప్రొటెం స్పీకర్‌గా నియమించడం సాధ్యం కాదని తెలిసింది. ఈ కారణంగా ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీని (వరుసగా ఆరుసార్లు అసెంబ్లీ ఎన్నిక కావడంతో) ప్రొటెం స్పీకర్‌గా నియమించారు. ఈమేరకు శనివారం ఉదయం 8.30 గంటలకు రాజ్‌భవన్‌లో గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. మరోవైపు నూతన ఎమ్మెల్యేలు శనివారం శాసనసభలో ...5లో

సంపాదకీయం

కంచెలు బద్దలైన వేళ..!

ఆ నల్లని రాళ్లలో దాగుండే కన్నుల గురించీ,

ఆ బండల మాటున మ్రోగే గుండెల గురించీ అడిగితే అమర శిల్పి జక్కన్న బదులివ్వకపోవచ్చు గాని, 'జ్ఞానపీఠం' నుండి లేచొచ్చి సి.నారాయణరెడ్డి సమాధానం చెప్తాడు కావచ్చు! ముఖ్యమంత్రి నివాసం చుట్టూ ముళ్ల కంచెలు పరచడం, కందకాలు తవ్వించుకోవడం జానపద చరిత్ర ల్లోనో, విఠలాచార్య సినిమాల్లోనో కనపడే దృశ్యాలు. శత్రు రాజుల నుండి తమను తాము రక్షించుకునేందుకు ఆయా దేశాల రాజులు, చక్రవర్తులు చేసిన చేష్టలవి. మరి ఏ వైపు నుండి దాడొస్తుందని, ఏ శత్రువులు దండయాత్ర చేస్తారని

గత పదేళ్లుగా కేసీఆర్ సర్కార్ చర్యలపై శ్వేత పత్రం ప్రవేశపెట్టాలన్న ముఖ్యమంత్రి నిర్ణయం కూడా ఆహ్వానించదగ్గదే. వివిధ డిపార్ట్‌మెంట్లలో పదకొండు వేల ఫైళ్లు దుమ్ముకొట్టుకుంటూ పడున్నాయట! యాదాద్రి థర్మల్ కోసం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎఫ్‌సీ), రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్ఈసీ) ద్వారా తీసుకున్న అప్పులో నుండి రూ. 30 వేల కోట్లు కాళేశ్వరానికి మళ్లించినట్లు నిన్న ముఖ్యమంత్రి సమీక్షలో బయల్పడినట్లు తెలుస్తోంది. మాటల మాయాజాలంతో నెట్టుకొస్తున్న కేసీఆర్ సర్కార్ తీరుకు దర్పణాలివి.

కె.సి.ఆర్. ప్రగతిభవన్ చుట్టూ ఈ కంచె ఏర్పాటు చేశాడో తెలీదు. ఆధునిక ప్రజాస్వామ్య దేశాల్లో ఎక్కడా ఇది కన్పడదు. చివరకి రక్త పంకిలమైన చరిత్రున్న అమెరికాలో వైట్‌హౌస్ ముందే ప్రదర్శనలు జరుగుతాయి. వాషింగ్టన్ డి.సి.లో ఐ.ఎమ్.ఎఫ్., ప్రపంచ బ్యాంకు కార్యాలయాల ముందే వివిధ రకాల నిరసనలు నిత్యం జరుగుతూంటాయి.

ఉద్యమ పార్టీగా కుబుసం విడిచేసిన 'మిన్నాగు' తమది 'ఫక్తు' పాలకపార్టీ అంటూ బుసలుకొట్టిన తర్వాత భారీ ఇనుప గేట్లకు ఇనుప కంచెలు మొలవడం పెద్ద ఆశ్చర్యమేమీకాదు. ఒక పక్క రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీ కారం జరుగుతుండగానే కంచెల్ని కూల్చేయడం స్వాగ తించాల్సిన విషయం. పంజరంలో బందీగా ఉన్న పక్షిని బయటి విశాల ప్రపంచంలోకి వదిలేస్తే అది ఎంత ఆనం దిస్తుందో తెలీదు గానీ, చుట్టూ కందకాలు, కంటకాలతో నిండిన ప్రహరీల మధ్య, పోలీసుల పహారాలో ప్రజల కందనంత దూరంలో, నిక్షిప్తమైన అధికారాన్ని బద్దలు కొడ్తే లోపలికెళ్ళేవారి ఆనందానికి అవధులుండవు. చివరికి ప్రజాధనంతో నిర్మించిన సెక్రటేరియట్‌లోకి... ఎన్నికైన పార్లమెంటు సభ్యుడిగానూ అనుమతి నిరాకరించబడ్డ వ్యక్తే ముఖ్యమంత్రి రూపంలో ప్రవేశిస్తూ "ప్రజలు హక్కుదార్లుగా లోనికి రావచ్చ"ని చెప్పినపుడు బయటికి విడుదలైన పక్షికి మించిన ఆనందం లోనికెళ్లే మనుషుల్లో వెల్లివిరిస్తోంది. ఈ వాస్తవ తెలంగాణను రేవంత్ సర్కార్ నిలబెట్టగలిగితే అంతకుమించిన ఆనందమేముంటుంది?!

ఏమైనా కంచెలు పెకలించడం ఒక రూపం మాత్రమే. 'రూపం'పై పోరాటమే చాలదు. 'సారం' దగ్గరికెళ్లాలి.



1946 - 52 మధ్య మన తెలంగాణలో మట్టి మనుషులే గడీలను కూల్చారు. ఆ తర్వాత బ్రహ్మజెముడు మొక్కలు కాదు, వనాలే పెరిగాయి. విష వృక్షాల దుంపనాశనం చేసే వరకు ప్రజలు విశ్రమించకుండ చూడాలి.

కేసీఆర్ ఓటమికి ఆ ప్రభుత్వ నకారాత్మక చర్యలే కార ణమా, కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు కారణమా, ముతాల్ని, వాటి కుమ్ములాటలను నియంత్రించ గలిగిన అధిష్ఠానం గొప్పతనం కారణమా వంటి వెన్నో ఉన్నాయి. ఎమ్మెల్యేల అవినీతిపై కూడా మీడి యాలో బానే చర్చ జరుగుతోంది. ఆవు చేలో మేస్తే దూడ (లు) గట్టున మేస్తాయా అన్నట్టు ఆర్మూరులో ఆర్‌టీసీకి రూ.ఏడు కోట్లు ఎగవేసిన శాసనసభ్యుని పాగా, మరిక తాజా మాజీ శాసన సభ్యుడి బకాయి రూ. 1.63 కోట్లు, ఒక పెద్ద సంస్థ బకాయి రూ. ఆరు కోట్లు, మరొక సంస్థ బకాయి రూ.5కోట్లు, ప్రస్తుతానికి బయట కొచ్చాయి. తవ్వితే ఇంకెన్ని పాములు బయటి కొస్తాయో! ఎస్‌పీడీసీఎల్ కి రూ.రెండు కోట్లు ఎగవేసిన శాసనసభ్యుని కథనం నేటి పత్రికల్లోని వార్త. విద్యుత్ శాఖలోని రూ.85 వేల కోట్ల అప్పుల్ని ఇప్పటిదాకా కప్పిపెట్టిన ఉన్నతాధి కారి రాజీనామాను ఆమోదించవద్దని ఈ ప్రభుత్వం నిర్ణయించడం మంచి పరిణామం.

గత పదేళ్లుగా కేసీఆర్ సర్కార్ చర్యలపై శ్వేత పత్రం ప్రవేశపెట్టాలన్న ముఖ్యమంత్రి నిర్ణయం కూడా ఆహ్వానించదగ్గదే. వివిధ డిపార్ట్‌మెంట్లలో పద కొండు వేల ఫైళ్లు దుమ్ముకొట్టుకుంటూ పడున్నాయట! యాదాద్రి థర్మల్ కోసం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ), రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్ఈసీ) ద్వారా తీసుకున్న అప్పులో నుండి రూ. 30వేల కోట్లు కాళేశ్వరానికి మళ్లించి నట్లు నిన్న ముఖ్యమంత్రి సమీక్షలో బయల్పడినట్లు తెలు స్తోంది. మాటల మాయాజాలంతో నెట్టుకొస్తున్న కేసీఆర్ సర్కార్ తీరుకు దర్పణాలివి.

వయసురీత్యా మిగతా రాష్ట్రాలన్నిటి కంటే చిన్నది మన రాష్ట్రం. కేసీఆర్ కుటుం బంపై వచ్చిన, వస్తున్న ఆరోపణలు ఒక రకమైతే, రాష్ట్రంలో జరిగిన ఈ అధికార దుర్వినియోగాల్ని, ఇష్టారీతిగా తెలంగాణతో ఆటలాడుకున్న ఈ పద్ధతుల్ని ఎండగట్టాలి. ప్రతిపక్షంలో ఉండి పాలకులపై వాక్బాణాలు సంధించడం వేరు. పాలకులైన తర్వాత ప్రజ లకు తామేంటో, ప్రజల సమస్యలను ఏ విధంగా పరిష్కరిస్తారో చేసి చూపడం వేరు.

ప్రజల సమస్యల తోరణం రేవంత్‌రెడ్డి సర్కార్ కోసం వేచియుంది. వాటిని పరిష్క రించగలిగితేనే ప్రజలకు ఉపశమనం చేసినవారవుతారు.

"పుత్రోత్సాహము తండ్రికి పుత్రుడు జన్మించినపుడే పుట్టదని"

వాడు ప్రయోజకుడై ప్రజల మన్ననలను పొందినపుడేనని సుమతీ శతకకారుడు చెప్పిన విషయం ఈ ప్రభుత్వ గమనంలో ఉండటం అవసరం.

'అన్యత్వం' మితవాదుల ఆయుధం



రామ్ పునియానీ

ప్రముఖ చరిత్రకారుడు ఎరిక్ హాబ్స్ బామ్ చెప్పినట్లు, ప్రతి జాతీయవాదం తన సొంత చరిత్రను నిర్మించుకుంటుంది. "నల్లమందు బానిసత్వానికి గసగసాలు ఎలాగో, జాతీయ వాదానికి చరిత్ర అలా" అనేది ఆయన సూత్రీకరణ. అలాగే ప్రతీ జాతీయవాదం తన భావజాలానికి అనుగుణంగా తన సొంత యోధులను సృష్టించుకుంటుంది. తమ యోధులను సృష్టించడానికి, ఆ యోధులు అనుసరించిన మార్గాన్ని వ్యతిరేకించిన వారిని కూడా అపకీర్తిపాలు చేస్తారు.

ఈ కార్యాచరణకు పరిపూర్ణతతో కూడిన నైపుణ్యమైన రెండు వ్యూహాలు అవసరం. ఒకటి, ప్రోత్సాహించాలని అనుకున్న యోధులను సమర్థించడం. రెండు, ప్రత్యర్థి నాయకుల గురించి ప్రతికూలంగా విస్తృత ప్రచారం చేయ డం. ఇదే ప్రస్తుతం భారతదేశంలో జరుగుతుంది. ఒకవైపు మితవాద నాయకుడైన నాథూరామ్ గాడ్సే గురించి స్తుతించడం జరుగుతుండగా, మరోవైపు మహాత్మాగాంధీ గురించి ప్రతికూలమైన అంశాలు ప్రచారం చేస్తున్నారు.

గాడ్సే కోసం దేవాలయాలు నిర్మించాలనే డిమాండ్లు నిరం తరం ఉంటూనే ఉన్నాయి. అతని పేరును కూడా అనేక

గాడ్సే చేతిలో హత్య గావించబడిన గాంధీని ప్రతికూలమైన వ్యక్తిగా చూపించే ప్రయత్నంలో ఆయన హత్యకు సంబంధించిన వాస్తవాలను కూడా చెరిపి వేస్తున్నారు. ఇప్పటికే ఆ వాస్తవాలు చాలా పాఠ్యపుస్తకాల్లో లేకుండా పోయాయి. ఇటీవల కాలంలో గాంధీజీ ఆత్మహత్య చేసుకున్నాడనే తప్పుడు వార్తలను వ్యాప్తి చేసే ప్రయత్నాలు కూడా ఊపందు కున్నాయి. ఇటీవల గుజరాత్ రాష్ట్రంలో నిర్వహించిన తొమ్మిదవ తరగతి పరీక్షలో ఒక ప్రశ్న రూపంలో ఆ తప్పుడు వార్త ప్రతి బింబించింది. ఆ ప్రశ్న: "గాంధీ ఆత్మహత్యకు ఎలా పాల్పడ్డాడు?". దేశ విభజనకు ఆయనే కారణమనీ, ఆయన వల్లే పాకిస్థాన్‌కు 55 కోట్ల రూపాయలు ఇవ్వాల్సి వచ్చిందనీ, ఆయన హిందూ వ్యతిరేకి అనీ, ముస్లింలను తృప్తి పరిచినందుకే ఆయన హత్య చేయబడ్డాడనే ప్రచారం ఇప్పటి దాకా సాగింది.

విశేషణాలతో గౌరవిస్తున్నారు, కానీ ఆయన ఒక్కడే కాదు. మాలేగావ్ బాంబు దాడిలో నిందితురాలు, ప్రస్తుత పార్లమెంట్ సభ్యురాలు అయిన ప్రజ్ఞాఠాకూర్, 'గాడ్సే గతంలో, ఇప్పుడు, భవి ష్యత్తులో కూడా దేశభక్తుడే' అని వాదిస్తూ వస్తుంది. గాడ్సే గురు వు, సలహాదారు, హిందూత్వ స్థాపకుడైన వినాయక దామోదర్ సావర్కర్ చిత్రపటం ఇప్పటికే లోక్‌సభలో వేలాడుతోంది. ఇప్పుడు ఆయనకు భారతదేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న అవార్డును ఇవ్వాలని డిమాండ్ కూడా చేస్తున్నారు.

గాడ్సే చేతిలో హత్య గావించబడిన గాంధీని ప్రతికూలమైన వ్యక్తిగా చూపించే ప్రయత్నంలో ఆయన హత్యకు సంబంధించిన వాస్తవాలను కూడా చెరిపి వేస్తు న్నారు. ఇప్పటికే ఆ వాస్తవాలు చాలా పాఠ్య పుస్తకాల్లో లేకుండా పోయాయి. ఇటీవల కాలంలో గాంధీజీ ఆత్మహత్య చేసుకున్నాడనే తప్పుడు వార్త లను వ్యాప్తి చేసే ప్రయత్నాలు కూడా ఊపందు కున్నాయి. ఇటీవల గుజరాత్ రాష్ట్రంలో నిర్వహించిన తొమ్మిదవ తరగతి పరీక్షలో ఒక ప్రశ్న రూపంలో ఆ తప్పుడు వార్త ప్రతి బింబించింది. ఆ ప్రశ్న: "గాంధీ ఆత్మహత్య కు ఎలా పాల్పడ్డాడు?". దేశ విభజనకు ఆయనే కారణమనీ, ఆయన వల్లే పాకిస్థాన్‌కు 55 కోట్ల రూపాయలు ఇవ్వాల్సి వచ్చిందనీ, ఆయన హిందూ వ్యతిరేకి అనీ, ముస్లింలను తృప్తి పరిచినందుకే ఆయన హత్య చేయబడ్డాడనే ప్రచారం ఇప్పటి దాకా సాగింది.

గాడ్సేను దేశభక్తునిగా స్తుతించిన కొత్తగా వచ్చిన పార్ల మెంట్ సభ్యురాలు, ప్రజ్ఞా, మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్ నుండి పోటీ చేయడానికి టికెట్ ఇచ్చిన తన పార్టీని కాపా డేందుకు తరువాత క్షమాపణలు చెప్పింది. అదే సమయంలో గాంధీజీని అపఖ్యాతి పాలు చేయడానికి, అంబేద్కర్ ఆయనపై చేసిన విమర్శలను సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచా రం చేస్తున్నారు. అంబేద్కర్ ఆయనపై చేసిన విమర్శలను కొన్నింటిని ప్రత్యేకంగా ఎంపిక చేసుకొని వాటిని వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం చేస్తున్నారు.

ఈ అసంబద్ధమైన మాటలు, బహూళ ప్రయత్నాలు, గాడ్సే ను కీర్తించి, అతడు గాంధీని హత్య చేయడాన్ని సమర్థించేందుకు ఉద్దేశించిన లక్ష్యంగా ఉన్నాయి. కానీ గాడ్సే ఎవరు? ఆయన తన రాజకీయ జీవిత గమనాన్ని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రచారక్‌గా ప్రారంభించి, ఆ తరువాత సావర్కర్ నాయకత్వం లోని హిందూ మహాసభలో చేరాడు. హిందూత్వ శక్తుల ప్రయ త్నాలు, గాంధీజీ అభిప్రాయాలను వివరించేందుకు కాకుండా, ఆయన చేసిన పనుల్లో దొర్లిన చిన్నచిన్న తప్పుల్ని వెతికేందుకు ఉద్దేశించబడుతున్నాయి. గాంధీని తప్పుడు వ్యక్తిగా చిత్రీకరిం చేందుకు, ఆయనకు ఇతర జాతీయ నాయకుల మధ్య ఉన్న భేదా భిప్రాయాలను గోరంతలను కొండంతలు చేసి చెప్పాలను కుంటున్నారు. గాంధీ, అంబేద్కర్‌కు వ్యతిరేకం అని తెలిపే పూణే ఒప్పందం ఒక ప్రధానమైన అంశంగా మారింది. ఈ ఒప్పం దంపై ఇద్దరు నాయకులూ సంతకాలు చేశారు, కానీ అణగారిన వర్గాల వారి రాజకీయ, సామాజిక భవిష్యత్తుకు సంబంధించిన నిబంధనలపై వారిరువురికీ ఏకాభిప్రాయం కుదరలేదు.

ఔను గాంధీ, అంబేద్కర్‌లు విభేదించుకున్నారు. కానీ వారి విభేదం వ్యూహాత్మక స్థాయిలో ఉంది. ఉదాహరణకు" ప్రత్యేక ఓటర్ల" విధానం భారతదేశంలో వలసవాద వ్యతిరేక పోరాట ఐక్యతను బలహీన పరుస్తుందని గాంధీ విశ్వసించాడు. ఆయన,

గాంధీ, అంబేద్కర్, నెహ్రూ, పటేల్‌లు వైవిధ్యానికి అంగీకారం తెలిపే దేశం గురించి కలలుగంటుండగా, సావర్కర్ - గాడ్సే, ఇతర హిందూ జాతీయవాదులు మాత్రం పురాణ సంబంధమైన బంగారు గతం గురించి అదేపనిగా గతంలో మాట్లాడి, ఇప్పటికీ మాట్లాడుతునే ఉన్నారు. పుట్టుకపై ఆధారపడిన అదే గతంలో అసమానతలు అంతర్నిర్మితమై ఉన్నాయి. హిందూ మితవాద శక్తులు రోజురోజుకూ దృఢంగా, శక్తివంతంగా మారుతున్నాయి, కానీ వారి ఆలోచనలు ఇతరులను మినహాయించే విధంగా ఉంటున్నాయి. వారు ఇతర మతాలకు చెందిన వారికి వ్యతిరేకంగా ఉంటున్నారు. వారికి భిన్నంగా ఉన్నవారిపై వారి ఇష్టాయిష్టాలను రుద్దడానికి ఈ అన్యత్వాన్ని(అదర్నెస్) సృష్టిస్తారు.



అంటరానితనాన్ని అంతం చెయ్యాలని నొక్కి వక్కాణించాడు. రాజ్యాంగంలో రిజర్వేషన్లను పొందుపరచడానికి గాను ఆయన నియోజకవర్గాల రిజర్వేషన్లపై పట్టుపట్టాడు. వైవిధ్యమైన గుర్తింపులతో నిమిత్తం లేకుండా భారతీయులందరినీ తన వెంట తీసుకొని వెళ్ళాల్సి వస్తుందని, వలసవాద వ్యతిరేక ఉద్యమ నాయకునిగా గాంధీజీ విశ్వసించాడు.

స్వాతంత్ర్య లక్ష్యాన్ని సాధించే మార్గాల గురించి కూడా ఆయన చాలా స్పష్టంగా ఉన్నాడు. ఈ కారణంగానే, భగత్‌సింగ్, అతని అనుచరుల పట్ల గౌరవం ఉన్నప్పటికీ ఆయన క్షమాభిక్ష కోసం కేసుపై పట్టుపట్టలేదు. గొప్ప జాతీయవాది అయిన భగత్‌సింగ్ కూడా నైతిక కారణలతో క్షమాభిక్ష కోరలేదు.

భారత స్వాతంత్ర్యోద్యమం ప్రజాస్వామిక సూత్రాలపై ఆధా రపడి ఉన్నది. వలసవాద వ్యతిరేక ఉద్యమాన్ని ఒక శక్తివంత మైన ప్రజా ఉద్యమంగా మార్చింది గాంధీ. ఒకానొక మజిలీ తరువాత, గాంధీ వ్యూహానికి ఖచ్చితంగా సరిపోనటువంటి మా ర్గాన్ని కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసింది. స్వాతంత్ర్యానికి దగ్గరగా, కాంగ్రెస్ పార్టీలో నిర్ణయాలను చేసింది కూడా నెహ్రూ, సర్దార్ పటేల్, ఇంకా ఇతర ముఖ్య నాయకులే. అన్ని నిర్ణయాలు గాంధీ ఇష్టానికి అనుగుణంగా కూడా జరగలేదు. ఉదాహరణకు, గాంధీ దేశవిభజనను అంగీకరించలేదు, ఇతరులకు అనుకూలంగా ఉన్న ఆర్థిక విధానాలతో కూడా ఏకీభవించ లేదు. గాంధీకి ఉన్న తమైన నైతిక అధికారత ఉన్నప్పటికీ, తన శిష్యులైన నెహ్రూ, పటేల్‌లు ఆయన వ్యూహాలకు భిన్నమైన వ్యూహాలను స్వీకరించారు. "నా మాటకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో విలువ లేకుండా పోయింది. ప్రస్తుతం జరుగుతున్న పరిణా మాల పట్ల నేను ఇష్టంగా లేను, నేను బయటికి మాట్లా డలేకపోతున్నాను", అని గాంధీ ఒక సందర్భంలో అన్నాడు.

ఈ దృష్టితో చూసినప్పుడు, అంబేద్కర్ - గాంధీల సంబంధంలో కొద్ది భేదం ఉంది. గాంధీ స్వాతంత్ర్యోద్య మంలో చాలా పెద్ద నాయకుడే కానీ, నియంత కాదు. ఆ విధంగా, ఈ ఇద్దరి నాయకుల మధ్య విభేదాలకంటే ఏకీ భావమే ఎక్కువ అనే వాస్త వాన్ని చరిత్ర ధ్రువీకరిస్తుంది. ప్రజాస్వామిక ప్రాథమిక మార్గదర్శక సూత్రాలు, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం లాంటి అనేక లోతైన విష యాలపై వీరిరువురూ ఒకే మార్గంలో ఉన్నారు.

గాడ్సే చెప్పిందే సరైనదని నిరూపించడానికి, (మరణా నంతరం, ఆలస్యంగా భిన్నస్వరాల నుండి కొన్నింటిని తీసు కొని వారి మధ్య ఉన్న) భేదాభిప్రాయాలను అతిశయోక్తిగా చెప్పేందుకు ప్రచారం చేస్తారు. ప్రజాస్వామ్యానికి, ప్రజా స్వామిక ఉద్య మాలకు భేదాభిప్రాయాలే ప్రాణం. ఇక్కడ ముఖ్య మైన విషయం ఏమిటంటే, గాడ్సే - సావర్కర్ అండ్ కంపెనీలు జాతీయవాద భావనల విషయంలో అంబేద్కర్, గాంధీ, కాంగ్రెస్ పార్టీ, ఇతర స్వాతంత్ర్యోద్యమ నాయకులకు భిన్నంగా ఉంటారు.

గాంధీ, అంబేద్కర్, నెహ్రూ, పటేల్‌లు వైవిధ్యానికి అంగీ కారం తెలిపే దేశం గురించి కలలుగంటుండగా, సావర్కర్ - గాడ్సే, ఇతర హిందూ జాతీయవాదులు మాత్రం పురాణ సంబం ధమైన బంగారు గతం గురించి అదేపనిగా గతంలో మాట్లాడి, ఇప్పటికీ మాట్లాడుతునే ఉన్నారు. పుట్టుకపై ఆధారపడిన అదే గతంలో అసమానతలు అంతర్నిర్మితమై ఉన్నాయి. హిందూ మితవాద శక్తులు రోజురోజుకూ దృఢంగా, శక్తివంతంగా మారుతున్నాయి, కానీ వారి ఆలోచనలు ఇతరులను మినహాయించే విధంగా ఉంటున్నాయి. వారు ఇతర మతాలకు చెందిన వారికి వ్యతిరేకంగా ఉంటున్నారు. వారికి భిన్నంగా ఉన్నవారిపై వారి ఇష్టాయిష్టాలను రుద్దడానికి ఈ అన్యత్వాన్ని(అదర్నెస్) సృష్టిస్తారు.

హిందూ జాతీయవాదులు ఏ భావజాలం కోసమైతే ఉన్నారో, ఆ భావజాలం కోసమే ప్రజ్ఞాఠాకూర్ నిలబడుతుంది. కానీ వారు దీనిని నిర్మొహమాటంగా స్పష్టం చేయదలచుకోవడం లేదు. వారి అన్ని కార్యక్రమాల ద్వారా గాడ్సే ప్రాతినిధ్యం వహించే భావజాలాన్ని నేర్పుగా రక్షించి,తరువాత కీర్తించాలని అనుకుంటున్నారు.

("కౌంటర్ కరెంట్స్" సౌజన్యంతో)

అనువాదం : బోడపట్ల రవీందర్, 9848412451



'అవినీతి' బూజును తొలగించలేమా?

ప్రపంచవ్యాప్తంగా మానవాళి ఎదుర్కొంటున్న తీవ్ర మైన సమస్యల్లో అవినీతి ప్రధానమైనది. అవినీతి కనిపించని సమాజం లేదు. అవినీతి రహిత దేశం కరువు. నైతికత నలిగిపోతున్నది. నీతి నీరుగారి పోతు న్నది. పారదర్శకత పలుచబడుతున్నది. మానవీయత మంటగలుస్తున్నది. లంచగొండితనం రాజ్యమేలు తున్నది. ఆకలి కన్న తీవ్రమైన సమస్యగా అవినీతి నిల బడి ఉన్నది. లంచం ఇవ్వనిదే ఫైలు కదలనంటున్నది. అమ్యామ్యాల మేతతో అక్రమార్కులు పేట్రేగిపోతు న్నారు. అక్రమార్జనలే నవ్య నాగరికత అవుతున్నది. అధి కారం అవినీతికి రాచబాట అయ్యింది. కీచక రాజకీయ నాయకుల ఆదేశాలే అలిఖిత చట్టాలయ్యాయి. నీతిమం తుడు చేతకాని వాడుగా పరిగణించబడుతున్నాడు. అవినీతి, లంచగొండి తనం అనేవి సామాజిక, రాజకీయ, ఆర్థిక సమస్యలుగా అవతరించాయి. అవినీతి రహిత సమాజ స్థాపనకు పూనుకోవడం, మూలాలను అన్వేషిం చడం, అక్రమార్కులను శిక్షించడం, చట్టాలను రూపొం దించి కఠినంగా అమలుపరచడం లాంటి పలు అంశా లను చర్చించే ఐరాస వేదికగా "అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినాన్ని" ప్రతి యేటా 09 డిసెంబర్ 2005 నుంచి పాటించుట ఆనవాయితీగా మారింది.

ఐరాస గణాంకాల ప్రకారం ప్రతియేటా ఒక ట్రిలి యన్ డాలర్లు అవినీతిపరుల జేబులకు చేరుతూ, 2.6 ట్రిలియన్ డాలర్లు అక్రమ మార్గంలో దోపిడీ చేయబడు తున్నాయి. ప్రపంచ జీడీపీలో ఐదు శాతం వరకు అవి నీతిపరుల చేతులు మారుతున్నది. మానవాళి సమగ్రా భివృద్ధికి ప్రధాన అవరోధంగా నిలుస్తున్న అవినీతి అంతా నికి ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, బాధ్యత గల పౌరులు, ప్రయివేట్ సంస్థలు తమవంతు చేయూతను ఇవ్వాలి. అవినీతి పెరి గితే పేదరికం, అశాంతి, హింస, ఆర్థిక మందగమనం, నేర ప్రవృత్తి, ఆకలిచావులు, ఆర్థిక అసమానతలు రాజ్య మేలుతాయని చరిత్ర బోధిస్తున్నది. నేర చరితులే నవ నాయకులుగా అవతారమెత్తుతున్నారు. అవినీతితో ప్రజా స్వామ్యం పరిహాసించబడడం, ప్రభుత్వాలు అస్థిరత్వం పాలు కావడం, దేశ ప్రగతి తిరోగమన దిశగా కదలడం జరుగుతాయి. చట్టాల లొసుగుల్ని గమనించడం, రంధ్రాన్వేషణ చేయడం, అధికారంతో రక్షణ పొందడం, పౌరుల అవసరాలను అలుసుగా తీసుకోవడం, ఆశ్రిత పక్షపాతం, బంధు ప్రీతి, లంచం తీసుకోవడం, భావ కాలుష్యం లాంటివి అవినీతి దురాచారాలుగానే పరిగ ణించబడతాయి. అవినీతి, అధికార దుర్వినియోగాలు వ్యక్తి స్వేచ్ఛ, ఆరోగ్యం, జీవన ప్రమాణాలు, మానవ హక్కులు, సామాజిక న్యాయం, ప్రభుత్వ పాలన, సమాజ భవిష్యత్తులకు విఘాతంగా మారుతున్నాయి.

ప్రపంచ దేశాల్లో అవినీతిని కొలువడానికి "కరప్షన్ పర్‌సెప్షన్ ఇండెక్స్ (సిపిఐ)" సూచిక ద్వారా నిర్ణయించి పోలుస్తారు. సిపిఐ 100 ఉన్న దేశాన్ని అవినీతిరహిత దేశంగా, జీరో ఉన్న దేశాన్ని అత్యంత అవినీతి కలిగిన దేశంగా వర్గీకరిస్తారు. 180 ప్రపంచ దేశాల సిపిఐ జాబి తాను చూస్తే ఇండియా 85వ స్థానంలో ఉంది. అవినీతి, లంచగొండితనం అధికంగా వ్యాపించిన భారతంలో నీతివంతమైన సమాజం మాయమైపోయింది. దేశ ప్రగతి నిరోధకంగా అవినీతి చెదలు నిలుస్తున్నది. దేశం ఎదుర్కొంటున్న నిరుద్యోగం, అవిద్య, వాతావరణ కాలుష్యం, పేదరికం లాంటి సమస్యలకు అవినీతి కారణం అవుతున్నది. పోలీసు, రెవెన్యూ శాఖల్లో అవినీతి అనకొండలు బుసకొడుతున్నాయి. ప్రభుత్వ పథకాలు బడుగులకు చేరేసరికి సన్నబడుతున్నాయి. అక్రమార్కు లను పట్టుకోవడం, లంచాల ఎరచూపి బయటపడడం సర్వసాధారణమైంది. అవినీతి వ్యతిరేక చట్టాలు మూలనపడి మూలుగుతున్నాయి. అధికారి నుంచి బంట్రోతు వరకు, వార్డు మెంబర్ నుంచి కేంద్ర మంత్రి వరకు అందరికీ అవినీతి మరకలు అంటుతూనే ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయంలో పని కావాలంటే పైకం ముట్టాల్సిన పరిస్థితి! తూకంలో మోసాలు, నకిలీ సామాన్లు, పన్ను ఎగవేతలు, కల్తీ లీలలు, ఆన్‌లైన్ మోసాలు లాంటివి సామాజిక ఆరోగ్యానికి పట్టిన తెగు లుగా అవతరించాయి. నేర చరిత్రలే రాజకీయ నాయ కుల అర్హతలు అయ్యాయి. భారత పార్లమెంటులో 50 శాతం వరకు ఎంపీలు నేర ఆరోపణలు కలిగి ఉండటం ఆందోళన కలిగించే అంశం. 40 మంది నూతనంగా ఎన్నికైన రాజ్యసభ సభ్యులు నేరారోపణలు ఎదుర్కొంటు న్నట్లు తెలుస్తున్నది. దేశవ్యాప్తంగా ఎమ్మెల్యేలు 4,442 కేసులను ఎదుర్కొంటున్నారు. అవినీతికి వ్యతిరేకంగా ఏకమై ప్రజలు పోరుబాట పట్టాలి. నైతికత, పార దర్శకత, దేశభక్తి, చట్టాల పట్ల గౌరవం, జవాబుదారీ తనం, అంకితభావం పెరగాలి. నీతివంత మైన భారత నిర్మాణానికి అందరూ పూనుకోవాలి. అవినీతి రహిత సమాజ స్థాపనకు ప్రతినబూనాలి.

(నేడు 'అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం')

\- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి

9949700037

పశ్చిమ హిమాలయాల్లో ప్రాజెక్టులను సమీక్షించాలి

ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లాలో సిల్క్యారా సొరం గం కూలిపోవడంతో లోపల చిక్కుకుపోయిన 41 మంది కార్మి కుల 17 రోజుల వ్యథాభరిత నిరీక్షణకు తెరపడింది. మొత్తంగా కార్మికులందరినీ క్షేమంగా బయటకు తీసుకువచ్చారు. వీరిలో ఎక్కువమంది వలస కార్మికులే. వీరిని కాపాడేందుకు పలు సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు రంగ కంపెనీలు, విదేశీ నిపుణులు, సైన్యానికి చెందిన ఇంజనీర్లు, ఇతర రంగాల కార్మికులు, దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వైమానిక బలగాలు తీసుకువచ్చిన భారీ, సంక్లిష్టమైన యంత్రాలు, సొరంగాన్ని మూసివేసిన 60 మీటర్ల శిధిలాల గుట్టలు, వాటిని తవ్వేందుకు వివిధ రకాల్లో అనుసరించిన పద్ధతులు, అప్పటికప్పుడు తీసుకున్న అత్యవసర నిర్ణయాలు, ఇవన్నీ ఫలించి ఎట్టకేలకు వారిని రక్షించి బయటకు తీసుకువచ్చే బృహత్తర కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఒక్కొక్క కార్మికుడి కోసం ఒక్కో అంబులెన్సును మోహరించారు. ఇవన్నీ సొరంగం పక్కనే కార్మికుల కోసం ఎదురుచూస్తూ వరుసగా వేచి వున్నాయి. సొరంగం నుండి బయటకు తీసుకురాగానే అక్కడే ఏర్పాటు చేసిన ఫీల్డ్ ఆస్పత్రిలో ప్రాథమిక పరీక్షలు పూర్తయిన అనంతరం వారిని సమీపంలోని చినయాలిసర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వారికి అవసరమైన ప్రత్యేక సదుపాయాలన్నింటినీ ఏర్పా టు చేశారు. ఒకవేళ ఏదైనా తీవ్ర గాయాన్ని లేదా అస్వస్థతను కార్మికులు ఎదుర్కొంటున్నట్లైతే వారి కోసం తీసుకున్న అపా రమైన ముందస్తు జాగ్రత్తల్లో ఇవన్నీ పాక్షికమే. అయితే, గత కొద్ది రోజులుగా వారితో జరిపిన ఫోన్ సంభాషణలు, ఇతర రకాల కమ్యూనికేషన్ల ద్వారా వారందరూ బాగున్నారని, ఎలాంటి గాయాలు లేవని తేలింది. కానీ, అదే సమయంలో ఇదంతా కూడా ఒక రకంగా నాటకీయంగా తీసుకున్న చర్యలుగా కూడా కనిపిస్తున్నాయి. ప్రభుత్వాలు కార్మికుల ఆరోగ్యం, వారి భద్రత కోసం అపారమైన ప్రయత్నాలు చేపట్టాయని ప్రజలకు చూపిం చుకోవడం కోసం ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం కూడా చేశారు. అనేకమంది కేంద్ర, రాష్ట్ర మంత్రులు సైతం సంఘటనా స్థలానికి విచ్చేశారు. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి కూడా వివిధ సమయాల్లో సొరంగం వద్దకు వచ్చి పనులను పర్యవేక్షించారు.

అంతా సవ్యంగానే జరిగి, సంతోషకరమైన ఫలితమే వచ్చి నందున అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే ప్రస్తుత సంతోషకరమైన వాతావరణాన్ని చూసి అంతా బాగానే వుంటుం దని అన్ని స్థాయిల్లోని అధికారులు భావించకూడదు. సున్నిత మైన హిమాలయ ప్రాంతంలో మౌలిక వసతులను అభివృద్ధి పరచడమన్నది ఓ వ్యాపారం మాదిరిగానో లేదా ఏదో సాధా రణ పద్ధతిలోనో చేపట్టడానికి వీల్లేదని తెలుసుకోవాలి. ఈ సొరంగం కుప్పకూలడమన్నది పెను విషాదానికి దారి తీసే పరిస్థితే. అయితే సొరంగం మొదట్లోనే ఇది సంభవించింది కాబట్టి సరిపోయింది.తొమ్మిది వందల కిలోమీటర్ల పొడవైన చార్‌ధామ్ హైవే ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆమోదించి, అమలు చేస్తున్న సమయంలో ఇదే తీరులో వివిధ సంస్థలు సమన్వ యంతో కృషి చేస్తూ, వృత్తిపరమైన సామర్థ్యాలను, వివిధ రంగాల నిపుణుల అభిప్రాయాలను గౌరవించాలని అందరూ భావిస్తారు. ఈ ప్రాజెక్టులో భాగంగానే సిల్క్యారా సొరం గాన్ని నిర్మిస్తున్నారు. సహాయక కార్యకలాపాల సమయంలో, వివిధ సంస్థలకు చెందిన సాంకేతిక నిపుణులు, ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది సొరంగ ప్రదేశంలోని నేల స్వభావం కారణంగా అనేక రకాల ఇబ్బందులను ఎదుర్కొన్నారు. భారీ ఆగర్ డ్రిల్లింగ్ యంత్రం పనిచేస్తుండగా, ఆ చుట్టుపక్కల పర్వత ప్రాంతాల్లో నేల గట్టిగా లేకపోవడం వల్ల శిధిలాలు పడుతుండడాన్ని వారు గమనించారు. పైగా సొరంగం పైభాగం నుండి నిలువుగా కొండను తవ్వడంతో సహా భారీ యంత్రాలతో కార్యకలాపాలు నిర్వహించడం చాలా రిస్క్‌తో కూడినదే. ఎందుకంటే ఆ ప్రకంపనల ధాటికి మళ్లీ సొరంగం కూలిపోవడమో లేదా కొండ చరియలు విరిగిపడడమో జరుగుతుందనే భయాందోళనలు కూడా సర్వత్రా వ్యక్తమయ్యాయి.

ఈ కారణాలవల్లే ఈ ప్రాజెక్టును చేపట్టినప్పటి నుండి వివిధ



రంగాల నిపుణులు, భూగర్భ శాస్త్రవేత్తలు, స్థానిక ప్రజలు, ప్రజా సంఘాల వారు అందరూ కూడా హెచ్చరిస్తూనే వచ్చారు. రోడ్ల వెడల్పు చేయడం, వాలును తగ్గించడం, పేలుళ్ళు, సొరంగాలు తవ్వడం, శిధిలాలను కిందనున్న నదుల్లోకి తోసివేయడం వంటి చర్యల వల్ల...సున్నితంగా, పెళుసుగా వుండే హిమాలయ పర్వత ప్రాంతంలో తలెత్తే ప్రమాదాల గురించి అప్రమత్తం చేస్తూనే వున్నారు. ఈ కారణాల వల్లనే పశ్చిమ హిమాలయాల్లో తర చుగా, తీవ్ర స్థాయిల్లో విపత్తులు సంభవిస్తున్నాయి. పదే పదే విరిగిపడే కొండ చరియల వల్ల హైవేకి తీవ్రంగా నష్టం వాటిల్ల డమో లేక పూర్తిగా మూసుకుపోవడమో జరుగుతోంది. భయం కరమైన వరదలు సంభవిస్తున్నాయి. తపోవన్-విష్ణు గఢ్ జల విద్యుత్ ప్రాజెక్టు పూర్తిగా ధ్వంసమైంది. చార్ థామ్ సర్క్యూట్‌లో యాత్రా స్థలాలకు కీలకమైన గేట్‌వే అయిన జోషీమఠ్ పట్టణం కుంగిపోతోంది. ఇవన్నీ కూ డా పేలవమైన ప్రణాళికల వల్ల, పైగా హిమాలయ ప్రాంతంలో భౌగోళిక, భౌగోళిక-సాంకేతికమైన సున్నిత పరిస్థితుల పట్ల ఆందోళన కొరవడడం వల్లనే సంభవిస్తు న్నాయి. పర్యావరణ నిబంధనలను ఏ మాత్రం పట్టించు కోకపోవడం, ప్రాథమికంగా కొండలు, రోడ్లు, పట్టణాలు, యాత్రా స్థలాలు ఎంతమాత్రం భారం మోయగలవనే అంశాలను పట్టించుకోకపోవడం వల్లే ఇవి జరుగుతు న్నాయి. పర్యావరణ ప్రభావ మదింపును నిర్వహించే బాధ్యత నుండి తప్పుకోవడానికే కేంద్ర ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగా తొమ్మిదివందల కిలోమీటర్ల హైవే ప్రాజె క్టును యాభై మూడు చిన్న చిన్న విభాగాలుగా విభజించిందనే విషయాన్ని ఎవరూ మర్చిపోలేరు. పైగా కూర్పులో అవకతవకలు జరగడంతో ప్రాజెక్టును పరిశీలించేందుకు సుప్రీంకోర్టు నియ మించిన నిపుణుల కమిటీ అభిప్రాయాన్ని కూడా ఎవరూ మర్చి పోలేరు. చివరగా, హైవేని విస్తరించేందుకు సుప్రీంకోర్టు కూడా ఆమోదం ఇచ్చేలా ఒత్తిడి తెచ్చేందుకు జాతీయ భద్రత అనే ట్రంప్ కార్డును కూడా కేంద్రం ఉపయోగించింది.

పర్యావరణ నిబంధనలను ఏ మాత్రం పట్టించుకోకపోవడం, ప్రాథమికంగా కొండలు, రోడ్లు, పట్టణాలు, యాత్రా స్థలాలు ఎంత మాత్రం భారం మోయగలవనే అంశాలను పట్టించుకోక పోవడం వల్లే ఇవి జరుగుతున్నాయి. పర్యావరణ ప్రభావ మదింపును నిర్వహించే బాధ్యత నుండి తప్పుకోవడానికే కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా తొమ్మిదివందల కిలోమీటర్ల హైవే ప్రాజెక్టును యాభై మూడు చిన్న చిన్న విభాగాలుగా విభజించిందనే విషయాన్ని ఎవరూ మర్చిపోలేరు. పైగా కూర్పులో అవకతవకలు జరగడంతో ప్రాజెక్టును పరిశీలించేందుకు సుప్రీంకోర్టు నియమించిన నిపుణుల కమిటీ అభిప్రాయాన్ని కూడా ఎవరూ మర్చిపోలేరు.

తాజా ఘటన తర్వాత, పశ్చిమ హిమాలయాల్లో చేపట్టిన అన్ని మౌలిక వసతుల ప్రాజెక్టులపైన సమగ్రంగా, స్వతంత్రంగా సమీక్ష జరపాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుంది. అన్ని యాత్రా స్థలాలు, హిల్ స్టేషన్లు, ఆ ప్రాంతంలోని ఇతర పట్టణాల కేరీ యింగ్ కెపాసిటీ (భరించే సామర్థ్యం)ని కూడా సమీక్షించాల్సిన అవసరముంది. అన్ని నిర్మాణ పనులకు తగిన సాంకేతిక కోడ్ లను అభివృద్ధి పరచాలి. ఈ నియమ నిబంధనలన్నీ సక్రమంగా అమలవుతున్నాయా లేదా అని పర్యవేక్షించేందుకు, వాటి అమలు జరిగేలా చూసేందుకు సమర్థవంతమైన యంత్రాంగాలను ఏర్పాటు చేయాల్సి వుంది. ఇటువంటి చర్యలు తీసుకోకపోతే, నిర్దేశించబడిన ఈ ప్రాంత అభివృద్ధి పెను విపత్తుకు కారణంగా మారిపోయే ప్రమాదముంది.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

నవతెలంగాణ

లోక్‌సభకు సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. లోక్‌సభ సభ్యత్వానికి రేవంత్ రెడ్డి రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని స్పీకర్ ఓం బిర్లాకు రేవంత్ రెడ్డి సమర్పించారు. స్పీకర్‌తో రేవంత్ రెడ్డితో పాటు తెలంగాణ వ్యవహారాల మాజీ ఇన్‌చార్జి మాణిక్యం ఠాకూర్ సమావేశమయ్యారు. అనంతరం కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసి వేణుగోపాల్ ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కలిశారు.



సీఎం రేవంత్‌ను కలిసిన టీఎన్జీవో నేతలు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డిని టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ఎం సత్యనారాయణగౌడ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ముజీబ్ హుస్సేని, నాయకులు పర్వతాలు, శంకర్ తదితరులు శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి అభినందనలు ప్రకటించారు. ప్రజల ఆకాంక్షల మేరకు కాంగ్రెస్ అధికారంలోకి రావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగుల ఆకాంక్షలకనుగుణంగా అనేక హామీలను మ్యానిఫెస్టోలో చేర్చిన కారణంగానే కొత్త ప్రభుత్వం ఏర్పడిందని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కోసం ఉద్యోగులుగా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

ఇక సభా సమయం..

(మొదటి పేజీ తరువాయి)

ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈమేరకు గవర్నర్ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రొటెం స్పీకర్‌గా అక్బర్ ప్రమాణం చేసిన తర్వాత ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న శాసనసభలో ఆయన ఎమ్మెల్యేలతో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఈ కార్యక్రమానికి మాజీ సీఎం కేసీఆర్ దూరంగా ఉండనున్నారు. బాత్రూంలో కాలుజారి కిందపడటం వల్ల ఆయన ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. ఆయన శాసనసభకు వచ్చే అవకాశం లేదని బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్ వ్యవహరిస్తుండటంతో ఆయన సమక్షంలో ప్రమాణం చేయలేమంటూ బీజేపీ ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. 2018లో కూడా బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఇదే విధంగా వ్యవహరించారు. ఆ తర్వాత స్పీకర్‌గా ఎన్నికైన పోచారం శ్రీనివాసరెడ్డి సమక్షంలో ఆయన ప్రమాణం చేసిన సంగతి తెలిసిందే. శనివారం శాసనసభ వాయిదా అనంతరం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన మహాలక్ష్మి పథకాన్ని (మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం) సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ప్రాంగణంలో ప్రారంభించనున్నారు. అక్కడి నుంచి నేరుగా నిమ్స్‌కు వెళ్లి ఆరోగ్యశ్రీ పథకాన్ని కూడా (ఆ పథకానికి ఉన్న ఆర్థిక పరిమితి పెంపు) ప్రారంభించనున్నారు.

అసెంబ్లీ పరిసరాల్లో ఆంక్షలు

కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా శాసనసభ భేటీ కానున్న నేపథ్యంలో శనివారం ఉదయం 7 గంటల తర్వాత ఆయా పరిసరాల్లో ఆంక్షలు ప్రారంభం కానున్నాయి. పబ్లిక్ గార్డెన్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో వాకింగ్ చేసే ప్రజానీకం ఉదయం 6 గంటల లోపే తమ నడకను ముగించుకోవాలని అసెంబ్లీ కార్యాలయం సూచించింది.

ఐదో సారీ తగ్గని వడ్డీ రేట్లు

(మొదటి పేజీ తరువాయి)

దాస్ అధ్యక్షతన బుధవారం నుంచి మూడు రోజుల పాటు సాగిన మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) నిర్ణయాలను శుక్రవారం ఆయన మీడియాకు వెల్లడించారు. రెపో రేటును ఇంతక్రితం స్థాయిలోనే 6.5శాతంగా నిర్ణయించామన్నారు. ఇందుకు ఎంపీసీ సభ్యుల ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారన్నారు. స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ రేటును 6.25 శాతం వద్ద, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ రేటు, బ్యాంకు రేటును 6.75 శాతం వద్ద యథాతథంగా కొనసాగిస్తున్నట్టు శక్తికాంత తెలిపారు. ఆర్‌బీఐ 2022 మే నుంచి 2023 ఫిబ్రవరి మధ్య వరుసగా వడ్డీ రేట్లను పెంచింది. ఆరు సార్లలో 2.50 బేసిస్ పాయింట్లు లేదా 2.50 శాతం పెంచి 6.50 శాతానికి చేర్చింది. దీంతో వడ్డీ, వాయిదా చెల్లింపులు ఎక్కువై రుణాలు భారం అయ్యాయి. ఈ క్రమంలోనే అనేక మంది గృహ, వాహన, వ్యక్తిగత రుణ గ్రహీతలు ఇకనైనా వడ్డీ రేట్లలో తగ్గుదల ఉండొచ్చని ఈ దఫా ఆశించిన వారికి నిరాశనే మిగిలింది. పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసేందుకు వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించడానికి మానిటరీ పాలసీ కమిటీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందని శక్తికాంత పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సాధారణ స్థితికి చేరుకోవడానికి మరింత సమయం పట్టనుందన్నారు. ఓ వైపు అప్పులు పెరగడం, మరోవైపు భౌగోళిక ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ కాస్త బలహీనంగా ఉందన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ బలంగా పుంజుకుంటోందన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరం రిటైల్ ద్రవ్యోల్బణం 5.4 శాతంగా ఉండొచ్చని ఆర్‌బీఐ అంచనా వేసింది. ఆర్‌బీఐ లక్ష్యంగా పెట్టుకున్న నాలుగు శాతానికి ఇంకా చేరుకోవాల్సి ఉందని పేర్కొంది.

2023-24లో దేశ జీడీపీ వృద్ధిరేటు అంచనాలను 6.5 శాతం నుంచి 7 శాతానికి ఆర్‌బీఐ పెంచింది. వర్ధమాన ఆర్థిక వ్యవస్థల కరెన్సీలతో పోలిస్తే రూపాయి విలువలో ఒడుదొడుకులు చాలా తక్కువగా ఉన్నాయని శక్తికాంత పేర్కొన్నారు. 2023 డిసెంబర్ 1 నాటికి భారత విదేశీ మారక నిల్వలు 604 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయని దాస్ తెలిపారు. డిజిటల్ రుణాల్లో మరింత పారదర్శకత తెచ్చేలా రుణ ఉత్పత్తులను అందించే వెబ్ అగ్రిగేటర్ల కోసం కొత్త మార్గదర్శకాలను రూపొందిస్తామన్నారు. భవిష్యత్తు ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని ఇటీవల వ్యక్తిగత, క్రెడిట్ కార్డు రుణాల విషయంలో రిస్క్ వెయిట్‌ను పెంచామన్నారు.

పాలనపై రేవంత్ దృష్టి

వచ్చిరాగానే హామీల అమలు షురూ

- ఏఐఎస్‌ల్లో భారీ మార్పులు
- కొప్పుల రాజు మార్క్ నియామకాలు !
- సీఎంవోకి కొత్త నీరు
- సీఎస్ శాంతికుమారి కొనసాగింపు ?



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి–హైదరాబాద్

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అప్పుడే పరిపాలనపై దృష్టిసారించారు. వచ్చిరాగానే మ్యానిఫెస్టోలోని ప్రధాన అంశాల అమలుకు శ్రీకారం చుట్టారు. ఆరు గ్యారెంటీలకు సంబంధించి ఇప్పటికే చకచకా చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల్లో ప్రజలకు సోనియా,రాహుల్, ప్రియాంకలు చెప్పినవే కాకుండా, తెలంగాణ నేపథ్యంలో తాను అనుకున్న పనులను త్వరితగతిన చేపట్టేందుకు ముందస్తు ప్రణాళికతోనే ఉన్నట్టు కనిపిస్తున్నది. ప్రొఫెసర్ జయశంకర్ స్వగ్రామం అక్కంపేటను రెవెన్యూ గ్రామంగా మారుస్తూ ఆదేశాలు ఇచ్చారు. అలాగే తెలంగాణ రాష్ట్ర సాధన సందర్భంగా ఉద్యమకారులపై నమోదైన పోలీసు కేసులను ఎత్తివేస్తూ ఉత్తర్వులు సైతం జారీచేశారు. శనివారం నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పిస్తూ క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారు. అలాగే బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజాస్వామ్యాన్ని ప్రశ్నార్థకం చేసేలా చేపట్టిన చర్యలపై దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రగతిభవన్ పేరు జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌గా మార్చేశారు. ప్రమాణస్వీకారం చేసిన మరుసటి రోజు నుంచే 'ప్రజాదర్బార్'ను ప్రారంభించారు. ఇలా పలు అంశాలపై వేగంగా నిర్ణయాలు తీసుకుంటూ ముందుకుపోతున్నారు. ఆర్టీసీ, విద్యుత్ శాఖలపై గట్టిగానే సమాలోచనలు చేసి, చక్కదిద్దాలనే భావనలో ఉన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు రాగానే విద్యుత్‌రంగంపై సమీక్షలు చేసి అవినీతికి బాధ్యులైన అధికారులపై కఠినంగా వ్యవహరించేందుకు వ్యూహాత్మకంగా అడుగులేస్తున్నారు. అధికారంలోకి రావడం ఒక ఎత్తయితే, ఆతర్వాత పరిపాలనను ప్రజల దగ్గరకు తీసికెళ్లడం మరో ఎత్తు. ఇందుకోసం అఖిల భారత సర్వీసు అధికారులైన ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్, ఐఎఫ్ఎస్ తదితర అధికారులను సరైన స్థానాల్లో నియమించాల్సి ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాథమ్యాలకు అనుగుణంగా అధికారుల నియామకం చేసుకోవాల్సి రావచ్చు.

సీఎంవోకు కొత్తనీరు

ప్రస్తుతం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న శాంతికుమారిని కొనసాగిస్తారా ? లేదా ? అనేది కొద్దిరోజుల్లో తేలనుంది. అయితే ఆమె సర్వీసు ఒక సంవత్సరం మాత్రమే మిగిలి ఉండటంతో, ఆమెనే కొనసాగించే అవకాశాలు ఉన్నట్టు సమాచారం. ఆతర్వాత సీఎంఓ కీలకం. అక్కడ ముఖ్యకార్యదర్శిగా ప్రధానమంత్రి కార్యాలయంలో పనిచేసిన వచ్చి, సీఎంవో కార్యదర్శిగా ఉన్న ఐఏఎస్ అధికారి వి.శేషాద్రిని నియమించినట్టుగా వార్తలొచ్చాయి. కాగా జీవో విడుదల కాలేదు. ఇకపోతే ముఖ్యమంత్రి కార్యాలయంలోని ప్రస్తుత అధికారులను పూర్తిగా పక్కబెడతారనే ప్రచారం జరుగుతున్నది. సీఎం కార్యదర్శిగా స్మితసభర్వాల్ ఇప్పటిదాకా సీఎం రేవంత్‌రెడ్డిని కలవలేదు. కనీసం శుభాకాంక్షలు చెప్పడానికి సైతం రాలేదు. ఆమెకు అక్కడ పనిచేయడం ఇష్టం లేదనే గుసగుసలు ఐఏఎస్‌ల్లో వినిపిస్తున్నాయి. ఇంకా మరికొందరిని ఇతర శాఖలకు బదిలీ చేసి కొత్త నీరును ప్రవేశపెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. వారం, పది రోజుల్లో ఈ నియామకాలపై దృష్టిసారించే అవకాశం ఉన్నట్టు తెలిసింది. పరిపాలన చేయాలంటే తొలుత సీఎంవోను సంస్కరించాల్సి ఉంటుంది. వారి సహకారంతో ఆయా ప్రభుత్వ శాఖల ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు, హెచ్‌వోడీల నియామకాలు జరగనున్నాయి. సీఎంవోలోకి కొత్తగా రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి శ్రీనివాసరాజు, జలమండలి ఎండీ బి.దానకిషోర్, బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశంతోపాటు మరికొందరిని తీసుకునే అవకాశాలు ఉన్నాయి. రెండు, మూడు రోజుల్లోనే వీరికి సంబంధించి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అలాగే కేసీఆర్ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ తదితరులు రేవంత్‌రెడ్డి సీఎంగా ప్రమాణస్వీకారం చేసి రెండురోజులవుతున్నా వ్యక్తిగతంగా కలిసి శుభాకాంక్షలు చెప్పకపోవడం వెనుక వారి అంతర్యం అర్థమవుతున్నది. వీరు కేంద్ర సర్వీసుల్లోకి వెళ్లే ఆలోచన చేస్తున్నట్టు సమాచారం. రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శిగా ఉన్న నవీన్‌మిట్టల్‌కు కీలకబాధ్యతలు అప్పగించే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఐఏఎస్‌ల్లో యువరక్తాన్ని ప్రోత్సహించే ఆలోచన సైతం సీఎం రేవంత్‌రెడ్డికి ఉన్నట్టు ఆయన అనుచర వర్గాలు చెబుతున్నాయి. నిర్ణయాలు వేగంగా తీసుకోవడమేగాక, అమలు అంతకంటే వేగంగా జరిగేలా పరిపాలనా యంత్రాంగాన్ని తీర్చిదిద్దుకోవాలని రేవంత్ భావిస్తున్నట్టు తెలిసింది.

వచ్చే రెండు, మూడు నెలల్లోనే రాష్ట్ర పరిపాలన యంత్రాంగంపై పట్టుసాధించి, ఏడాదిలోగా రాష్ట్రాన్ని అభివృదిపథంలో దూసుకువెళ్లేలా వ్యవహారం నడిపేందుకు వ్యూహాత్మక చర్యలు తీసుకునే దిశగా సీఎం అడుగులు ఉండనున్నాయని సచివాలయ అధికారవర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఇందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ సూచన మేరకు మాజీ ఐఏఎస్ అధికారి కొప్పుల రాజు సలహాలు, సూచనలు తీసుకునే అవకాశం ఉన్నట్టు సమాచారం. దేశంలోని కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రాజు సేవలను రాహుల్ ఆదేశాల మేరకు ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు అందుకుంటున్నట్టు తెలిసింది. అలాగే తెలంగాణలోనూ ఆ మేరకు రాజు సహకారాన్ని రేవంత్ తీసుకోవచ్చని సమాచారం.

డీజీపీ ఎవరు ?

పోలీస్ డీజీపీని త్వరలో నియమించే అవకాశాలు ఉన్నాయి. హైదరాబాద్ సీపీగా పనిచేస్తున్న క్రమంలో ఎన్నికల నేపథ్యంలో బదిలీ అయిన సీవీ ఆనంద్ పేరు పరిశీలనలో ఉందని తెలిసింది. రవిగుప్తాను ఎన్నికల కమిషన్ తాత్కాలికంగా నియమించినా, ఆయన్ను త్వరలో మార్చనున్నారు. అదనపు డీజీపీ జితేందర్ పేరు సైతం డీజీపీగా ప్రచారంలో ఉంది. ఇతర పేర్లూ పరిశీలిస్తున్నట్టు తెలిసింది. ఇంటెలిజెన్స్ చీఫ్‌గా బి. శివధర్‌రెడ్డిని నియమించిన సంగతి తెలిసిందే. పూర్తిస్థాయి మంత్రివర్గ విస్తరణ జరిగి, ఆయా మంత్రులకు శాఖలు కేటాయించాక అధికారుల నియామకాలపై దృష్టిసారిస్తారని సమాచారం. ఆయా శాఖలకు మంత్రులు వచ్చాక, వారి వారి అభిప్రాయాల మేరకు నియామకాలు చేస్తారా ? సొంతంగా తానే నిర్ణయాలు తీసుకుంటారా ? అనేది వేచిచూడాల్సిందే. సాధారణంగా అఖిలభారత సర్వీసు అధికారుల నియామకాలు సీఎం సొంతంగా తీసుకునే సంప్రదాయం కొనసాగుతూ వస్తున్నది. అయితే దీనిని పాటిస్తారో ? లేదో ? కూడా ఆచరణలో తేలనుంది.

ప్రజాసమస్యలు పరిష్కరిస్తాం

కాంగ్రెస్ విజయంలో సీపీఐ సంపూర్ణ సహకారం

- భవిష్యత్‌లోనూ కలిసే ముందుకెళ్తాం : మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంలో సీపీఐ సంపూర్ణ సహకారం అందించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. భవిష్యత్‌లో కూడా తాము కలిసే ముందుకెళ్తామని చెప్పారు. విద్యార్థి ఉద్యమాల నుంచి తనకు కమ్యూనిస్టు పార్టీ విద్యార్థి సంఘాలతో అనుబంధం ఉన్నదని గుర్తు చేశారు. ప్రజా సమస్యలను వింటామనీ, వాటిని పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. పొన్నం ప్రభాకర్, మాశ్రీకొండూరు ఎమ్మెల్యే కె సత్యనారాయణ శుక్రవారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్యపద్మ, ఎన్ బాలమల్లేష్, కలవేణి శంకర్, బాలనర్సింహా, ఈటి నర్సింహతో సమావేశమయ్యారు. అనంతరం పొన్నం మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజా సమస్యలను చెప్పుకునేందుకు, ప్రతిపక్ష నేతలు కలిసేందుకూ అవకాశం లేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చిన వెంటనే ప్రజాసమస్యలను వినేందుకు ప్రజా దర్బార్ ఏర్పాటు చేశామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం యూపీఏ హయాంలో కూడబెట్టిన వనరులను, ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం ఇద్దరు, ముగ్గురు వ్యక్తులకు అప్పగించిస్తోందని విమర్శించారు. 1999 సంవత్సరంలో తాను ఎన్ఎస్‌యూఐ నాయకునిగా ఉన్న సమయంలో ఏఐఎస్ఎఫ్‌తో కలిసి పనిచేశామని గుర్తు చేశారు. అనేక సమస్యలపై కలిసి ఉద్యమించామని వివరించారు. సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ విజయంతో రాష్ట్రంలో ప్రజాస్వామిక పునాది పడిందన్నారు. కమ్యూనిస్టులు, కాంగ్రెస్ కలిసి ముందుకెళ్తాయని చెప్పారు.

ప్రజల ఆశలు వమ్ము చేయొద్దు : కూనంనేని

ప్రజల ఆశలు, ఆశయాలను వమ్ము చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలిచ్చిన అధికారాన్ని కాపాడుకోవాలని కూనంనేని సూచించారు. అసెంబ్లీలో అన్ని కమ్యూనిస్టు పార్టీల తరపున, పీడిత, బాధిత అన్ని వర్గాల ప్రజల పక్షాన తాను నిర్మాణాత్మక పాత్ర పోషిస్తానని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత గట్టిగా పోరాడతానని చెప్పారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. వాగ్దానాలను, మ్యానిఫెస్టోలోని అంశాలను అమలు చేయాలని అజీజ్ పాషా అన్నారు. ఇప్పుడే తెలంగాణ రాష్ట్రం వచ్చినట్టుగా ఉందని చాడ వెంకట్ రెడ్డి వ్యాఖ్యానించారు.

సురవరం సుధాకర్ రెడ్డిని కలిసిన మంత్రి పొన్నం

శనివారం మఖ్దూంభవన్‌కు వచ్చిన సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డిని పొన్నం ప్రభాకర్, సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి సురవరం అభినందనలు తెలిపారు.



తుఫాను ప్రభావంతో.. ధ్వంసమైన అంతర్గత రోడ్లు

ఆశ్వారావుపేటకు పొంచి ఉన్న ప్రమాదం

నవతెలంగాణ–అశ్వారావుపేట

ఇటీవల సంభవించిన మీచౌంగ్ తుఫాన్‌తో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలో చేతికందిన పంటలతో పాటు, ఇటీవల నిర్మించిన అంతర్గత రహదారులు సైతం ధ్వంసమయ్యాయి. దాంతో ఆయా మార్గాల్లో ప్రయాణం చేసే వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. అయినా సంబంధిత శాఖల అధికారులు ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. మండలంలోని నారంవారిగూడెం నుంచి మొద్దులు గూడెం మధ్య ఉన్న కల్వర్టు పూర్తిగా ధ్వంసం అయింది. ఈ వరద తాకిడికి పెద్ద వృక్షం సైతం వేర్లతో సహా విరిగిపోయింది. నారంవారిగూడెం నుంచి గుర్రాలు చెరువు దారిలో రెండు కల్వర్టులు సమీపంలో రహదారి పూర్తిగా శిథిలం అయింది. ఈ రెండు మార్గాల్లో ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయాలని, తక్షణమే మరమత్తులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

హత్యకు గురైన దళిత మహిళ

వల్లందాసు మంజులగా గుర్తింపు • పోలీసుల అదుపులో నిందితులు!



నవతెలంగాణ- నల్లగొండ కలెక్టరేట్

నల్లగొండ జిల్లా కేంద్రంలోని అనిశెట్టి దుప్పలపల్లి వద్ద దారుణ హత్యకు గురైన దళిత మహిళను వల్లందాసు మంజులగా పోలీసులు గుర్తించారు. నిందితులు పోలీసుల అదుపులో ఉన్నారు. ఇందుకు సంబంధించి కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మండలం వెలుగుపల్లికి చెందిన వల్లందాసు మంజుల జిల్లా కేంద్రంలోని ఎస్ఎల్బీసీ ప్రాంతంలో గల ప్రభుత్వ మెడికల్ కళాశాల బాయ్స్ హాస్టల్‌లో వంట మనిషిగా పనిచేస్తోంది. బుధవారం ఉదయం పనికి వెళ్ళిన మంజుల రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. ఆచూకీ లభ్యం కాలేదు. ఫోన్ కూడా మొబైల్ స్విచ్ ఆఫ్ వచ్చింది. ఆమెకు పరిచయం ఉన్న ఒక వ్యక్తిపై కుటుంబీకులకు అనుమానం రాగానే పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటికే మార్చురీలో పెట్టిన మృతదేహాన్ని పోలీసులు వివిధ గ్రూపులలో షేర్ చేయగా.. ఆమెను మంజులగా భావించి కుటుంబీకులు వెంటనే తిప్పర్తి ఎస్ఐకి సమాచారం అందించారు. మార్చురీలో మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు మంజుల హత్యకు గురైందని వాపోయారు. నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ప్రధాన నిందితుడితోపాటు మరో నలుగురి ప్రమేయం ఉన్నట్టు సమాచారం. మంజులకు పరిచయం ఉన్న వ్యక్తితో పాటు అతని స్నేహితులకు హత్యకు సంబంధం ఉన్నట్టు తెలిసింది. అయితే ప్రధాన నిందితుడు గురువారం రాత్రి 12 తర్వాత పోలీసులకు దొరికాడని, మిగతా ముగ్గురిని శుక్రవారం అదుపులోకి తీసుకున్నారని తెలిసింది. మంజుల మృతదేహానికి శుక్రవారం మధ్యాహ్నం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మంజుల తల్లిదండ్రుల గ్రామమైన వెలుగుపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

మంజులను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజాసంఘాల నాయకులు పలువురు మాట్లాడుతూ.. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి మహిళలకు ఫ్రీ బస్ జర్నీ

(మొదటి పేజీ తరువాయి)

ఈ బస్సు సర్వీసుల్ని ప్రారంభిస్తారు. ఆయనతోపాటు మహిళా మంత్రులు అనసూయ సీతక్క, కొండా సురేఖ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రవాణాశాఖ కార్యదర్శి వాణీ ప్రసాద్‌తో పాటు పలువురు మహిళా ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ హామీ అమలు సాధ్యాసాధ్యాలపై సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం టీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్‌తోపాటు ఇతర ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. విధివిధానాలపై కసరత్తు చేశారు. అనంతరం రవాణాశాఖ కార్యదర్శి వాణి ప్రసాద్ దీనిపై అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో, హైదరాబాద్ సిటీలో ఆర్డినరీ, మెట్రోలైనర్ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. దీనిపై సజ్జనార్ బస్‌భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో పూర్తిస్థాయి వివరణ ఇచ్చారు. ఉచిత ప్రయాణానికి ప్రజలు సహకరించాలని కోరారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలతో పాటు బాలికలు, విద్యార్థినులు, ట్రాన్స్‌జెండర్‌లు ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. ఈ ఉచిత ప్రయాణం తెలంగాణ రాష్ట్ర నివాసిత మహిళలకే వర్తిస్తుందనీ, దానికోసం బస్సులో కండక్టర్‌కు స్థానికత ధృవీకరణ కోసం ఆధార్‌కార్డు లేదా ఓటరు గుర్తింపు కార్డు, పాన్‌కార్డు, రేషన్‌కార్డు వంటివి చూపితే సరిపోతుందని వివరించారు. ఇన్ని కిలోమీటర్లే ప్రయాణ పరిధి అనే నిబంధనలు ఏమీ లేవన్నారు. రాష్ట్ర సరిహద్దుల వరకు మహిళలు, ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగినులు, బాలికలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చన్నారు. వారం తర్వాత బస్సుల్లో ప్రయాణించే ప్రతి మహిళకు జీరో టికెట్ ఇస్తామన్నారు. రోజుకు ఎంతమంది మహిళలు ప్రయాణిస్తున్నారో లెక్క తేలాల్సి ఉంటుందనీ, ఆ ప్రకారమే ప్రభుత్వ రీయింబర్స్‌మెంట్ సొమ్ము చెల్లిస్తుందని చెప్పారు. ప్రతిష్టాత్మకమైన ఈ నిర్ణయం అమలు కోసం క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే దాదాపు 40 వేల మంది డ్రైవర్లు, కండక్టర్లతో ఇప్పటికే రెండుసార్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. ఉచిత ప్రయాణంతో బస్సుల్లో రద్దీ పెరిగే అవకాశమున్నదనీ, బస్ స్టేషన్ల నిర్వహణపై దృష్టి పెట్టాలని అధికారులను



ఆదేశించామన్నారు. సిబ్బంది క్రమశిక్షణతో వ్యవహరించాలనీ, ఓపిక, సహనంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల వ్యక్తిగత వాహనాల వినియోగం తగ్గి, రోడ్లపై ట్రాఫిక్ రద్దీ నియంత్రణలో ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆర్టీసీకి ప్రస్తుతం రోజుకు రూ.14 కోట్ల ఆదాయం వస్తున్నదనీ, ఇప్పుడు దానిలో సగం ఆదాయం తగ్గుతుందని భావిస్తున్నామనీ, ఆ మొత్తాన్ని ప్రభుత్వం రీయింబర్స్ చేస్తామని హామీ ఇచ్చిందని వివరించారు. ఇప్పటికే ఆర్టీసీలోకి 776 కొత్త బస్సులు వచ్చాయనీ, త్వరలో మరో 1,050 బస్సులు, వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయన్నారు. డ్రైవర్ల అవసరం ఉన్నదని ప్రభుత్వానికి నివేదించామనీ, దానికి సంబంధించి రిక్రూట్‌మెంట్ చేసేందుకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. వ్యక్తిగతంగానే తప్ప, టూర్ ప్యాకేజీలకు ఈ స్కీం వర్తించదని స్పష్టంచేశారు. వారం రోజులు అధ్యయనం చేశాక, అవసరమైతే పురుషులు, విద్యార్థుల కోసం ప్రత్యేక సర్వీసులు అందుబాటులోకి తెస్తామన్నారు. ప్రస్తుతం ఆర్టీసీ బస్సు ప్రయాణీకుల్లో 40 శాతం మహిళా ప్రయాణీకులు ఉన్నారనీ, వారి సంఖ్య ఇప్పుడు 55 శాతానికి పెరుగుతుందని అంచనా వేశామన్నారు. రద్దీని బట్టి షెడ్యూల్స్ సంఖ్య కూడా పెంచుతామన్నారు. ఇప్పటికే బస్ పాసులు తీసుకున్న మహిళలు, విద్యార్థినులకు ఎలాంటి రీయింబర్స్‌మెంట్ ఉండబోదని స్పష్టంచేశారు. కార్యక్రమంలో టీఎస్‌ఆర్టీసీ సీవోవో డాక్టర్ వీ రవీందర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, పురుషోత్తం, కృష్ణకాంత్, వెంకటేశ్వర్లు, ఆర్థిక సలహాదారు విజయ పుష్ప, సీఎంఈ రఘునాథ రావు, సీటీఎం జీవన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

స్వయం ప్రకాశకులు పిల్లలు

- పిల్లల కోసం ఆలోచించే చోట మానవత్వం
- బాలోత్సవం భుజాలపై పిల్లల పట్ల బాధ్యత : తెలంగాణ బాలోత్సవంలో వక్తలు
- అత్యంత వైభవంగా ముగింపు వేడుకలు

నవతెలంగాణ – ముషీరాబాద్

"పిల్లల కోసం ఎక్కడ ఆలోచిస్తారో.. అక్కడ మానవత్వం వెల్లివిరుస్తుంది.. పిల్లలు స్వయం ప్రకాశకులు.. విద్యార్థులను ఆక్వేరియంలో చేపల వలె కాకుండా సముద్రంలో చేపల వలె పెంచాలి.. తెలంగాణ బాలోత్సవం పిల్లల పట్ల బాధ్యతను తన భుజాలపై వేసుకుంది.. బాలబాలికల్లో సృజనాత్మకతను వెలికితీస్తోంది.." అని తెలంగాణ బాలోత్సవ ముగింపు సభలో వక్తలు అన్నారు. తెలంగాణ బాలోత్సవం ముగింపు సంబురాలు శుక్రవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఇస్రో చంద్రయాన్ ప్రాంగణంలో ముగిశాయి. బాలోత్సవ కార్యక్రమానికి 102 పాఠశాలల నుంచి 6000 మంది విద్యార్థులు హాజరయ్యారు. 200 మంది ఉపాధ్యాయులు, 70 మంది న్యాయ నిర్ణేతలతో, 108 మంది వాలంటీర్లతో అత్యంత ప్రతిష్టాత్మకంగా బాలోత్సవ ముగింపు సంబురాలు జరిగాయి. బతుకమ్మ, దాండియా, సైన్స్ ప్రదర్శన, కోలాటంతోపాటు చిన్నారులు వ్యర్థాలకు అర్థాలను వెతికారు. సైన్స్ ప్రదర్శనతో అబ్బురపరిచారు. దక్కన్ పత్రికా ఎడిటర్, ఆక్స్‌ఫర్డ్ పాఠశాల చైర్మెన్ వేదకుమార్, భారత్ విద్యాసంస్థల అధినేత వేణుగోపాల్, తెలంగాణ బాలోత్సవ అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు తదితరులు ప్రసంగించారు.

ఈ సందర్భంగా వేదకుమార్ మాట్లాడుతూ..



సరదాగా సందడిగా తెలంగాణ బాలోత్సవంలో పిల్లల పండుగ జరిగిందన్నారు. బాలోత్సవ పిల్లల ప్రపంచం ఎంతో ఉత్తేజం ఉత్సాహం నింపిందని తెలిపారు. ఎక్కడ పిల్లల కోసం ఆలోచిస్తారో అక్కడే మానవత్వం వెల్లివెరుస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ పిల్లల కోసం కాస్త సమయాన్ని కేటాయించాలని, అలా కేటాయిస్తే ప్రపంచం ఎంత ఆనందంగా ఉంటుందో తెలుస్తుందని చెప్పారు. వేణుగోపాల్ మాట్లాడుతూ.. పిల్లలు స్వయం ప్రకాశకులు అని.. నేలకు అందాలను మోసుకొస్తారని.. గాలికి సుగంధాన్ని అద్దుతారని అన్నారు. కలలు గన్న ప్రపంచాన్ని రంగురంగుల బొమ్మలుగా మలుస్తారని.. చూసిన జీవితాన్ని కథలుగా అల్లుతారని.. పిల్లలు చెయ్యలేనిదంటూ ఏదీ ఉండదన్నారు. ఒక్క అవకాశం ఇచ్చి చూడండి ఆకాశాన్ని తాకుతారని తెలిపారు. భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పిల్లల గురించి ఆలోచించడం అంటేనే దేశ భవిష్యత్ గురించి ఆలోచించడం అని, మార్పు పిల్లల నుంచే రావాలన్నారు. చిన్నారులకు పుస్తకాలు మాత్రమే కాదని ఆటపాటల్లో నైపుణ్యం పెంపొందించాలని కోరారు. శాస్త్రీయ ఆలోచనలు ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాలని, అటువంటి ఆలోచనల నుంచి వచ్చింది తెలంగాణ బాలోత్సవం అన్నారు. బాలల పట్ల బాధ్యతను తెలంగాణ బాలోత్సవం తన భుజానపై వేసుకొని చిట్టి బుర్రల్లో దాగున్న సృజనాత్మకను వెలికి తీసే గొప్ప కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. మట్టి ముద్దలను సైతం ముద్దు ముద్దు బొమ్మలుగా చిన్నారులు మలుస్తున్నారని, వారికి నచ్చిన అంశంపై ప్రోత్సహించే విధంగా పనిచేస్తే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. ఆడపిల్లలు లేడీ పిల్లల వలే కాకుండా పులి పిల్లల వలే విజృంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవ కార్యదర్శి సోమయ్య, కోశాధికారి బుచ్చిరెడ్డి, సుజావతి, కోయ వెంకటేశ్వర్లు, మమత, రూప, లక్ష్మి, విజ్ఞాన దర్శిని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చిరస్థాయిగా నిలిచిపోయే ప్రాజెక్ట్

'గత రెండేళ్ళుగా నా పూర్తి ఏకాగ్రత చెన్నైలో ప్రతిష్టాత్మ కంగా నిర్మిస్తున్న 'కళ్యాణ్ అమ్యూస్మెంట్ పార్క్'పై ఉంది. త్వరలోనే అది ప్రారంభ మౌతుంది. బాలకృష్ణతో సినిమా చేయాలని ఎదురు చూస్తున్నాం. ఆయన ఎప్పుడు సినిమా చేద్దామంటే అప్పుడు చేయడానికి సిద్ధంగా ఉన్నాం' అని నిర్మాత సి కళ్యాణ్ చెప్పారు. నేడు (శనివారం) ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు.

■ సహాయ దర్శకుడిగా నా కెరీర్ మొదలైంది. దాదాపు 83 చిత్రాలను చాలా విజయవంతంగా చేశా. నెక్ట్స్ బాలకృష్ణతో సినిమా ఉంటుంది. నిర్మాతని నిర్మాతగా గౌరవించే కథానాయకుడు ఆయన. అందుకే బాలకృష్ణ అంటే మాకు చాలా అభిమానం.

■ చెన్నైలో ప్రస్టేజియస్‌గా నిర్మిస్తున్న 'కల్యాణ్ అమ్యూస్మెంట్ పార్క్' తమిళ్ న్యూ ఇయర్స్ డేకి ఆవిష్కరించాలని చాలా ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నాం. తమిళనాడు ముఖ్యమంత్రికి కూడా ఈ ప్రాజెక్ట్‌ని త్వరగా ప్రారంభించాలనే ఉత్సాహంగా ఉంది. ఎందుకంటే సిటీలో ఇలాంటి ప్రాజెక్ట్ రావడం అనేది ప్రభుత్వానికి చాలా మంచి పేరు తీసుకొస్తుంది. ప్రభుత్వం, అధికారులు, అక్కడి ప్రజల నుంచి మంచి సపోర్ట్ లభించింది. చిరస్థాయిగా నిలిచిపోయే ప్రాజెక్ట్ ఇది. ఇంత అద్భుతమైన ప్రాజెక్ట్‌ని నిర్మించే అవకాశం రావడం దేవుడు ఇచ్చిన వరంగా భావిస్తున్నాను.



నిజాయితీగా చెప్పాలంటే ఇప్పుడున్న పరిస్థితుల్లో అవార్డు తీసుకున్న ఆర్టిస్ట్ కూడా ఇది తనకి ఒక గౌరవమని గొప్పగా భావించే పరిస్థితి లేదని నా అభిప్రాయం. అవార్డులను జెన్యూన్‌గా ఇచ్చిన రోజులు ఉన్నాయి. అవార్డు వేడుక అంటే పరిశ్రమ అంతా ఒక కుటుంబంలా హాజరవ్వాలి. మన పండగ అనుకోవాలి. ఒకప్పుడు అలా జరిగేవి. ఇప్పుడు అవార్డు వచ్చిన వారు తప్పితే మిగతా అందరూ ఇంట్లో కూర్చునే పరిస్థితి కనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితిలో అవార్డుల వేడుకలు ఎందుకనే ప్రశ్న ఉత్పన్నమతోంది.

- సి.కళ్యాణ్

■ ఈ పార్క్ చాలా వినో దాన్ని పంచుతుంది. ఇండియాలో తొలిసారి అందులో స్కై థియేటర్ ఏర్పాటు చేస్తున్నాం. ఇది ప్రారంభమైన తర్వాత మంచి ఆదాయం సంపాదిస్తా మనే నమ్మకం ఉంది. వచ్చిన ఆదాయాన్ని సినిమాల నిర్మాణం కోసంవెచ్చిస్తాం. కడదాక సినిమాలు తీస్తూనే ఉంటా. నేను ఎప్పుడూ సినిమా ధోరణిలోనే ఉంటాను. వెబ్ సిరీస్ కూడా సీరియల్ మాదిరే. అయితే దానికి బెటర్ వెర్షన్ తీస్తున్నారు. అయితే అలాంటి శ్రుతిమించిన కంటెంట్ నేను చేయలేను. రానురాను డిజిటల్ రైట్స్ తగ్గిపోతాయి. హీరోలు కూడా ఎక్కువగా వెబ్ సిరీస్‌ల వైపు వెళ్తారని భావిస్తాను. వచ్చే ఏడాది బాలకృష్ణ సినిమాతోపాటు మరో రెండు చిన్న సినిమాలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం.

■ తెలంగాణ నూతన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పరిశ్రమ తరపున తప్పకుండా వెళ్లి కలుస్తాం. కళ్యాణ్ అమ్యూస్మెంట్ పార్క్ లాంటి ప్రాజెక్ట్‌ని ఏపీలో నిర్మించే అవకాశం వస్తే తప్పకుండా చేస్తాను. వైజాగ్‌లో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిద్దామనే ప్రపోజల్ పెట్టాను. హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ జరగడం లేదు. దాన్ని మళ్ళీ ఓపెన్ చేస్తే విశేషమైన గుర్తింపు వస్తుంది. దాన్ని మళ్ళీ జరపమని రేవంత్ రెడ్డిని కోరుతాను. అలాగే చిల్డ్రన్ ఫిల్మ్ ఫెస్టివల్‌ని హైదరాబాద్‌కు తీసుకురమ్మని రిక్వెస్ట్ చేస్తాను.

నవచిత్రం

వాటికి మించి.. టాక్సిక్



యష్

హీరో యష్ నటించబోయే తన కొత్త సినిమాకి 'టాక్సిక్ - ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్స్ అప్స్' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. అంతర్జాతీయంగా ప్రశంసలు అందుకున్న డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో చిత్రం రూపొందుతుంది.

ఈ సందర్భంగా నిర్మాత వెంకట్ కె.నారాయణ మాట్లాడుతూ, 'యష్‌తో సినిమా చేయబోతుండటం ఎంతో ఆనందాన్నిచ్చే విషయం. ఇది మాకెంతో ప్రతిష్టాత్మకమైన చిత్రం. యష్, గీతు స్ట్రాంగ్ నెరేషన్‌తో మాస్, యాక్షన్ అంశాలను కలగలిపిన కథను తయారు చేయటానికి సమయం తీసుకున్నారు. ఈ అద్భుతాన్ని ప్రపంచానికి ఎప్పుడెప్పుడు చూపించాలా అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను' అని అన్నారు. 'కథను సరికొత్తగా చెప్పాలని నేనెప్పుడూ ప్రయోగాలు చేస్తుంటాను. లైయర్స్, మూతోన్ వంటి సినిమాలను రూపొందించినప్పుడు వాటికి అంతర్జాతీయంగా ప్రశంసలు దక్కాయి. నా దేశంలో నా ఆడియెన్స్ ఇలాంటి డిఫరెంట్ నెరేషన్‌ను ఎలా రిసీవ్ చేసుకుంటారనే విషయాన్ని తెలుసు కోవటానికి ఎప్పుడూ తహతహలాడుతుంటాను. అలాంటి ఆలోచనల నుంచి పుట్టిందే ఈ సినిమా. రెండు వేర్వేరు ప్రపంచాల కలయికగా కథ ఉంటుంది' అని డైరెక్టర్ గీతూ మోహన్ దాస్ తెలిపారు. కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై సినిమా రూపొందుతోంది. ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఏప్రిల్ 10, 2025న గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు.



డెవిల్ రిలీజ్‌కి రెడీ

కళ్యాణ్ రామ్ కథానాయకుడిగా నటిస్తున్న లేటెస్ట్ పీరియాడిక్ స్పై థ్రిల్లర్ 'డెవిల్'. 'ది బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్' ట్యాగ్ లైన్. ఇప్పటి వరకు కళ్యాణ్ రామ్ చేయనటువంటి జోనర్ ఇది. దీన్ని భారీ బడ్జెట్‌తో చేస్తున్నారు. దీంతో సినిమాపై మంచి ఎక్స్‌పెక్టేషన్స్ క్రియేట్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఈనెల 29న ఈ చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ చేస్తున్నారు. ఇందులో ఎవరికీ అంతు చిక్కని ఓ రహస్యాన్ని ఛేదించే బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్‌గా కళ్యాణ్ రామ్ ఆకట్టుకోబోతున్నారు. అభిషేక్ పిక్చర్స్ బ్యానర్‌పై అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తూ ఈ చిత్రాన్ని నిర్మించారు. తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ భాషల్లో రిలీజ్ కానుంది.

భిన్న కాన్సెప్ట్‌తో కలశ..



చంద్రజ ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌లో బిగ్ బాస్ ఫేమ్ భానుశ్రీ, సోనాక్షి వర్మ, అనురాగ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కలశ'. కొండా రాంబాబు దర్శకుడు. డాక్టర్ రాజేశ్వరి చంద్రజ వాడపల్లి నిర్మాత. శుక్రవారం ఈ చిత్ర ట్రైలర్‌ను డైరెక్టర్ మలినేని గోపీచంద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'మూవీ ట్రైలర్ చాలా బాగుంది. ఈ సినిమా థ్రిల్లరా? లేక హర్రరా? అనేది తెలీకుండా తెలివిగా కట్ చేశారు. కలశ అనే ఇంట్రెస్టింగ్ టైటిల్ పెట్టి డైరెక్ట్ చేసిన దర్శకుడు రాంబాబుకి, నిర్మాతకు, నటీనటులకు, టెక్నీషియన్స్‌కు ఆల్ ది బెస్ట్. ఈనెల 15న రిలీజ్ అవుతుంది. తప్పకుండా చూడండి' అని అన్నారు. 'ట్రైలర్‌ను రిలీజ్ చేసిన డైరెక్టర్ మలినేని గోపిచంద్‌కి థ్యాంక్స్. ప్రేక్షకుల బ్లెస్సింగ్స్ కావాలి' అని హీరోయిన్ భానుశ్రీ చెప్పారు. దర్శకుడు కొండా రాంబాబు మాట్లాడుతూ, 'మంచి సినిమాతో మీ ముందుకు వస్తున్నందుకు ఆనందంగా ఉంది' అని తెలిపారు.

'పవర్‌ఫుల్ కథ, కథనాలతో ప్రేక్షకులకు కావల్సిన అన్ని హంగులతో ఈ చిత్రాన్ని నిర్మించాం. మా ప్రయత్నం మిమ్మల్ని తప్పకుండా మెప్పిస్తుందనే నమ్మకంతో ఉన్నాం' అని నిర్మాత రాజేశ్వరి చంద్రజ వాడపల్లి చెప్పారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: వెంకట్ గంగధారి, సంగీతం: విజయ్ కురాకుల, ఎడిటర్: జున్నైద్ సిద్ధిఖీ, లిరిక్స్: సాగర్ నారాయణ.

తాంత్రిక రహస్యాలతో.. తంత్ర



అనన్య నాగళ్ల ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'తంత్ర'. ఈ చిత్ర టీజర్ శుక్రవారం నటుడు ప్రియదర్శి చేతుల మీదుగా రిలీజ్ అయ్యింది. 'ఊరిలో పుట్టిన దుష్టశక్తి రక్తదాహంతో విరుచుకుపడుతోంది..' అంటూ చెబుతున్న డైలాగ్స్ మీద కట్ అయిన టీజర్ రకరకాల తాంత్రిక పూజలని చూపిస్తూ మైండ్-బ్లోయింగ్‌గా ఉంది. టీజర్‌ని బట్టి ఈ సినిమాలో మన పురాతన తాంత్రిక రహస్యాలని వెలికితీస్తున్నట్టు తెలుస్తోంది. అనన్య దుష్టశక్తి బారిన పడిన అమ్మాయిగా కొత్తగా కనిపిస్తోంది. అనన్య ఇంతవరకు చెయ్యని ఒక క్రేజీ రోల్ చేస్తోందని మేకర్స్ చెబుతున్నారు. క్షుద్రపూజలు చేసే తాంత్రికుడిగా 'టెంపర్ వంశీ' లుక్ బాగా సెట్ అయ్యింది. సలోని పాత్ర మిస్టీరియస్‌గా కనపడుతోంది. ప్రస్తుతం హర్రర్ ట్రెండ్ నడుస్తోంది. క్షుద్రపూజలు ఇతివృత్తంగా వస్తున్న సినిమాలు బ్లాక్‌బస్టర్ హిట్స్ కొడుతున్న టైమ్‌లో వస్తున్న ఈ మూవీ కూడా ప్రామిసింగ్‌గా కనపడుతోంది. శ్రీహరి తమ్ముడి కొడుకు ధనుష్ రఘుముద్రి ఈ మూవీతో హీరోగా పరిచయమవుతున్నాడు. రీసెంట్‌గా 'మంగళవారం' సినిమాతో ఆకట్టుకున్న మీసాల లక్ష్మణ్ ఈ సినిమాలో ఒక మంచి రోల్ చేయబోతున్నారు. ఫస్ట్ కాపీ మూవీస్, బి ద వే ఫిల్మ్స్ బ్యానర్స్ కలిసి రూపొందించిన ఈ సినిమా ఫస్ట్‌లుక్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. వాల్ట్‌డిస్నీలో పని చేసిన శ్రీనివాస్ గోపిశెట్టి ఈ మూవీతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ చిత్రానికి నిర్మాతలు నరేష్ బాబు పి, రవి చైతన్య.

ప్రేమలోని బాధని తెలియజేసే పాట



రోషన్ కనకాల, మానస చౌదరి

రవికాంత్ పేరేపు దర్శకత్వంలో రోషన్ కనకాల హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'బబుల్‌గమ్'. ఈ చిత్ర మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా మేకర్స్ మూడవ సింగిల్ 'జాను..' పాటని విడుదల చేశారు. శ్రీచరణ్ పాకాల చాలా స్టైలిష్‌గా ఉండే మనసుని హత్తుకొనే మెలోడీని కంపోజ్ చేశారు.

అనంత శ్రీరామ్ సాహిత్యం ప్రేమకథలోని బాధను, హీరో హార్ట్ బ్రేక్ ఎమోషన్‌ని అద్భుతంగా వర్ణిస్తుంది. లిరిక్స్‌లో చాల డెప్త్ ఉంది. పాట మళ్ళీ మళ్ళీ వినాలనిపించేలా ఉండటం విశేషం. ఈ అందమైన మాంటేజ్ సాంగ్‌ని జావేద్ అలీ పాడారు. పాటలో చక్కని ఎక్స్‌ప్రెషన్స్‌తో రోషన్ కనకాల మరోసారి ఆకట్టుకున్నాడు. మానస చౌదరి అతని ప్రేయసిగా అందర్నీ ఎట్రాక్ట్ చేస్తోంది. పాటలాగా విజువల్స్ కూడా ఆకట్టుకునేలా ఉన్నాయి. శ్రీచరణ్ పాకాల డిఫరెంట్ ట్రాక్‌లతో ఆల్బమ్‌ని స్కోర్ చేశాడు. మొదటి పాట పెప్పీ నెంబర్ అయితే, రెండవ పాట సెల్ఫ్ రెస్పెక్ట్ ర్యాప్. మూడో పాట మనసుని హత్తుకునే మెలోడీ.. అని చిత్ర బృందం తెలిపింది.'గరుడవేగ, తెల్లవారితే గురువారం, ఆకాశవాణి' చిత్రాలకు పనిచేసిన సురేష్ రగుతు సినిమాటోగ్రాఫర్ కాగా, 'తల్లుమల' ఫేమ్ కేరళ స్టేట్ అవార్డ్ విన్నర్ నిషాద్ యూసుఫ్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి మహేశ్వరి మూవీస్ నిర్మిస్తున్న ఈ సినిమా ఈనెల 29న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది.

వన్డే ప్రపంచకప్ ఫైనల్ పిచ్ యావరేజ్

రేటింగ్ ప్రకటించిన ఐసిసి.



దుబాయ్: వన్డే ప్రపంచకప్ ఫైనల్ జరిగిన పిచ్‌కు ఐసిసి రేటింగ్ ప్రకటించింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగిన ఫైనల్లో టాస్ ఓడిన టీమిండియా తొలిగా బ్యాటింగ్‌కు దిగి 50 ఓవర్లలో 240 పరుగులకు ఆలౌటైంది. ఆసీస్ 43 ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. అయితే ఈ మ్యాచ్ కోసం ఉపయోగించిన పిచ్ నాసిరకంగా ఉందంటూ విమర్శలు వచ్చాయి. టోర్నీలో ప్రతి మ్యాచ్‌లోనూ సునాయాసంగా నెగ్గిన టీమిండియా... ఆసీస్‌తో ఫైనల్‌లో మాత్రం చతికిపడింది. అందుకు పిచ్ కారణం అని, ఇంతకుముందు వాడిన పిచ్‌ను ఫైనల్‌కు సిద్ధం చేశారనిఅభిప్రాయాలు వినిపించాయి. ఈ నేపథ్యంలో, అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) ప్రతినిధులు మరోసారి నరేంద్ర మోడీ స్టేడియం పిచ్‌ను పరిశీలించి రేటింగ్‌ను ఇచ్చారు. వరల్డ్ కప్ ఫైనల్ కోసం ఉపయోగించిన పిచ్ 'యావరేజ్'గా ఉందంటూ ఐసిసి మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ తన నివేదికలో పేర్కొన్నారు. అంతేకాదు, వరల్డ్ కప్‌లో భారత్ ఆడిన 11మ్యాచ్‌ల్లో 5 మ్యాచ్‌లు ఇలాంటి 'యావరేజ్' పిచ్‌లపైనే నిర్వహించినట్టు కూడా ఐసిసి ఆ ప్రకటనలో పేర్కొంది. కాగా, వరల్డ్ కప్‌లో టీమిండియా-పాకిస్తాన్ మ్యాచ్ కోసం ఉపయోగించిన పిచ్‌నే ఫైనల్‌కు సిద్ధం చేశారంటూ ఆసీస్ కెప్టెన్ పాట్ కమిన్స్ కూడా ఆరోపించాడు.

సవితకే మళ్లీ పగ్గాలు



బెంగళూరు: స్పెయిన్ వేదికగా 15నుంచి జరగనున్న ఐదు దేశాల టోర్నమెంట్‌లో పాల్గొనే భారత మహిళల జట్టును హాకీ ఇండియా(హెచ్‌ఐ) శుక్రవారం ప్రకటించింది. గోల్ కీపర్ సవిత పునియకు మరో దఫా కెప్టెన్‌గా ఎంపికయ్యింది. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే 22మంది ఆటగాళ్ల జాబితాను హెచ్‌ఐ శుక్రవారం వెల్లడించింది. 'బలమైన జట్టుతో ఐదు దేశాల టోర్నీలో పాల్గొనేందుకు వెళ్తున్నామని, మిగిలిన నాలుగుజట్లు బలమైన జట్లు కావడంతో ఆ టోర్నమెంట్‌లో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మహిళల హాకీ చీఫ్ కోచ్ జన్నెకే షాప్‌మాన్ తెలిపారు. ఈ టోర్నమెంట్ ప్రదర్శన ఆధారంగా భారత్‌లో జరిగే క్వాలిఫయర్ టోర్నమెంట్‌లో ఆటగాళ్లను ఎంపిక చేయడం జరుగుతుందని, యూరోపియన్ టాప్‌క్లాస్ జట్లతో తలపడే భారతజట్టు ప్రదర్శనను ఎంతో దోహదపడుతుందని ఆమె తెలిపారు.

టోర్నీలో భారత్‌తోపాటు ఆతిథ్య స్పెయిన్, ఐర్లాండ్, జర్మనీ, బెల్జియం జట్లు ప్రాతినిధ్యం వహించనున్నాయి.

ఈ టోర్నమెంట్ స్పెయిన్‌లోని వెలెన్సియా వేదికగా డిసెంబర్ 15-22మధ్య జరగనుంది. ఈ టోర్నమెంట్ ముగిసిన అనంతరం రాంచీ వేదికగా జనవరి 13నుంచి ఒలింపిక్ క్వాలిఫయర్ మ్యాచ్‌లు జరగనున్నాయి.

జట్టు..

గోల్‌కీపర్లు: సవిత(కెప్టెన్), బిఛ్చూ దేవి ఖరిబమ్
డిఫెండర్లు: నిక్కి ప్రధాన్, ఉదిత, ఇషికా చౌదరి, గుర్జీత్ కౌర్, అక్షత అబోసో
మిడ్‌ఫీల్డర్లు: నిషా, వైష్ణవి, మోనిక, సలీమా తెతె, నేహా, నవ్‌నీత్ కౌర్, సోనిక, బల్జీత్ కౌర్
ఫార్వర్డ్స్: జ్యోతి ఛత్రి, సంగీత కుమారి, దీపిక, వందన కటారియా(వైస్ కెప్టెన్), బ్యూటీ దుంగ్‌దంగ్, షర్మిలా దేవి

ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు కిర్గియోస్, రడుకాను దూరం..

నాదల్, ఒసాకా పునరాగమనం



మెల్‌బోర్న్: వచ్చే ఏడాది జనవరిలో జరిగే ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు ఆస్ట్రేలియా స్టార్ ఆటగాడు కిర్గియోస్‌తోపాటు మహిళల సింగిల్స్ నుంచి రడుకాను వైదొలిగింది. ఈమేరకు గ్రాండ్‌స్లామ్ టోర్నీ నిర్వాహకులు కిర్గియోస్‌తోపాటు యుఎస్ ఓపెన్ మాజీ ఛాంపియన్ రాడుకాను కూడా ఓపెన్ ఎంట్రీ జాబితాలనుంచి వైదొలిగినట్లు ప్రకటించారు. అదే క్రమంలో స్పెయిన్ స్టార్ ఆటగాడు రఫెల్ నాదల్‌తోపాటు జపాన్ స్టార్ నవోమి ఒసాకా ఆస్ట్రేలియన్ ఓపెన్ బరిలో దిగుతున్నట్లు వెల్లడించారు. గతంలో 13వ ర్యాంకర్‌గా ఉన్న కిర్గియోస్ మోకాలికి శస్త్రచికిత్స చేయించుకొని ఈ ఏడాది జనవరి నుంచి టెన్నిస్‌కు దూరంగా ఉంటున్నాడు. వీరిద్దరికీ వైల్డ్‌కార్డ్ ఎంట్రీతో టోర్నమెంట్‌లో ఆడించాలని ఆశించినా ప్రయోజనం లేకపోయిందని నిర్వాహకులు తెలిపారు. 2024 జనవరి 14-28మధ్య ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ జరగనుండగా.. డిఫెండింగ్ ఛాంపియన్లుగా అర్యానా సబలెంకా, నొవాక్ జకవోవిచ్ బరిలోకి దిగనున్నారు.

12 ఏండ్లయినా చెరగని రికార్డు

సెహ్వాగ్ డబుల్ బాదిన రోజు..



వీరేంద్ర సెహ్వాగ్ ప్రపంచంలోనే అత్యంత విధ్వంసకర ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్‌గా పరిగణించబడ్డాడు. సెహ్వాగ్ టెస్ట్ క్రికెట్‌లో కూడా తుఫాను బ్యాటింగ్ చేసేవాడు. సెహ్వాగ్ తన కెరీర్‌లో టీమ్ ఇండియా కోసం ఎన్నో మరపురాని ఇన్నింగ్స్‌లు ఆడాడు. ముల్తాన్‌లో పాకిస్థాన్‌పై 309 పరుగుల ఇన్నింగ్స్‌ను ఎవరు మర్చిపోలేరు. ఈ చిరస్మరణీయ ఇన్నింగ్స్ తర్వాత మాత్రమే సెహ్వాగ్‌ను 'సుల్తాన్ ఆఫ్ ముల్తాన్' అని పిలవడం ప్రారంభించాడు.

సెహ్వాగ్ రికార్డు ఈనాటికీ అలాగే...

45 ఏండ్ల వీరేంద్ర సెహ్వాగ్‌కి డిసెంబర్ 8 కూడా చాలా ప్రత్యేకమైన రోజు. ఇండోర్‌లోని హెూల్కర్ స్టేడియంలో 12 ఏండ్ల క్రితం ఇదే రోజున సెహ్వాగ్ చరిత్ర సృష్టించాడు. ఆ తర్వాత వెస్టిండీస్‌తో జరిగిన వన్డే మ్యాచ్‌లో సెహ్వాగ్ 219 పరుగుల ఇన్నింగ్స్ ఆడాడు. ఆ సమయంలో కెప్టెన్‌గా వన్డేల్లో డబుల్ సెంచరీ సాధించిన ప్రపంచంలో నే తొలి ఆటగాడిగా సెహ్వాగ్ నిలిచాడు .దాదాపు ఆరేండ్ల తర్వాత ఈ ఫీట్‌ను భారత ఆటగాడు రోహిత్ శర్మ కూడా సాధించాడు. కెప్టెన్‌గా కూడా అజేయంగా 208 పరుగులు చేశాడు. 2017లో శ్రీలంకతో మొహాలీ వన్డేలో రోహిత్ ఈ రికార్డు సృష్టించాడు. అయితే, కెప్టెన్‌గా వన్డే ఇంటర్నేషనల్‌లో అత్యధిక స్కోరు చేసిన రికార్డు ఇప్పటికీ వీరేంద్ర సెహ్వాగ్ పేరిట ఉంది. 12 ఏండ్ల తర్వాత కూడా సెహ్వాగ్ రికార్డు చెక్కుచెదరలేదు.

వన్డే ఇంటర్నేషనల్‌లో ఇప్పటివరకు 9 మంది బ్యాట్స్‌మెన్ డబుల్ సెంచరీలు సాధించారు. ఈ ఐదుగురు భారతీయులు సచిన్ టెండూల్కర్, వీరేంద్ర సెహ్వాగ్, రోహిత్ శర్మ, ఇషాన్ కిషన్ , శుభమాన్ గిల్. వెస్టిండీస్‌కు చెందిన క్రిస్ గేల్, న్యూజిలాండ్‌కు చెందిన మార్టిన్ గప్టిల్, పాకిస్థాన్‌కు చెందిన ఫఖర్ జమాన్, ఆస్ట్రేలియాకు చెందిన గ్లెన్ మాక్స్‌వెల్ కూడా ఈ ఘనత సాధించారు. వన్డేల్లో మూడుసార్లు డబుల్ సెంచరీ చేసిన ప్రపంచంలోనే తొలి క్రికెటర్ రోహిత్.

సెహ్వాగ్ అంతర్జాతీయ రికార్డు...

వీరేంద్ర సెహ్వాగ్ మొత్తం 104 టెస్టుల్లో 23 సెంచరీలతో సహా 8586 పరుగులు చేశాడు. దక్షిణాఫ్రికాపై వీరూ చేసిన అత్యధిక స్కోరు 319. రెండు ట్రిపుల్ సెంచరీలు సాధించిన ఏకైక టీమ్ ఇండియా ఆటగాడు. వన్డే ఇంటర్నేషనల్ గురించి మాట్లాడుతూ, వీరేంద్ర సెహ్వాగ్ 15 సెంచరీలు , 38 హాఫ్ సెంచరీల సహాయంతో 8283 పరుగులు చేశాడు. వన్డే ఇంటర్నేషనల్‌లో సెహ్వాగ్ అత్యధిక స్కోరు 219 పరుగులు. ఇది కాకుండా 19 టీ20 ఇంటర్నేషనల్స్‌లో సెహ్వాగ్ పేరిట 394 పరుగులు కూడా నమోదయ్యాయి.

ఫిలిప్స్ అర్ధసెంచరీ

న్యూజిలాండ్‌కు ఆధిక్యత



ధాకా: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండో, చివరి టెస్ట్‌లో న్యూజిలాండ్ జట్టు 8పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యతను సాధించింది. ఐదు వికెట్ల నష్టానికి 55పరుగులతో మూడోరోజు ఆటను కొనసాగించిన న్యూజిలాండ్ జట్టును గ్లెన్ ఫిలిప్స్(88) అర్ధసెంచరీతో ఆదుకున్నాడు. మిఛెల్(18), జేమీసన్(20), కెప్టెన్ సోథీ(14)ల సాయంతో ఫిలిప్స్ బ్యాట్ ఝుళిపించాడు. దీంతో న్యూజిలాండ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 180 పరుగులకు ఆలౌటైంది. బంగ్లాదేశ్ బౌలర్లు మెహిదీ హసన్, తైజుల్ ఇస్లామ్‌కు మూడేసి, షోరిఫుల్ ఇస్లామ్, నయీమ్ హసన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆరంభించిన బంగ్లాదేశ్ జట్టు మూడోరోజు ఆట ముగిసే సమయానికి 2వికెట్ల నష్టానికి 38పరుగులు చేసింది. మహ్మదులా (2), నజ్ముల్(15) త్వరగా పెవీలియన్‌కు చేరినా.. జాకిర్(16), మోమినుల్ హక్(0) క్రీజ్‌లో ఉన్నారు. దీంతో బంగ్లాదేశ్‌కు 30 పరుగుల ఆధిక్యత లభించింది. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 172పరుగులు చేసిన విషయం తెలిసిందే.

43బంతుల్లో 193పరుగులు

టి10లీగ్‌లో సలీమ్ విధ్వంసం



దుబాయ్: టి10 లీగ్‌లో ఓ సంచలనం నమోదైంది. యూరోపియన్ క్రికెట్ టి10 లీగ్‌లో భాగంగా స్పెయిన్ ఆటగాడు హంజా సలీమ్ ధార్ కేవలం 43బంతుల్లోనే అజేయంగా 193పరుగులు చేసి రికార్డు నమోదుచేశాడు. ఇందులో 22సిక్సర్లు, 14 బౌండరీలున్నాయి. కాటలున్యా జాగ్వార్-సోహల్ హాస్పిటాల్టెట్ మధ్య జరిగిన మ్యాచ్‌లో హంజా ఈ రికార్డు నెలకొల్పాడు. హమ్జా చేసిన 193 పరుగులలో సిక్సర్ల ద్వారా 132 పరుగులు రాగా ఫోర్ల ద్వారా 56 (మొత్తంగా 188) పరుగులు వచ్చాయి. అంటే అతడు సింగిల్స్, డబుల్స్ ద్వారా చేసినవి 9 పరుగులు మాత్రమే. దీంతో తొలి బ్యాటింగ్ దిగిన జాగ్వార్.. నిర్ణీత 10 ఓవర్లలో ఒక్క వికెట్ కూడా నష్టపోకుండా 257 పరుగులు చేసింది. హమ్జాతో పాటు మరో ఓపెనర్ యాసిర్ అలీ 19 బంతుల్లోనే 58 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. టి10 క్రికెట్ చరిత్రలో ఇదే అత్యధిక స్కోరు కావడం గమనార్హం. అనంతరం ఛేదనలో హాస్పిటాల్టెట్ 10 ఓవర్లు ఆడి 8 వికెట్లు కోల్పోయి 104 పరుగులు చేసింది. దీంతో జాగ్వార్.. 153 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది.

పంజాబ్ కింగ్స్ హెడ్ కోచ్‌గా సంజయ్ బంగర్



మొహాలీ: పంజాబ్ కింగ్స్ హెడ్ కోచ్‌గా మాజీ వికెట్ కీపర్ సంజయ్ బంగర్ ఎంపిక య్యాడు. ఈ మేరకు ఆ ఫ్రాంచైజీ శుక్రవారం ట్విటర్ వేదికగా ఈవిష యాన్ని వెల్లడించింది. పంజాబ్ కింగ్స్ సిఇవో సతీష్ మీనన్ ట్విటర్‌లో ..సంజయ్ అనుభవజ్ఞుడైన కోచ్ మరియు సహాయ సిబ్బందితో గట్టి సంబధాలను కలిగి ఉన్నాడు. అతని సామర్థ్యంపై గట్టి నమ్మక ముందని, రాబోయే సీజన్‌లో పంజాబ్ జట్టు మెరుగైన ప్రదర్శన కనబరుస్తుందని ఆశిస్తుందన్నారు. గతంలో బంగర్ తమ ఫ్రాంచైజీకి హెడ్ కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తిం చారని, ప్రస్తుతం కోచ్‌గా ఉన్న ట్రేవర్ బెలీస్ పదవీ కాలం ముగియడంతో బంగర్‌ను కోచ్‌గా ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు . 51ఏళ్ల బంగర్ గతంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు రెండు సీజన్‌లకు కోచ్‌గానూ వ్యవహరించారు.

రాష్ట్ర మంత్రి

దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు సన్మానం



నవతెలంగాణ - ముషీరాబాద్

తెలంగాణ రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబును బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు నిరడి భూపేష్ సాగర్ వారి కార్యాలయంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎమ్మెల్యే రాజా సింగ్‌కు శుభాకాంక్షలు



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

గోషామహల్ నియోజక వర్గంలో ఎమ్మెల్యేగా రాజాసింగ్ ఎన్నికై హ్యాట్రిక్ సాధించడంతో ఆయనను శుక్రవారం ఆయన నివాసంలో మాలి సమాజ్ యువ మండల్ అధ్యక్షుడు, క్రాకరి గ్లాస్ వేర్ మర్చంట్ అసోసియేషన్ అధ్య క్షుడు సురేశ్ కుమార్ మాలిలు కలిశారు. ఈ సందర్భంగా రాజాసింగ్‌కు పుష్పగుచ్ఛాన్ని అందించి శు భాకాంక్షలు తెలిపారు.

'సీఎంకు ఉద్యోగస్తుల సహకారం ఉంటుంది'



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

తెలంగాణ మెడికల్ పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్1 రాష్ట్ర అధ్యక్షులు శ్రీ కర్నాటి సాయి రెడ్డి కోఠిలోని రాష్ట్ర కార్యాలయం వద్ద మాట్లాడుతూ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు సమస్యలను తెలిసిన నాయకునిగా ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చాలని. వైద్య ఆరోగ్య శాఖ లో ఉద్యోగులు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్న జీఓ 142 ను రద్దు దిశగా ఆలోచన చేస్తూ, జీఓ 317 లో నష్టపోయిన ఉద్యోగుల బాధలను తీర్చాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఛీఫ్ అసోసియేట్ ప్రెసిడెంట్ జి. రాజశేఖర్, ఉపాధ్యక్షులు బి. నాగేశ్వరరావు,భద్రాద్రి అధ్యక్షులు రాంప్రసాద్, ఆప్తాల్మిక్ ఆఫీసర్ కె రమేష్, తదితరులు పాల్గొని నూతన ప్రభుత్వానికి అన్ని వేళల్లో సంపూర్ణముగా సహకారం అందిస్తామని తెలియజేశారు.

యువతీ యువకులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ



నవతెలంగాణ - ముషీరాబాద్

అప్స స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో యువతి యువకులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ అవకాశం కల్పిస్తున్నట్టు, దరఖాస్తు చేసుకోవాలని అప్సా ప్రాజెక్ట్ మేనేజర్ ప్రవీణ్ తెలిపారు. ముషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి మేనేజర్ ప్రవీణ్ హాజరై మాట్లాడుతూ అనుభవం గల ఉపాధ్యాయులచే యువతీ యువకులకు శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు . అప్స క్వెస్ట్ అలయన్స్ ద్వారా నిరుద్యోగులైన యువతీయువకులకు ఉద్యోగ అవకాశాలు అందించడం కోసం 18 ఏండ్లు నిండి 28 ఏండ్ల లోపు యువతీ యువకులు శిక్షణ పొందవచ్చు అన్నారు. ఎంఎస్ ఆఫీస్ ,అడ్వాన్స్ ఎక్సెల్ , ఇంటర్నెట్ కాన్సెప్ట్ లైఫ్ స్కిల్ శిక్షణ స్పోకెన్ ఇంగ్లీష్ వంటి శిక్షణ ఉచితంగా ఇవ్వడమే కాకుండా వారికి ఉద్యోగ అవకాశాలు అందిస్తు న్నామని అన్నారు. శిక్షణ కోసం సంప్రదించవలసిన వారు రాంనగర్ గుండు బస్సు స్టాప్ జె పి రెసిడెన్సీ యూనివర్సల్ బేకరీ విద్యానగర్ వద్ద లేదా, జవహర్ నగర్ జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయం ఆర్టీసీ క్రాస్ రోడ్‌లలో 8464007488, 9966458891, 8464921150, 8897573878, 8096666902 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

కలుషిత మంచినీరు సమస్యను పరిష్కరిస్తాం



- కవాడిగూడ కార్పొరేటర్ రచన శ్రీ

నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గంలోని కవాడిగూడ డివిజన్ వినాయక నగర్ బస్తీలో కలుషిత మంచినీటి సమస్యను పరిష్కరిస్తామని కార్పొరేటర్ రచన శ్రీ అన్నారు. కలుషిత మంచినీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న వినాయక నగర్ బస్తీలో కార్పొరేటర్ రచన శ్రీ సంబంధిత అధికారులతో కలిసి శుక్రవారం పర్యటించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు రూ. 9 లక్షల వ్యయంతో నూతన మంచినీటి పైప్ లైన్‌ను వేయించి ఈరోజు ఆ పనులను పర్యవేక్షించడం జరిగిందని తెలిపారు. త్వరలోనే సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ , మహేందర్ బాబు, శ్రీనివాస్ యాదవ్, పరశు రాం, విష్ణు, శంకర్‌లాల్, మహేందర్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో
సెయింట్ పాల్ స్కూల్ విద్యార్థులు
నవతెలంగాణ - అంబర్ పేట

మల్లన్న సాగర్ ప్రాజెక్టు
బాధితులకు పూర్తి పరిహారం చెల్లించాలి

- ప్రాజెక్టుల్లో నష్టపోయిన బాధిత రైతులకు న్యాయం చేయాలి
- లేనిపక్షంలో జాతీయ స్థాయి ఉద్యమాలు చేస్తాం
- బాధిత రైతాంగ పోరాట వేదిక కన్వీనర్ తన్నీరు వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-హిమాయత్ నగర్

మల్లన్న సాగర్ ప్రాజెక్టుల బాధితులకు రావలసిన న్యాయమైన పూర్తి పరిహారం తిరిగి చెల్లించాలని బాధిత రైతాంగ పోరాట వేదిక కన్వీనర్ తన్నీరు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శు క్రవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తన్నీరు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలో వివిధ ప్రాజెక్టుల్లో జీవితాలను కోల్పోయిన బాధిత రైతులకు పూర్తి స్థాయి నష్ట పరిహారాలు చెల్లించి న్యాయం చేయాలని ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.డిసెంబర్ 2న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ధర్మాగ్రహ సభ విజయవంతం అయిందని, ఈ సభలో భవిష్యత్తు ఉద్యమ కార్యచరణ రూపొందించామని తెలిపారు.వేదిక డిమాండ్లను ప్రభుత్వాలు పరిష్కరించాలని, లేనిపక్షంలో త్వరలో ఉద్యమ కార్యచరణ నిర్మిస్తామని హెచ్చరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సీతారాం ప్రాజెక్టు బాధిత రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని, ప్రధానంగా ఏజెన్సీ ప్రాంత గిరిజనేతర రైతులకు మధ్య భూమార్పిడిపై ఎలాంటి కొనుగోలు జరపరాదని చట్టం ఉందని, ఇక్కడ ఎకరానికి బాధిత రైతులకు రూ.8 లక్షలు ఇచ్చి, పక్కనే ఉన్న ఇతర ప్రాంతాల వారికి రూ.30 లక్షల నష్టపరిహారం ఇచ్చారని, దీని వల్ల పంటలు పండే భూములను పోగొట్టుకున్న ఏజెన్సీ రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు.గిరిజన చట్టాలను అనుసరించి వారికి అన్నం పెట్టే భూములకు ఎకరాకు రూ.35 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.అదే విధంగా చందనపల్లిలో ఇన్స్రా పేరుతో ప్రభుత్వ దళారీ సంస్థ బాధిత రైతులకు కేవలం రూ.8 లక్షలు చెల్లించి ప్రభుత్వం నుండి రూ.1 కోటి వరకు కంపెనీలకు అమ్మి దళారీగా వ్యవహరించి రైతులకు అన్యాయం చేశారని ఆరోపించారు. తాండూరు ఏరియాలో చెట్టినాడు సిమెంట్ కంపెనీ, రైల్వే ట్రాక్ బాధితులకు ప్రభుత్వ కంపెనీలు కలిసి బాధిత రైతులను మోసం చేశారని, వారికి న్యాయం చేయాలని కోరారు.శ్రీశైలం ప్రాజెక్టు బాధిత రైతాంగం దశాబ్దాలుగా పరిహారం అందని వారికి వెంటనే తగు న్యాయం చేయాలని, ఏపీలో పోలవరం ప్రాజెక్టు వెంటనే పూర్తి చేసి రాయలసీమ తదితర కరువు ప్రాంత రైతులకు కరువు నుంచి విముక్తి చేయాలని కోరారు.అమరావతి రాజధాని నిర్మాణం కోసం ఉచితంగా భూములు ఇచ్చిన రైతులకు జీవ విధ్వంసం కుట్రలపై సుప్రీంకోర్టులో రిటైర్డ్ జడ్జితో విచారణ కమిషన్ వేసి దోషులను శిక్షించాలని కేంద్ర హోం శాఖను డిమాండ్ చేశారు.కరోనా కాలంలో వైద్యం కోసం అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న బాధిత రైతు కుటుంబాల కోసం పార్లమెంటులో ప్రకృతి విపత్తు చట్టాలను తీసుకురావాలన్నారు.ఈ చట్టం కరువు కాటక రైతులకు కొంత ఉపశమనం కలిగిస్తుందని చెప్పారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే బాధిత రైతుల సమస్యలు పరిష్కరించకపోతే జాతీయ స్థాయిలో భారీ రైతు ఉద్యమాలు చేపడుతామని ఆయన హెచ్చరించారు.ఈ సమావేశంలో రైతాంగ పోరాట వేదిక నాయకులు ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

'పేద వృద్ధ కళాకారులకు నిధి ఏర్పాటు చేయాలి'

నవతెలంగాణ-కల్చరల్



ఎందరో తమ జీవితాలను విభిన్న కళలకు అంకితం చేసి పేదరికంలో వృద్ధాప్యంలో గడుపుతు న్నారని వారికి ఒక సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రామలింగేశ్వర రావు సూచించారు. తెలుగు విశ్వవిద్యాలయం లోని ఎన్‌టీఆర్ కళా మందిరం లో సర్వ కళాకారుల సంక్షేమ వేదిక ఆరంభ కార్యక్రమం జరిగింది. పలువురు నృత్య కళాకారులు కథక్, భరత నాట్యం, కూచిపూడి నాట్య అంశాలతో సభను రంజిప జేశారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ రామలింగేశ్వర రావు పాల్గొని మాట్లాడుతూ జీవితాన్ని కళా ప్రక్రియలలో చూసే సంప్రదాయం మనది అన్నారు.. కరోనా సమయం లో కళాకారులకు ఉపాధి అవకాశాలు లేక పోయిన తరుణంలో ఏర్పడిన సంస్థను కొండల రావు వంటి దాతలు ఆదుకోవటం అభినందనీయం అన్నారు. అధ్యక్షత వహించిన సారిపల్లి కొండల రావు మాట్లాడుతూ కళా కారులు దేశ సంపద అని వారిని కాపాడుకోవాలని కోరారు. సంస్థ అధ్యక్షుడుఅశోక్ పవర్ స్వాగతం పలుకుతూ సంస్థ లక్ష్యాలు వివరించారు.యువ కళా వాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ మాట్లడుతూ పేద కళాకారులను కొండల రావు ఎన్నో ఏండ్లుగా అడుకుంటున్నారని వివరించారు..అనంతరం మానస నందిని,భువనేశ్వరి, విద్యం గౌడ్, శారద లకు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యదర్శి రవిచంద్ర నివేదిక సమర్పించారు.





నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్‌ను నాంపల్లి ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సునీత కలిసి పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి డాక్టర్ గిరిధర్, డాక్టర్ శ్రీదేవి, సదానంద,శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-సుల్తాన్ బజార్

సహజ నటనాభినేత్రి సావిత్రి పుస్తకావిష్కరణ

నవతెలంగాణ-కల్చరల్



తెలుగు సినీ పరిశ్రమలో కొన్ని పాత్రలు సావిత్రిని వెతుక్కుంటూ వచ్చా యని తానా సంస్థ పూర్వ అధ్యక్షుడు జయరామ్ కోమటి అన్నారు. ఎటువంటి క్లిష్ట పాత్రలలోనైనా అవలీలగా జీవించగల సావిత్రి ఇప్పటికే తెలుగు ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయారని ఆయన వ్యాఖ్యానించారు. మహానటి సావిత్రి 87వ జయంతి వేడుకల సభను మిరిపిటాస్ (కాలిఫోర్నియా, అమెరికా)లో బాటా సంస్థ ఆధ్వర్యంలో బాటా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సహజ నటనాభినేత్రి సావిత్రి (సావిత్రి నటించిన సుమారు 80 చలన చిత్రాలపై 80 మంది రచయితలు, రచయిత్రులు రాసిన విశ్లేషణాత్మక వ్యాసల సంపుటి) పుస్తకాన్ని జయరామ్ కోమటి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రి కారణజన్మురాలని, ఆమె నటించిన చిత్రాలన్నీ ప్రజాదరణ పొందాయని అన్నారు. సావిత్రి లాంటి నటి ఇక తెలుగు నేలపై ఇక జన్మించదని, ఆమెకు ఆమే సాటి అని ఆయన పేర్కొన్నారు. ముందుగా జయరామ్ సావిత్రి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. బాటా సంస్థ అధ్యక్షుడు కొండల్ కొమరగిరి, ఉపాధ్యక్షుడు కే.శివ, కార్యదర్శి వరుణ్ ముక్క, సహాయ కార్యదర్శులు హరి సన్నిధి, కమిటీ సభ్యులు రవి తిరు వీదుల, కామేష్ మల్లా, శిరీష బత్తుల, తదితరులు ఈ పుస్తకావిష్కరణ సభలో పాల్గొన్నారు. కలవెండి ఫౌండేషన్ అధ్యక్షుడు కే.ఎస్.మూర్తి ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించారు.ఈ సందర్భంగా సావిత్రి నటించిన పలు తెలుగు చిత్రాలలోని పాటలను యువ గాయని గాయకులు మధురంగా ఆలపించారు. ఇదే సభలో అమర గాయకుడు ఘంటసాల 101వ జయంతి నా పురస్కారించుకొని బాటా సంస్థ సలహాదారులు విజయ ఆసూరి ఘంటసాల చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మంత్రిగా

పొన్నం ప్రభాకర్‌ను నియమించడం హర్షనీయం

- బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

మంత్రిగా పొన్నం ప్రభాకర్ ను నియమించడం హర్షనీయమని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజ్ కుమార్ తెలిపారు. పొన్నం ప్రభాకర్‌ను వారి కార్యాలయంలో ఆయన శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ. ప్రగతి భవన్‌కు మహాత్మ జ్యోతిరావు పూలే భవనంగా పేరు పెట్టడం స్వాగతిస్తున్నామన్నారు. దీనికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన పొన్నం ప్రభాకర్‌ను మంత్రిగా నియమించడం బీసీ సంఘాల పక్షాన హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. బీసీ ఉద్యమంలో కీలక పాత్ర వహించి మండల్ కమిషన్ ఉద్యమంలో కీలక పాత్ర వహించి బీసీల ఆర్థిక సామాజిక పరిస్థితులపై అవగాహన ఉన్న నాయకుడు అలాంటి నాయకుడిని మంత్రిగా నియమించడం వల్ల బీసీల సమగ్ర అభివద్ధి జరుగుతుందన్నారు. రాష్ట్రంలో గత పది సంవత్సరాల నుంచి బీసీ విద్యార్థులు కులవత్తుల వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ప్రస్తుత ప్రభుత్వం బీసీలకు అండదండగా ఉంటుందని మ్యానిఫెస్టోలో ప్రకటించడంతో బీసీలందరూ ఆనందంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాము తదితరులు పాల్గొన్నారు.

నూతన రోడ్డును

ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం

- కార్పొరేటర్ పావని వినయ్ కుమార్

నవతెలంగాణ - ముషీరాబాద్



ముషీరాబాద్ నియోజకవర్గం గాంధీనగర్ డివిజన్ నర్మదా నర్సింగ్ హోమ్ సమీపంలోని మాధవరావు లైన్‌లో నిర్మిస్తున్న నూతన వీడిసిసి రోడ్డును మరో 15 రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి తెస్తామని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ తెలిపారు. నిర్మాణ దశలో ఉన్న నూతన వీడీసీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణం పనులు కొనసాగుతున్నాయని, మరో పదిహేను రోజుల్లో స్థానిక మాధవరావు లేన్ కాలనీ వాసుల రోడ్డు సమస్య పరిష్కారమై, నూతన రోడ్డు ప్రజల అందుబాటులోకి వస్తుందని తెలిపారు. డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న మరిన్ని అభివద్ధి పనులను పూర్తి చేసేందుకు కషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నగర యువ నాయకులు ఎ.వినయ్ కుమార్ , జీహెచ్ఎంసీ అసిస్టెంట్ ఇంజినీర్ అబ్దుల్ సలామ్, వర్క్ ఇన్స్పెక్టర్ మహేష్,శ్రీనివాస్, పలువురు స్థానికులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి అభినందనలు తెలిపిన టీఎన్జీవోలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ రాష్ట్ర రెండో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఏనుముల రేవంత్ రెడ్డికి శుక్రవారం సచివాలయంలో టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ అధ్వర్యంలో కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ గౌడ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం. హుస్సేని(ముజీబ్), కేంద్ర సంఘ నాయకులు టి.పర్వ తాలు కలిసి అభినందనలు తెలియజేశారు. అనంతరం మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, జూపల్లి కృష్ణారావుని కలిసి అభినందనలు తెలిపారు. పది లక్షల ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాల తరుపున శుభాకాంక్షలు తెలియ జేశారు. ప్రజల ఆకాంక్షల మేరకు తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడాన్ని యావత్ తెలంగాణ ఎన్జీవోల సంఘం పక్షాన హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేస్తున్నామన్నామని తెలిపారు. ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా అనేక హామీలను తమ మానిఫెస్టోలో చేర్చినందున ఉద్యోగుల సహకారంతో నూతన ప్రభుత్వం ఏర్పడిందని, రాష్ట్ర అభివృద్ధి కోసం ఉద్యోగులుగా ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేస్తామని టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ చెప్పారు.

ఈ శుభ సందర్భంలో టీఎన్జీవోస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్) ఆధ్వర్యంలో గృహకల్ప కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, కస్తూరి వెంకటేశ్వలు, కొండల్ రెడ్డి, ఉమాదేవి, జిల్లా కార్యదర్శి విక్రమ్ కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు కె.ఆర్.రాజ్ కుమార్, కోశాధికారి బాలరాజ్, సభ్యులు కుర్రాడి శ్రీనివాస్, ఖాలీద్ అహ్మద్, వైదిక్ శాస్త్ర, బొలిగిద్ద శంకర్, శ్రీధర్, ముఖీం ఖురేషి, వహీద్, ఇతర యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు సమక్షంలో భారీ కేక్ కటింగ్ చేసి బాణసంచ కాల్చారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి



నవతెలంగాణ-కాప్రా

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మల్లాపూర్ డివిజన్ వార్డు కార్యాలయంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు డీఈ రూప, ఏఈ శ్రవంతితో కలిసి డివిజన్‌లో చేసే అభివృద్ధి పనులపై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు
శుభాకాంక్షలు తెలిపిన శ్రవణ్ కుమార్ గౌడ్



నవతెలంగాణ-కాప్రా

రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కాంగ్రెస్ నాయకులు శ్రవణ్ కుమార్‌గౌడ్ శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం గౌడ కులానికి చెందిన వ్యక్తికి మంత్రి పదవి ఇవ్వడం సంతోషకరమన్నారు. బీసీల సంక్షేమ కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. దొరల పాలనకు చరమగీతం పాడిన రేవంత్ రెడ్డికి బీసీలంతా రుణపడి ఉంటారని తెలిపారు.

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



నవతెలంగాణ-కాప్రా

బీఆర్ఎస్ పార్టీ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ కాలనీల సంక్షేమ సంఘం నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం సైనిక్‌పూరిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బండారిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రజల అభిమానం, ప్రేమ ఎల్లవేళ్లలా ఇలాగే ఉండాలన్నారు. ప్రతి కాలనీని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు.

అంతకుముందు బండారి లక్ష్మారెడ్డిని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ, ఏఎంసీ ఆనంద్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట భరత్, సాయిజెన్ శేఖర్, బన్నాల ప్రవీణ్ ఉన్నారు.

ఆడ పిల్లలను మగ పిల్లలతో సమానంగా చూడాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మహిళా సాధికారత కేంద్రం డిస్టిక్ కో-ఆర్డినేటర్ ప్రియాంక



నవతెలంగాణ-సిటీబ్యూరో

అమ్మాయిలకు నేడు రక్షణ కరువైందని, వారి పట్ల లింగ వివక్ష చూపుతున్నారని, అమ్మాయిలను కూడా అబ్బాయిలతో సమానంగా చూడాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మహిళా సాధికారత కేంద్రం డిస్టిక్ కో-ఆర్డినేటర్ ప్రియాంక, జెండర్ స్పెషలిస్ట్ వాసవి, సవిత ఫైనాన్స్ లిటరసీ శ్రావణి అన్నారు. మీర్‌పేట తిరుమలానగర్‌లోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో 'భేటీ బచావో-భేటీ పడావో' కార్యక్రమంపై మహిళలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. బాలికలను చదివిస్తే మహిళా సాధికారత సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా బాలికలకు బాల్యవివాహాలు, బాల కార్మిక చట్టాలు, పోక్సో చట్టం, చైల్డ్‌లైన్, సఖీ సెంటర్, హెల్ప్ లైన్ నెంబర్ 100, 181, 1098, 14567పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత బృందం సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి కేవీపీఎస్ శుభాకాంక్షలు



నవతెలంగాణ-కాప్రా-దుండిగల్

రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రిగా నియమితులైన ఎనుముల రేవంత్‌రెడ్డికి, మంత్రి వర్గానికి కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) మేడ్చల్ జిల్లా కమిటీ శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం. కృపా సాగర్, నాగనిగళ్ల బాలపీరు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం దళితులకు ఇచ్చిన వాగ్దానాలను విస్మరించిందని తెలిపారు. వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో దళితుల ఆకాంక్షలు నెరవేర్చా లని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మూడు లక్షల దళిత కుటుంబాలకు మూడు ఎకరాలు చొప్పున భూమి పంచుతానని తొలి సంతకం చేసి అందులో రెండు శాతం దళితులకు కూడా భూమి ఇవ్వలేదన్నారు. పైగా దళితుల అసైన్డ్ భూములను బలవంతంగా లాక్కున్నారని విమర్శించారు. దళిత బంధును అర్హులకు ఇవ్వకుండా అనర్హులకు, వారి అనుయాయులకు ఫలహారంగా పంచి పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత బంధు పథకాన్ని యథావిధిగా కొనసాగిస్తూ అర్హులకు అందరికీ ఇవ్వాలన్నారు. విద్యా, వైద్యం, దళితులకు అందని ద్రాక్షగా మారిందన్నారు. దళితులకు ప్రభుత్వం మిగులు బంజరు భూములను పంచాలన్నారు. ఇండ్ల స్థలాలు, ఇండ్ల కేటాయింపుపై క్యాబినెట్ నిర్ణయం తీసుకొని ఇండ్లు లేని దళితులందరికీ ఇండ్లు నిర్మించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. మండలానికో రెసిడెన్షియల్ పాఠశాల నిర్మించి దళిత విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యను అందించాలన్నారు. 2016 నుంచి ఎస్సీ కార్పొరేషన్ రుణాల సబ్సిడీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణమే విడుదల చేయాలన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగులకు ఉద్యోగాల ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందర్నీ క్రమబద్ధీకరించాలని కోరారు. మున్సిపల్ గ్రామపంచాయతీ అసంఘటిత రంగ కార్మికులందరికీ కనీస వేతనం అమలు చేయాలని పేర్కొన్నారు. దళితులందరికీ రేషన్ కార్డులు, అర్హులైన అందరికీ ఆసరా పెన్షన్లు ఇవ్వాలని తెలిపారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారంటీలపై తొలి సంతకంతో చేయడంతో కేవీపీఎస్ హర్షం చేస్తుందని తెలిపారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేస్తుంది

- కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు శ్రీలత



నవతెలంగాణ-బోడుప్పల్

తెలంగాణలో అధికారంలోకి వస్తే అమలు చేస్తామని ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు ఇతర హామీలను తప్పకుండా అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ పీర్జాదీగూడ నగర అధ్యక్షురాలు శ్రీలత బద్రూ నాయక్ అన్నారు. రేవంత్ రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఆరు గ్యారంటీలపై తొలి సంతకం చేశారని చెప్పారు. సోనియా గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని శనివారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు అన్ని రకాల బస్సుల్లో ఉచితంగా ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం హర్షనీయమని అన్నారు. గత పాలకుల పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన ప్రతి ఒక్క హామీని అమలు చేస్తుందన్నారు.

16.3 శాతం 'సోనాలికా' మార్కెట్ వాటా

నవతెలంగాణ-సిటీబ్యూరో

సోనాలికా ట్రాక్టర్స్ ప్రతి నేల రకానికి కస్టమైజ్డ్ ట్రాక్టర్లను అభివృద్ధి చేసిన కంపెనీ నవంబర్-23లో అత్యధికంగా 16.3శాతం మార్కెట్ వాటాను సాధించింది. సోనాలికా నవంబర్ మొత్తం 12,891 ట్రాక్టర్ల అమ్మకాలను కూడా సాధించింది. ఇది నవంబర్-22లో విక్రయించిన 10,464 ట్రాక్టర్లతో పోలిస్తే అత్యధికంగా 23శాతం వృద్ధిని సాధించింది. దీంతో సోనాలికా నవంబర్-23లో పరిశ్రమ వృద్ధిని కూడా అధిగమించింది. వరుసగా ఏడో ఏడాది లక్ష ట్రాక్టర్ అమ్మకాల మార్కును అధిగమించింది. సోనాలికా ట్రాక్టర్స్ ప్రస్తుతం 15 లక్షల రైతు కుటుంబంగా ఉంది. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ రామన్ మిట్టల్ మాట్లాడుతూ "నవంబర్-23లో పరిశ్రమలో అత్యధికంగా 23శాతం వృద్ధితోపాటు మా గరిష్ఠ 16.3శాతం మార్కెట్ వాటాను సాధించినందుకు మేం సంతోషిస్తున్నాం.

పరిశ్రమ వృద్ధిని (2శాతం) అధిగమించడం కొనసాగించాం. దీంతో కేవలం 8 నెలల్లోనే లక్ష ట్రాక్టర్ల అమ్మకాల మార్కును అధిగమించాం" అని తెలిపారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని అత్వెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 70 మంది విద్యార్థులకు రూ.28వేలు విలువచేసే స్టడీ మెటీరియల్స్ (ఆల్‌ఇన్‌వన్) ఉపాధ్యాయుడు గడప నవీన్ సూచన మేరకు మల్కాజిగిరికి చెందిన మల్లికార్జున్ శుక్రవారం ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టడీ మెటీరియల్స్‌ను ఉపయోగించుకుని విద్యార్థులు పరీక్షల్లో ఉన్నంతగా రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మల్లికార్జున్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో వన భోజనాలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామారావు, ఉపాధ్యాయులు గడప నవీన్, మంజుల, వసీం, పద్మలత, ఉమాభారతి, రేణుక మహేష్, శ్రీదేవి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 10న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

నవతెలంగాణ-జవహర్‌నగర్

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఈ నెల 10న స్థానిక క్రీడా పాఠశాలలో ఎంపికలు నిర్వహిస్తామని మేడ్చల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కూరపాటి రాజశేఖర్ తెలిపారు. శామీర్‌పేట్ స్పోర్ట్స్ పాఠశాలలో ఎంపికలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు క్రీడలపై నైపుణ్యం పెంచుకోవాలని, చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్తు ఉంటుందని అన్నారు.

జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చే క్రీడాకారులకు గుజరాత్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఫోన్ : 9849612733 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

కాంగ్రెస్ ప్రజా పాలన ప్రారంభం : సమతా యాదవ్



నవతెలంగాణ-బోడుప్పల్

బీఆర్ఎస్ నియంత పాలనకు చరమగీతం పాడి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలనకు నాంది పలికడం శుభపరిణామం అని కాంగ్రెస్ పార్టీ బోడుప్పల్ మహిళా అధ్యక్షురాలు జి.సమత యాదవ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీలను అమలును ప్రారంభించడం సంక్షేమ పాలనకు నిదర్శనమని అన్నారు. తెలంగాణ తల్లి సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా శనివారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సదుపాయాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. త్వరలోనే ప్రజా సంక్షేమ పాలనతో తెలంగాణ అభివృద్ధి చెందుతుందని అన్నారు.

తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది
సమయ పాలన పాటించాలి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నరేష్



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదని సీపీఐ (ఎం) మండల కార్యదర్శి ఎం. నరేష్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉదయం 11 గంటలైనా తహశీల్దార్ కార్యాలయంలోని డీ సెక్షన్ అధికారులు కార్యాలయం తెరవడం లేదని తెలిపారు. అదేవిధంగా ఇన్ వార్డు సెక్షన్ సిబ్బంది ఉదయం 11.15 గంటలైనా అందుబాటులో ఉండడం లేదని చెప్పారు. తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించే విధంగా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మండల వ్యాప్తంగా ప్రజలు వివిధ సమస్యలపై ప్రజలు ఉదయం 10 గంటలలోపే తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుంటారని పేర్కొన్నారు. అప్పటికి కూడా సంబంధిత అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన గౌడ సంఘం



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని చర్లపల్లి డివిజన్ గౌడ సంఘం సభ్యులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గతంలో తెలుగుదేశం ప్రభుత్వం కేటాయించిన 5ఎకరాల స్థలం సమస్యను పరిష్కరించాలని లక్ష్మారెడ్డిని కోరారు. గౌడ సంఘం సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని బండారి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు కాసుల ఆనంద్ రాజ్‌గౌడ్, రుద్రగోని రాంచందర్ గౌడ్, రాగీరు నర్సింహ గౌడ్, నిమ్మల అశోక్ గౌడ్, రాజుగౌడ్, కె.ప్రేమ్ గౌడ్, ఆర్.నాథం గౌడ్, బాలకృష్ణగౌడ్, బాబూగౌడ్, శ్రీరాములు, క్రాంతి గౌడ్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ మండల ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణగుప్తా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మంచికంటి రాజవర్ధన్‌గుప్తా సభాధ్యక్షులుగా వ్యవహరించి నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఉప్పల్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా యెర్రం సుధాకర్ గుప్తా, ప్రధాన కార్యదర్శిగా చిత్తనూరి శ్రీనివాసులు గుప్తా, కోశాధికారిగా నాగమళ్ల శ్రీనివాస్ గుప్తా, అదనపు కార్యదర్శిగా నీలా శివకుమార్ గుప్తా ఎన్నికయ్యారు. అనంతరం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఆర్యవైశ్య సంఘానికి తన సహకారం ఎప్పటికీ ఉంటుందన్నారు. వైశ్యుల అభివృద్ధి కోసం ఎల్లవేళలా సహకరిస్తానని చెప్పారు. కొత్తగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వైశ్య పెద్దలు పాల్గొన్నారు.

అయ్యప్ప పడిపూజకు హాజరైన ఎమ్మెల్యే బండారి



నవతెలంగాణ-ఉప్పల్

రామంతపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న నాగేశ్వరరావు దంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం నెహ్రూ నగర్‌లోని ఐశ్వర్య హైట్స్‌లో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కఠోర ఉపవాసాలతో అయ్యప్ప స్వాములు చేపట్టే దీక్షతో మనస్సుకు శాంతి కలిగే ఆరోగ్యం, మానసిక ఆనందం కలుగుతుందన్నారు. ఆధ్యాత్మికంగా వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ నిర్వహించిన గంధం జ్యోత్స్న దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్‌తో పాటు పలువురు స్వాములు పాల్గొన్నారు.

గృహ ప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే మల్లారెడ్డి




నవతెలంగాణ-శామీర్‌పేట

మండల కేంద్రం శామీర్ పేట్‌లో బీఆర్ఎస్ నాయకులు వంగ వెంకట్‌రెడ్డి నూతన గృహ ప్రవేశానికి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి హాజరయ్యారు. అనంతరం బీఆర్ఎస్ శామీర్‌పేట మండల అధ్యక్షులు విలాసాగరం సుదర్శన్ ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కేసీఆర్ సేవాదళం రాష్ట్ర కార్యదర్శి బీఆర్ఎస్ జిల్లా నాయకులు మహ్మద్ అఫ్జల్ ఖాన్, మజీద్‌పూర్ సర్పంచ్ సరసం మోహన్‌రెడ్డి, ఉప సర్పంచ్ నర్లరమేష్ యాదవ్, రైతు సహకార సంఘం ఉపాధ్యక్షుడు ఐలయ్య యాదవ్, నాయకులు దండుగుల మైసయ్య, షేక్ చాంద్ పాషా, భూమిరెడ్డి, దాసరి బాబు, మేడి రవి, వార్డు సభ్యులు సత్యనారాయణ, ఉప్పలయ్య, రవీందర్, నవీన్ ముదిరాజ్, దూడల శ్రీకాంత్ గౌడ్, డి శ్రీకాంత్ గౌడ్, భద్రి, బాబు, షేక్ సాజిద్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి పక్షాలకు
విలువనిచ్చే ప్రభుత్వంగా పని చేయాలి

- రాష్ట్ర సామాన్య ప్రజా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జాకట శ్రీనివాస్



నవతెలంగాణ-మేడ్చల్

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిపక్షాలకు విలువనిచ్చే ప్రభుత్వంగా పనిచేయాలని రాష్ట్ర సామాన్య ప్రజా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జాకట శ్రీనివాస్ కోరారు. శుక్రవారం మేడ్చల్ మున్సిపాలిటీలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. సీఎం ఎనుముల రేవంత్ రెడ్డికి, మంత్రివర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం పేద, సామాన్య, ప్రజల ప్రభుత్వంగా పనిచేయాలని రాష్ట్ర సామాన్య ప్రజా పార్టీ తరఫున ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలు ప్రతిపక్షాల ద్వారానే ప్రభుత్వానికి తెలుస్తాయన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తే సమాజం బాగుపడుతుందని సూచించారు. తమ పార్టీ ప్రజల పక్షాన ఉంటూ ప్రతి సమస్యను ప్రభుత్వం వద్దకు తీసుకెళ్లి ప్రజలకు అండగా ఉంటామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలు అమలు చేయాలన్నారు.

చిరు వ్యాపారికి 'కార్న్ బస్టర్' పరికరాన్ని అందజేసిన
సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు



నవతెలంగాణ-మేడ్చల్

గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని కండ్లకోయ గ్రామంలో ఉన్న సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు సాంకేతికత అందరికీ అందుబాటులోకి తెచ్చి దాని ద్వారా ప్రజల సమస్యలు తొలగిపోవాలనే అనే ఉద్దేశ్యంతో మొక్కజొన్న పొత్తులు వేడిచేయుటకు సోలార్‌తో పనిచేసే "కార్న్ బస్టర్" పరికారాన్ని సీఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ అధ్యాపకులు బి.సురేష్ రామ్, కె.రవికిరణ్ పర్యవేక్షణలో విద్యార్థులు శ్రీరామ్, దీపిక, శశి కుమార్, తేజ శ్రీకృతిక విద్యార్థుల బృందం తయారు చేసారు. దీనిని మండల పరిధిలోని మునీరాబాద్ గ్రామంలోని పి.తారాబాయ్ అనే చిరు వ్యాపారికి అందచేశారు. విద్యార్థులు మాట్లాడుతూ ఈ పరికరం వ్యాపారికి శ్వాస కోశ వ్యాధి, చేయి నొప్పి సమస్యలు తలెత్తకుండా దోహదపడుతుందని వెల్లడించారు.

ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం సి.హెచ్ అభినవ్‌రెడ్డి అధ్యాపకులను, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సి.హెచ్ గణేష్, ఉప సర్పంచ్ నర్సింగ్ రావు, ప్రిన్సిపాల్ మేజర్ డా.వి. ఎ నారాయణ, జి. దేవదాస్, అధ్యాప కులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం సి. హెచ్ అభినవ్‌రెడ్డి, అధ్యాపకులను, విద్యార్థులను అభినందించారు.

తుమ్మ భూమన్న ఆశయ సాధనకు కృషి చేయాలి



- జై భీమ్ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బక్క నరేంద్ర

నవతెలంగాణ-మేడ్చల్

తుమ్మ భూమన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జై భీమ్ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బక్క నరేంద్ర అన్నారు. శుక్రవారం భూమన్న ప్రథమ వర్ధంతి సందర్భంగా మండల పరిధిలోని పూడూరు గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలవేసి కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం పోరాటం చేసిన గొప్ప వ్యక్తి తుమ్మ భూమన్న అని కొనియాడారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఏర్పుల హరి, గోపనబోయిన పరమేష్, గ్రామ అధ్యక్షుడు దేవక మధు, బక్క అనీల్, నాగని మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరగా కోలుకోవాలి..



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ/కూకట్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం రాత్రి దురదృష్టవశాత్తు క్రింద పడటంతో కాలుకు గాయం కావడం బాధాకరమని, త్వరగా కోలుకొవాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ని కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ దీవెనలతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఆ దేవున్ని ప్రార్థిస్తున్నారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు.

అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



- కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ అన్నారు. డివిజన్ పరిధిలోని గాయత్రి నగర్ సున్నం చెరువు పార్కులో ఏఈ రంజిత్, వర్క్ ఇన్స్పెక్టర్ వినాయకరావుతో కలిసి నూతనంగా 85 లక్షల వ్యయంతో జరుగుతున్న పార్కు అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహాయ సహకారాలతో నూతనంగా 85 లక్షల వ్యయంతో చిల్డ్రన్స్ ప్లే ఎక్విప్మెంట్స్, యోగ ప్లాట్ఫారం, ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, సెక్యూరిటీ రూమ్ పనులను పర్యవేక్షించడం జరిగిందన్నారు. సంజీవరెడ్డి, జ్ఞానేశ్వర్, టీవీఎస్ రాజు, యోగిరాజు, లక్ష్మి పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం శుభ పరిణామం



- ఏఐటీయూసీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కే. ఏసురత్నం

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం శుభ పరిణామమని ఏటీయూసీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కే.ఏసురత్నం అన్నారు. ఈ మేరకు శుక్రవారం నూతనంగా మున్సిపల్ శాఖ మంత్రిగా పదవి బాధ్యతలు స్వీకరించిన కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఆయనతోపాటు ఏఐటీయూసీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు చర్లపల్లి రాములు, ప్రజానాట్యమండలి అధ్యక్షులు ఆకుబత్తిని ప్రవీణ్‌లు నగరంలోని మంత్రి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పేద ప్రజల ప్రభుత్వమని రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు హర్షిస్తున్నారన్నారు. ప్రజా ఆమోదయోగ్యమైన పాలన కాంగ్రెస్ కే సాధ్యమని కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాక్స్ డ్రైన్ నిర్మాణంతో.. ముంపు సమస్యల పరిష్కారం



- కార్పొరేటర్ క్యానం రాజ్య లక్ష్మి

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ప్రతి వర్షా కాలంలో ఎదురవుతున్న వరద నీటి ముంపు సమస్య పరిష్కారానికే 'బాక్స్ డ్రైన్' నిర్మాణం చేపడుతున్నట్లు వినాయక్ నగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్య లక్ష్మి తెలిపారు. శుక్రవా రం ఆమె, డివిజన్ పరిధిలోని కాకతీ య నగర్ లిటిల్ ఫ్లవర్ స్కూల్ లైన్ లో రూ 1.10 కోట్ల అంచనా వ్యయంతో (275 మీటర్ల పొడవు) నూతనంగా నిర్మించ బోయే బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో అభివృద్ధి పనులను వేగవంతం చేశామన్నారు.బాక్స్ డ్రయినేజీ పనులు పూర్తి అయితే, వర్షపు నీటి సమస్యలు ఉండబో వన్నారు. ఎంతో ఆలోచన, కృషితో ఈ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు నిరంజన్, సాయి, కృష్ణ, వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటేష్, సాగర్, బీజేపీ డివిజన్ అధ్యక్షులు ఓం ప్రకాష్, సాయిసురేష్, నరేందర్, వెంకటేష్ పాల్గొన్నారు.

'తల్లిదండ్రులు దైవంతో సమానం'

- ఓల్డ్ ఏజ్ హెూమ్ గ్రేస్ వృద్ధాశ్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

తల్లి దండ్రులు దైవంతో సమానం అని వారి వృధాప్యంలో బాగా చూసుకోవాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని మిత్ర హిల్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రేస్ ఓల్డ్ ఏజ్ హెూమ్ గ్రేస్ వృద్ధాశ్రమంను ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ వృద్ధులకు అన్ని రకాల వసతులతో ,సకల సౌకర్యాలతో వృద్ధాశ్రమం ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. వారి యోగక్షేమాలు చూసుకొని, వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివేకానంద నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సంజీవ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కోనేరు ప్రసాద్, ప్రసాద్, యతేష్, గ్రేస్ ఓల్డ్ ఏజ్ హెూమ్ (గ్రేస్ వృద్ధాశ్రమం) చైర్మెన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద్ హ్యాట్రిక్ విజయం నా భూతో- నా భవిష్యత్



- భట్రాజు సంఘ ప్రతినిధులు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ భారీ మెజార్టీతో హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా విజయం సాధించడం నా భూతో - నా భవిష్యత్ అని భట్రాజు సంక్షేమసంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కూరపాటి కరుణాకర్ రాజు, కృష్ణంరాజు, సంఘ ప్రతినిధులు అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్‌ను మేడ్చల్ జిల్లా శాఖ, కుత్బుల్లాపూర్ శాఖ సభ్యులు ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఈనెల 10న ఆదివారం నాడు మేడ్చల్ జిల్లా, కుత్బుల్లాపూర్ భట్రాజు సంఘం ఆధ్వర్యంలో సూరారం డివిజన్, జీడిమెట్ల టోపాజ్ పరిశ్రమ సమీపంలోని శ్రీ నల్లగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న కార్తీక మాస వనభోజన మహెూత్సవ వేడుకలకు హాజరు కావాలని ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను సభ్యులు అందజేశారు. నియోజకవర్గంలో తాను అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందజేస్తారని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కూరపాటి రామరాజు, కుత్బుల్లాపూర్ అధ్యక్షులు తంగేళ్ల రాధాకృష్ణ భట్, ఉపాధ్యక్షులు సరికొండ శ్రీనివాసరాజు, వెంగళరాజు శ్రీనివాసరాజు, కార్యదర్శులు వేమ శేషంరాజు, బహటం కృష్ణార్జున రాజు, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు క్రీడా పోటీలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని వికలాంగులకు జూనియర్ విభాగం (10-16) వయస్సు, సీనియర్ విభాగం (17-35) వయస్సు గల వారందరికీ నేరేడ్‌మెట్ చౌరస్తాలోని రామకృష్ణపురం ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో చెస్, క్యారంబోర్డు, రన్నింగ్, జావెలిన్ త్రో, షాట్ పుట్, వీల్ చైర్, ట్రై సైకిల్ లాంటి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సంక్షేమ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. ఆసక్తి గల వికలాంగులు ఈ నెల 13, 14 తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తమ పేర్లను రామకృష్ణపురం ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. విజేతలకు బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు.

యువతి వివాహానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

అవని స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు శిరీష సత్తూర్ , ఆల్విన్ కాలని డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లో నివసించే ప్రీతి అనే పేద యువతి వివాహానికై , అవని స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు శిరీష సత్తూర్ రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో శశిధర్, శంకర్, వందు తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్‌లో వృద్ధుడు అదృశ్యం



నవతెలంగాణ-బాలానగర్

ఇంటి నుండి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం దయారాజు సుబ్బారావు గత నెల 7వ తేదీన ఇంటి నుంచి బయలుదేరిన వ్యక్తి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు స్నేహితుల, బంధువుల వద్ద నుండి ఆచూకీ లభించక పోవడంతో కుటుంబ సభ్యులు బాలానగర్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. బాలానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రగతి నగర్ ప్రగతి విద్యానికేతన్‌లో బాలోత్సవ క్విజ్ పోటీలు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతి హిల్స్‌లో గల ప్రగతి విద్యానికేతన్‌లో ఈనెల 10వ తేదీ ఆదివారం ఉదయం 8 గం॥ మొదలు మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యార్థులకు ఒకటవ తరగతి మొదలు సబ్ జూనియర్స్ 10 వ తరగతి వరకు ఎలాంటి ప్రవేశ రుసుము లేకుండా క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల మేనేజ్మెంట్ వారు తెలిపారు. 13 రకాల పోటీలలో పాల్గొనే విద్యార్థులు వెంటనే స్కూల్లో వారిని సంప్రదించి పేర్లు నమోదు చేసుకోగలరని తెలిపారు.

డ్రయినేజీ పనులను ప్రారంభించిన డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 7వ డివిజన్‌లో నూతనంగా ప్రారంభిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రయినేజీ లైన్ పనులను, శుక్రవారం డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ పైప్ లైన్ పనులను నాణ్యతతో, త్వరగా పూర్తి చేయాలనీ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 7వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంజునాథ్, 191 ఎన్టీఆర్ నగర్ జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, ఇంజనీర్ అరుణ్, కాంట్రాక్టర్ హరియా నాయక్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్‌ను కలిసిన చర్చ్ సభ్యులు



నవతెలంగాణ-దుండిగల్

డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్‌ని శుక్రవారం క్రిస్టియన్ మైనారిటీ కమిటీ, యునైటెడ్ చర్చిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కలిశవరు. ఈ సందర్భంగా వారి ఆధ్వర్యంలో నిర్వహించే ఎన్ఎంసీ గ్రాండ్ క్రిస్మస్ సెలబ్రేషన్స్ వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరు కాగలరని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంసీ బీఆర్ఎస్ క్రిస్టియన్ మైనారిటీ ప్రెసిడెంట్ రవికుమార్, జెనరల్ సెక్రెటరీ ప్రదీప్ శ్యామ్, జాయింట్ సెక్రటరీ జెరేమియ, ప్రగతినగర్ పాస్టర్స్ ప్రెసిడెంట్ సిల్వెస్టర్, యూసీ డబ్ల్యూఏ ట్రెజరర్ దయానిధి, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్ రాజుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు, పార్టీ శ్రేణులు శుక్రవారం శంభీపూర్ కార్యాలయంలో కలిశారు. సమస్యలను పరిష్కరించాలని కోరగా సానుకూలంగా స్పందించారు. నవతెలంగాణ-దుండిగల్

మరకత శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో 'సువర్ణ పుష్పార్చన'



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

అల్వాల్ పట్టణ పరిధిలోని కనాజిగూడలోని మరకత శ్రీ లక్ష్మీ గణపతి దేవస్థానంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వహకులు మోత్కూరు సత్యనారాయణ శాస్త్రీ ఆధ్వర్యంలో స్వామి వారికి 'సువర్ణ పుష్పార్చన' కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఆలయ అభివృద్ధికి అవసరమైన భూస్థల సేకరణకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. దాతలు విరాళాలు అందించి భూదాన ప్రక్రియలో పాలు పంచుకోవాలని ఆయన భక్తులను కోరారు. యధా విధిగా చిలకలగూడ చౌరస్తా, బసవతారక క్యాన్సర్ హాస్పిటల్ తదితర ప్రాంతాల్లో పేదలకు అన్న ప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. అన్నార్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో భక్తులు గీతప్రియ వెంకట్రావు దంపతులు పాల్గొన్నారు.

'ఎంఎల్ఆర్ఐటీ'లో నేషనల్ ఐపీ యాత్ర



నవతెలంగాణ-సిటీబ్యూరో

దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో శుక్రవారం 'నేషనల్ ఐపీ యాత్ర' నిర్వహించారు. మేధో సంపత్తి హక్కుల అవగాహనను పెంపొందించడానికి, భారతీయ ఆర్థిక వ్యవస్థలో సజనాత్మక మేధో ప్రయత్నాన్ని ప్రోత్సహించడానికి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ సహకారంతో ఐపీ యాత్ర-2023 నిర్వహించారు. ఈ నెల 8, 9 తేదీల్లో ఎంఎల్ఆర్ఐటీ కాలేజీలో 150 మందికి పైగా చిన్న వ్యాపార యజమానులు, విద్యార్థి వ్యవస్థాపకులు, అధ్యాపక సభ్యులకు వారి ఆలోచనలు, సంస్థలను పేటెంట్ చేయడానికి, పెంపొందించడానికి అవసరమైన నైపుణ్యాలను నేర్పించే ఈవెంట్‌ను హెూస్ట్ చేసే అవకాశాన్ని ఎంఎల్ఆర్ఐటీ పొందింది. ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం పేటెంట్ హక్కులు, మన దైనందిన జీవితంలో అవి పోషిస్తున్న పాత్రపై అవగాహన పెంచడం. పరిశ్రమల సలహాదారులు పేటెంట్‌ల గురించి, వ్యవస్థాపకుడు విక్రయించదగిన ఉత్పత్తిని కలిగి ఉంటే ఉపయోగించ గల హక్కుల గురించి వివరించారు. భారతదేశానికి, భారతీయ పౌరులకు పేటెంట్ల గురించి తెలుసుకోవడం ఎంత ముఖ్యమో ఈ కార్యక్రమంలో పాల్గొనే వారికి వివరించారు. మర్రి లక్ష్మణ్‌రెడ్డి పేటెంట్ల ప్రాముఖ్యత, మన భారత ఆర్థిక వ్యవస్థపై పేటెంట్ల ప్రభావం గురించి మాట్లాడారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్ రావు మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. ముఖ్య అతిథి ఎస్.గొల్లకోట పేటెంట్‌లపై విలువైన సమాచారాన్ని పంచుకున్నారు. కొన్ని నిజ జీవిత ఉదాహరణలను ఉదహరించారు. పేటెంట్ వస్తువులు, వ్యవస్థాపకతలో పాల్గొనడానికి యువతను ప్రోత్సహించారు. ఇది అనేక మంది ఫీల్డ్ నిపుణులు, నిపుణుల ఉపన్యాసాల నుంచి బహుళ ప్యానెల్ చర్చలు, సెషన్‌లను కలిగి ఉంది. ఈ సెషన్‌లు, ఉపన్యాసాలకు హాజరైన వారికి ఐపీఆర్ ప్రాముఖ్యత, వివిధ భాగాలు, దాని ఆస్తులు, ఐపీఆర్‌లో సాంకేతిక బదిలీ పాత్ర, అనేక ప్రక్రియలను అర్థం చేసుకోవడంలో సహాయపడ్డాయి. ఈ ప్రారంభోత్సవ వేడుకలో కళాశాల చైర్మెన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు, ముఖ్య అతిథి ఎస్.గొల్లకోట, మర్రి శ్రేయారెడ్డి, డైరెక్టర్, విజయ్ భాస్కర్ రెడ్డి, డాక్టర్ రాధికాదేవి, డా.వివేకానంద్, డా.ఎం.గుప్తా, డాక్టర్ నర్సింహులు, డాక్టర్ వై.బలరాం, కో ఆర్డినేటర్, డాక్టర్ వివేకానంద్ తదితరులు పాల్గొన్నారు.



వీవర్లీ చేనేత స్టోర్ ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 10లో చల్లపల్లి వారి వీవర్లీ చేనేత స్టోర్‌ని శుక్రవారం సినీనటి మీనాక్షి చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా మీనాక్షి చౌదరి మాట్లాడుతూ మగువలకు చీరలంటే మక్కువ అని, తనకు కూడా శారీస్ అంటే చాలా ఇష్టం అన్నారు. తెలుగు వారికి మరింత ఎక్కువ ఇష్టం అని, ఎందుకంటే శారీస్ లేడీస్ చక్కదనాన్ని పెంచుతాయని, వాళ్లకు నిండుదనాన్ని నింపుతాయని, అమ్మతనాన్ని అద్దుతాయని తెలిపారు. మహిళల జీవితంలోని మధురమైన ఘట్టాలన్నీ చీరలతో 'ముడిపడి ఉన్నాయని చెప్పారు. మనువు ముహూర్తం మొదలుకుని.. ముత్తైదువు తనం వరకు, నిశ్చితార్థం నుంచి శ్రీమంతం వరకు ప్రతి సందర్భంలోనూ వాళ్ల సంతోషానికి చీరలు అద్దంపడతాయన్నారు. ఇలా చెప్పుకుంటూపోతే చీరలోని గొప్పతనం అంతా ఇంతా కాదని, అలాంటి చీరలకు 'వీవర్లీ' చిరునామాగా నిలుస్తోందన్నారు. ఈ స్టోర్‌ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. జనవరిలో గుంటూరు కారం సినిమాతో మీముందు వస్తున్న మహేష్ బాబు యాక్ట్ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. వీవర్లీ స్టోర్ నిర్వహకులు చిల్లపల్లి నాగేశ్వరావు అండ్ సన్స్ మాట్లాడుతూ.. చేనేత చీరలకు ఐదు దశాబ్దాలుగా బ్రాండ్ నేమ్ మారిందన్నారు. 1971లో ప్రస్థానాన్ని ప్రారంభించిన ఈ సంస్థకు విజయవాడలోని మంగళగిరిలో చిల్లపల్లి హ్యాండ్లూమ్ స్టోర్స్ ఉన్నాయని తెలిపారు. నేడు బంజారాహిల్స్‌లో కూడా 'వీవర్లీ స్టోర్' పేరుతో షో రూం ఓపెన్ చేసినట్టు తెలిపారు. పెళ్లి పట్టు చీరలకు వీవర్లీ ప్రత్యేకత అన్నారు. దేశవ్యాప్తంగా రూపొందించే చేనేత చీరలు ఇక్కడ లభిస్తాయని, హ్యాండ్వర్క్, హ్యాండ్లూమ్, ఫ్యాబ్రిక్ ఏదైనా దొరుకుతాయని తెలిపారు. చేనేత చీరలకు మన దేశంలోని ఒక్కో రాష్ట్రంలో ఒక్కో వీవింగ్ యూనికెనెస్, ఒక్కో ప్రింటింగ్ స్టైల్ ఉంటుంది. వాటన్నింటినీ చిల్లపల్లివారు తమ దగ్గర అందిస్తున్నారు. ముఖ్యంగా హ్యాండ్ ప్రొడక్ట్స్ పైన ఫోకస్ పెట్టారు. 70 శాతం సొంత డిజైన్లనే విక్రయిస్తున్నారు. రెగ్యులర్ డిజైన్స్ ఇక్కడ చాలా తక్కువగా ఉంటాయి. వాటిని జనరల్ ఐటమ్స్ కేటగిరీలో అమ్ముతారు. వేరే శారీస్‌తో పోలిస్తే హ్యాండ్లూమ్ శారీస్ కొంచెం ఎక్కువ కాస్ట్లీ అని చెప్పొచ్చు. దీనికి చాలా కారణాలు ఉన్నాయి.

ఆరు గ్యారంటీలు అందుబాటులో తేవడం గర్వకారణం

- కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యంలో సోనియాగాంధీ, ఎన్నికల నేపథ్యంలో 6 గ్యారెంటీ పథకాల్లో భాగంగా రెండు గ్యారెంటీలు అనగా 10 లక్షల వరకు ఆరోగ్య శ్రీ, మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణం పథకం ,ఈ రెండు పథకాలను తెలంగాణ ప్రజలకు ఈ రోజు నుండి అమలుపరుచడం, తెలంగాణ ప్రజల అదృష్టం చాలా గర్వకారణం అని కూకట్ పల్లి కాంగ్రెస్ నాయకుడు బండి రమేష్ అన్నారు. గత ప్రభుత్వంలో ఆరోగ్య శ్రీ అడుగంటి పోయిందని తెలిపారు. కాబట్టి మన ముఖ్యమంత్రి ముందు చూపుతో ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చారనీ పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా ఏనుముల రేవంత్ రెడ్డి ప్రమాణస్వీకారం పట్ల కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ హర్షం వ్యక్తం చేశారు. అలాగే మిగత నాలుగు గ్యారంటీలను కూడా అతి త్వరగా అమలు పరుస్తారని ప్రజలు నమ్ముతున్నారని తెలిపారు. అలాగే తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానని అన్నారు. ఈ రోజు సోనియాగాంధీ జన్మదినం మన తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అదృష్టం గా కలిసి వచ్చిందని , ఆరు గ్యారంటీలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసి మళ్ళీ ఇందిరమ్మ పాలన ప్రజలకు అందుబాటులో కి తేవడం, ప్రగతి భవన్ గేట్లు ఎత్తివేసి ప్రజాదర్బార్ ఏర్పాటు చేయడం తెలంగాణ రాష్టానికే గర్వకారణం అని అన్నారు.

దమ్మాయిగూడలో దారుణం

- మద్యం మత్తులో ఘర్షణ.. ఒకరి హత్య
- నిద్రలేవలేదని ఇద్దరి మధ్య వాగ్వాదం
- క్షణికావేశంలో నిండు ప్రాణం బలి



నవతెలంగాణ-జవహర్ నగర్

దమ్మాయిగూడలో దారుణం చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఘర్షణ పడి ఒకరు హత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సర్కిల్ ఇన్స్పెక్టర్ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం... దమ్మాయిగూడా ప్రాంతంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు రవి, బాబు, జితేందర్ స్థానికంగా పాల్సెలింగ్ కూలీ పనులు చేసుకుంటూ ఒకే గదిలో నివసిస్తున్నారు. గురువారం పనులు ముగించుకొని ముగ్గురు స్నేహితులు ఇంటికి వచ్చారు. అప్పటికే ఫుల్‌గా మద్యం సేవించి రాత్రి పడుకున్నారు. శుక్రవారం ఉదయం పనికి వెళ్లామని బాబు మరో స్నేహితుడైన రవిని నిద్రలేపుతుండగా అతడు నిరాకరించాడు. జితేందర్ (88) వీరిద్దరికి సూపర్‌వైజర్, పని నిమిత్తం బటయకు వెళ్ళాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య ఘర్షణ తీవ్రస్థాయిలో చోటుచేసుకోగా సహనం కోల్పోయిన బాబు... రవిని కూరగాయాలు కోసే కత్తితో కడుపులో పొడిచాడు. తీవ్ర రక్తస్రావమై రవి అక్కడిక్కడే మరణించాడు. మృతుడు రవి(15), బాబు ఇద్దరు మైనర్లు స్థానికులు విషయాన్ని పోలీసులకు తెలుపగా వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానాకు తరలించారు. నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీస్‌లు తెలిపారు.

'కాళోజీ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ప్రజా కవి, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని ఏఐసీసీ ఓబీసీ జాయింట్ కో-ఆర్డినేటర్ మాధంశెట్టి అనిల్ కుమార్ సీఎం ఎ.రేవంత్ రెడ్డిని కోరారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో సీఎంను కలిసి ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కాళోజీ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు విగ్రహాన్ని రాష్ట్ర సచివాలయం లేదా తెలంగాణ అమరవీరుల జ్యోతి ఎదుట గానీ ప్రతిష్టించేందుకు స్థలాన్ని కేటాయించాలని కోరారు.కాళోజీ తెలంగాణ రాష్ట్రం కోసం ఎంతో కృషి చేశారని, ఆయన ఆత్మ తెలంగాణపైనే ఉందని, ఎన్నో కవితలు రాసి ప్రజా కవిగా గుర్తింపు పొంది, కేంద్ర ప్రభుత్వంచే పద్మ విభూషణ్ అవార్డును సైతం పొందారని గుర్తు చేశారు.ఇలాంటి మహాను భావుడి విగ్రహం ప్రతిష్టిస్తే ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోతారని ఆయన చెప్పారు.

నగరంలో సూత్రా ప్రదర్శన షురూ



నవతెలంగాణ-బంజారాహిల్స్

మీ పెండ్లి షాపింగ్ గురించి ఆందోళన చెందుతున్నారా? చింతించకండి,వెడ్డింగ్ స్పెషల్ సూత్ర ఎగ్జిబిషన్ మీ అందరికీ ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తూ అందరికీ అందుబాటులో ఉండే ధరల్లో వివాహం కోసం సాంస్కృతిక అనుభూతి అందించేందుకు కొలువైంది. ఈ మేరకు నిర్వాహకులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో హైదరాబాద్‌లోని హోటల్ తాజ్ కృష్ణలో సూత్ర ఎగ్జిబిషన్ ప్రదర్శన తిలకించి ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పెండ్లి గంట మోగిన నాటి నుంచి పూర్తి అయ్యే వరకు కావాల్సిన వాన్ని ఒకే వద్ద లభించే ప్రదర్శన ఆలస్యం చేయకుండా అందరూ రావాలని నిర్వాహకులు కోరారు.

కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డుల

వేతనాలు వెంటనే చెల్లించాలి



- ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ
- సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం ముందు ధర్నా

నవతెలంగాణ-కంటోన్మెంట్

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డులో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు సెక్యూరిటీ గార్డులకు రెండు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, దీంతో వారు అనేక ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి, యూనియన్ అధ్యక్షులు ఎం నరసింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం నాడు సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం ముందు కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోర్డు నుంచి బిల్లులు రావడం లేదనే నెపంతో కాంట్రాక్టర్లు కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో వారు ఇంటికిరాయిలు చెల్లించుకునేందుకు, ఇతర అవసరాలకు డబ్బులు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. అనంతరం వారు కంటోన్మెంట్ బోర్డు సీఈఓను ఫోన్ ద్వారా సంప్రదించగా కాంట్రాక్టర్‌తో మాట్లాడి వీలైనంత త్వరగా వారి వేతనాలు ఇప్పించే విధంగా, అదేవిధంగా కాంట్రాక్టర్‌కు కూడా వెంటనే బిల్లులు చెల్లించే విధంగా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని చెప్పారు.

ఎస్సీ వర్గీకరణ సాధనకు 19న చలో ఢిల్లీ

- మోడీ ప్రభుత్వంపై మాదిగలు తిరుగుబాటు చేయాలి
- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్
- ఓయూలో రాష్ట్రస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం



నవతెలంగాణ-ఓయూ

ఎస్సీ వర్గీకరణ సాధనకు ఈనెల 19న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించి బీజేపీ మెడలు వంచి ఎస్సీ వర్గీకరణ సాధించే దిశగా మాదిగలంతా సిద్ధపడాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ పిలుపునిచ్చారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వం మాదిగలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకొని చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ఓయూ టెక్నాలజీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వంగపల్లి శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామన్న మోడీ ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నదన్నారు. గత నెల హైదరాబాద్‌లో జరిగిన బహిరంగ సభలో స్వయంగా మోడీ వర్గీకరణ విషయంలో స్పష్టత ఇవ్వకుండా ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో కూడా ఎస్సీ వర్గీకరణ అంశాన్ని దాటవేస్తున్నారని వంగపల్లి దుయ్యబట్టారు. గతంలో లోకూర్ కమిషన్, రామచంద్ర కమిషన్, ఉషా మేహరా కమిషన్ స్పష్టంగా ఎస్సీ వర్గీకరణ అంశంపై నివేదిక ఇచ్చినప్పటికీ వాటిని పరిగణలోకి తీసుకోకుండా బీజేపీ కావాలని మాదిగలను మోసం చేస్తోందన్నారు.తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు మొండిచేయ చూపిందన్నారు ఈ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు కచ్చితంగా మంత్రివర్గ విస్తరణలో స్థానం ఇవ్వాలని సూచించారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధ కల్పించి నిజంగా మోడీ ప్రభుత్వానికి మాదిగలపై ఉన్న చిత్తశుద్ధితో నిరూపించుకోవాలన్నారు.

ఎస్సీ వర్గీకరణ మాదిగల చిరకాల వాంఛ అని, దాన్ని సాధించడానికి ఈనెల 19న ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నామని.. అందుకోసం లక్షలాదిగా మాదిగలు ఢిల్లీకి తరలివచ్చి బీజేపీకి మాదిగల సత్తా ఏంటో చూపించాలని వంగపల్లి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ మీసాల మల్లేష్ చిలకమర్ గణేష్, బంగారు శీను, బల్గర్ హుస్సేన్, యాదగిరి, మోహన్, పందుల సంజీవ, దప్పు శివరాజ్, శాప కష్ణ, వేణు గోపాల్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు, జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అధికారులు, సిబ్బంది



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా నూతనంగా ఎన్నికైన లాస్య నందితను శుక్రవారం మున్సిపల్, మెడికల్ అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు కార్ఖానాలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లిన జీహెచ్ఎంసీ అధికారులు, కంటోన్మెంట్ బోర్డు మెడికల్ అధికారులు, సిబ్బంది.. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈఈ సుదర్శన్, డీఈ ఆంజనేయులు, ఏఈ రవీందర్, ఎస్పీహెచ్ఓ రాజకుమారి, విశాల్ రాజ్, నాగార్జున, శ్వేత, శ్రీలక్ష్మి, యామిని, అమిత్ తదితరులు ఎమ్మెల్యేను కలిశారు.

ఇద్దరు మాదిగ మంత్రులకు అవకాశం కల్పించాలి

- ప్రొ. గాలి వినోద్ కుమార్ డిమాండ్



నవతెలంగాణ-ఓయూ

కాంగ్రెస్ ప్రభుత్వ క్యాబినెట్‌లో ఇద్దరు మాదిగ మంత్రులకు అవకాశం కల్పించాలని దక్షిణ భారత రాజకీయ జేఏసీ చైర్మన్ ప్రొ. గాలి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'మంత్రివర్గంలో మాదిగ ఉపకులం మోచికి చెందిన దామోదర రాజానరసింహకు మాదిగ కోటాలో మంత్రిగా స్థానం లభించగా మాల దాసరికి చెందిన భట్టి విక్రమార్కకు మాలకోటాలో ఉపముఖ్యమంత్రి అయ్యారన్నారు. దీనికి తోడు స్పీకర్ పదవి కూడా మాల కులానికి లభించగా తెలంగాణ ఎస్సీ జనాభాలో సుమారు 50 లక్షల జనాభా కలిగిన మాదిగలకు ప్రస్తుత మంత్రివర్గంలో చోటు లభించలేదని చెప్పారు. 11 మంది ప్రస్తుత మంత్రివర్గంలో ఐదు జనాభా శాతం ఉన్న రెడ్లు ముఖ్యమంత్రితో సహా నలుగురు ఉండగా 52 శాతం జనాభా కలిగిన బీసీలకు కేవలం ఇద్దరికి మాత్రమే మంత్రి పదవులు దక్కాయన్నారు. ఒక బ్రాహ్మణ, ఒక వెలమ, ఒక కమ్మ మొత్తం ఏడుగురు అగ్రవర్ణాల కాగా 10 శాతం జనాభా కలిగిన ఎస్టీలకు ఒక మంత్రి పదవి, 12 శాతం జనాభా కలిగిన మైనార్టీలకు ఒక్క మంత్రి పదవి కూడా దక్కలేదు అని.. కనీసం మంత్రివర్గ విస్తరణలో నైనా ఎంబీసీలకు, మాదిగలకు, మైనార్టీలకు, లంబాడీలకు మంత్రులుగా చోటు కల్పించాల్సిన అవసరం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై ఉందని పేర్కొన్నారు.

ప్రజా ప్రభుత్వంలో

అవినీతి అధికారులకు అవకాశం ఉండదు

- టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ గౌడ్



నవతెలంగాణ-ఓయూ

ప్రజా ప్రభుత్వంలో అవినీతి అధికారులకు అవకాశం ఉండదని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలు అమలు చేసి చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. 10 ఏండ్లలో ప్రజలు ఆశించిన పాలన జరగలేదు కాబట్టి కాంగ్రెస్ పార్టీనీ ప్రజలు కడుపులో పెట్టుకుని గెలిపించారని అన్నారు. కొంత మంది అవినీతి అధికారులు గత ప్రభుత్వాలలో చేసిన లాగా ప్రజా పాలనలో నడవదని అలాంటి వారికి అవకాశాలు ఉండవన్నారు. కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీ పథకాలతో తెలంగాణ దశ దిశ మారుతుందని ముఖ్యమంత్రి గొప్ప ఆలోచన తో అమలు జరుగుతుందన్నారు. దివ్యాంగురాలు అయిన పేద బిడ్డ రజినీకి ఉద్యోగ నియామకం ఇవ్వడం గొప్ప పరిణామం అని, నిరుద్యోగుల కష్టాలు ఆవేదన చాలా దగ్గరరాగా చూశాడు కాబట్టి రజినీకి న్యాయం చేశాడన్నారు. తెలంగాణ సమాజంలో అసమానతలు, అవమానాలు ఉండవని, ప్రతీ పేద ఆత్మగౌరవం తో బతకాలి అనే లక్ష్యం కాంగ్రెస్ పార్టీది, సీఎంది అన్నారు. మహిళాలకి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం గొప్ప ఆలోచన అన్నారు. నిరు ద్యోగుల భవిషత్తు కి బాటలు వేస్తుందని వారి జీవితాలలో వెలుగు లు నింపుతుందని అన్నారు.అవినీతి రహిత పాలన ఉంటుందని దయాకర్ అన్నారు.

పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి



- ముఖ్యమంత్రిని కోరిన తెలంగాణ బీసీ సంఘాల జేఏసీ

నవతెలంగాణ-బంజారా హిల్స్

ముఖ్యమంత్రి అధికారిగా నివాసానికి జ్యోతిరావు పూలే పేరును పెట్టడం హర్షణీయమని, అదే సమయంలో ఆయన ఆశయ సాధనకు నిరంతరం కృషి చేయాలని తెలంగాణ బీసీ సంఘాల జేఏసీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరింది. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ నాయకులు కుందారం గణేష్ చారి,జాజుల శ్రీనివాస్ గౌడ్,చిన్న శ్రీశైలం యాదవులు మాట్లాడారు. రాష్ట్రంలోని 60 శాతం మంది ఉన్న బీసీల ఉసురు తగిలే కేసీఆర్ ప్రభుత్వం కుప్పకూలిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆయన పాలించిన తొమ్మిది న్నరేండ్ల పాటు బీసీ సంఘాల విజ్ఞప్తులను స్వీకరించేందుకు అవకాశం ఇవ్వలేదని అన్నారు. పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందని అన్నారు. దీంతోనే డిసెంబర్ 30న జరిగిన ఎన్నికలలో బీసీలు కేసీఆర్‌కు తగిన విధంగా బుద్ధి చెప్పారన్నారు. నూతనంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏకంగా సీఎం అధికారిక నివాసానికి పూలే పేరును పెట్టడం గొప్ప విషయమన్నారు.అదే సమయంలో మంత్రివర్గంలో బీసీలకు సముచిత స్థానం కల్పించాలని, జ్యోతిరావు స్మృతి వనాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు కుందరం గణేష్ చారి,వారి కుప్పలా యాదగిరి, గొల్ల కుర్మల సంఘం అధ్యక్షులు చిన్న శ్రీశైలం యాదవ్,సాగర్,కష్ణ,విక్రమ్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్ కోలుకోవాలని ఓయూలో పూజలు

నవతెలంగాణ-ఓయూ

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తొందరగా కోలుకోవాలని ఓయూ సరస్వతి ఆలయంలో నిరుద్యోగ చైర్మెన్ కోటూరి మానవతారాయ్ ఆధ్వర్యంలో శుక్రవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ ఎన్నికల్లో ఓడిపోయినా ప్రజల హదయాల్లో నిలిచే ఉన్నారన్నారు. ప్రజలు మార్పు కోరారు కానీ కేసీఆర్‌ను దూరం చేసుకోలేదన్నారు. కేసీఆర్‌కు తెలంగాణ ప్రజల ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయి అని చెప్పారు. కేసీఆర్‌ను కాంగ్రెస్ వాళ్ళు హేళన చేస్తే చూస్తూ ఊరుకోబోమని తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ పక్షన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నాయకులు, ఓయూ విద్యార్థులు కొండ గణేష్, డాక్టర్ ఇనుగుర్తి శ్రీనివాస్,డాక్టర్ ఆరే శ్రీనివాస్ రెడ్డి, మణికంఠ,ప్రసాద్, పాల్గొన్నారు.

ఓయూలో 30న నిరుద్యోగ విజయోత్సవ సభ



నవతెలంగాణ-ఓయూ

డిసెంబర్ 30న ఓయూ ఆర్ట్స్ కళాశాల వేదికగా నిరుద్యోగ విజయోత్సవ సభ నిరుద్యోగుల ఆధ్వర్యంలో జరుగుతుందని, నిరుద్యోగ జేసి చైర్మెన్ భీమ్ రావు అన్నారు. శుక్రవారం ఓయూలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో నీళ్ల ,నిధులు ,నియామకాలు అనే నినాదంతో ఎన్నికలలో గెలిచి గత పది సంవత్సరాలుగా సకాలంలో ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వకుండా వారి ఆత్మహత్యలకు గురి చేసింది గత ప్రభుత్వం అన్నారు. నిరుద్యోగ వ్యతిరేక పాలనను కొనసాగించి, తెలంగాణ వచ్చిన తర్వాత కూడా 250 మందికి పైగా మరణానికి కారణమై, ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో 80 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు అని చెప్పి భర్తీ చేసే క్రమంలో 17 రకాల ఉద్యోగాల టీఎస్పీఎస్సీ వేదికగా అమ్ముకున్నదని ఆరోపించారు. తెలంగాణ నిరుద్యోగుల ఉసురు తీసిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఊడగొట్టడంలో 30 లక్షల నిరుద్యోగులు ఏకమై రాజధాని నుంచి ప్రతి పల్లె ,గ్రామం, తండా వరకు కదిలి నిరుద్యోగులకు, ప్రజలకు చేస్తున్న అన్యాయాన్ని వివరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం రావడంలో కీలక పాత్ర పోషించాన్నారు. ఈ సందర్భంగా ప్రజల ఆశీర్వాదంతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనను కొనసాగడానికి మార్గం సుగమమయిందన్నారు. దీనిలో భాగంగా నిరుద్యోగులు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన భరోసాను, నమ్మకాన్ని గుర్తించుకొని ఓయూ ఆర్ట్స్ కళాశాల వేదికగా నిరుద్యోగ విజయోత్సవ సభను ఈ నెల డిసెంబర్ 30న లక్ష మందితో నిర్వహించడం జరుగుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో మిడతనపల్లి విజయ్ ,స్కాలర్ కోర్ర ఈశ్వర్ లాల్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు హలావత్ మోహన్ నాయక్, తిరుపతి రెడ్డి , డా.బాలు నాయక్, బాబు నాయక్ ,చందు నాయక్ పాల్గొన్నారు.

తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు శుభాకాంక్షలు



నవతెలంగాణ-బేగంపేట్

సనత్ నగర్ ఎమ్మెల్యేగా మూడోసారి భారీ మెజార్టీతో గెలుపొందిన మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని పలువురు ప్రజలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం, ఎస్ఆర్ నగర్ లోని గణేష్ టెంపుల్, ఉజ్జయిని మహంకాళి ఆలయ అర్చకులు తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను వేద మంత్రాలతో ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా ఆయా ఆలయాలకు చెందిన కమిటీ సభ్యులు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. జైన్ సమాజ్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. అమీర్ పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, బీఆర్ఎస్ సనత్ నగర్ డివిజన్ అధ్యక్షులు కొలను బాల్ రెడ్డి, మహంకాళి ఆలయ ఈఓ మనోహర్ రెడ్డి, బల్కంపేట ఆలయ ట్రస్టీ సాయిబాబా గౌడ్, కమిటీ సభ్యులు బచ్చు మహేష్, మహేందర్, దుబాయ్ శ్రీను, జగదీష్ ప్రసాద్, బల్కంపేట ఆలయ కమిటీ సభ్యులు పుష్పలత, గౌతమ్, కూతురు నర్సింహ, రోజా రెడ్డి, నాయకులు రాజేష్, మైనార్టీ కమిషన్ సభ్యులు హిమాన్షు బాప్నా, ఎఫ్‌డీసీ మాజీ చైర్మెన్ అనిల్ కుమార్ కుర్మాచలం, జైన్ సేవా సంఘ్ అధ్యక్షులు యోగేష్ జైన్, అశోక్ జైన్, సురేష్, ఆనంద్ పాటిల్, సురానా, సుభాష్ తదితరులు తలసాని శ్రీనివాస్ యాదవ్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



'లంబాడ సామాజిక వర్గానికి ప్రాధాన్యతనివ్వాలి'

నవతెలంగాణ-బంజారాహిల్స్

లంబాడీ సామాజిక వర్గానికి చెందిన వారికి రేవంత్ మంత్రివర్గంలో తగిన ప్రాధాన్యత కల్పించాలని లంబాడి సంఘాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు సంజీవ్ నాయక్ మాట్లాడారు. రాష్ట్రంలో లంబాడీల జనాభా కనుగొనగా ప్రాధాన్యత లభించాల్సి ఉండగా విస్మరించడం ఏమిటని ప్రశ్నించారు. ప్రచార సమయంలో అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తామని నాయకులు లంబాడీలను విస్మరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోవు మంత్రివర్గ కూర్పులో తమ సామాజిక వర్గానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఫెలోషిప్ ఇన్

అడ్వాన్స్‌డ్ లాప్రోస్కోపిక్ ఆంకాలజీ కాన్ఫరెన్స్



నవతెలంగాణ-బంజారాహిల్స్

బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ మరియు రీసెర్చి ఇన్స్టిట్యూట్‌లో నిర్వహిస్తున్న మూడు రోజుల ఫెలోషిప్ ఇన్ అడ్వాన్స్ డ్ లాప్రోస్కోపిక్ ఆంకాలజీ (ఎఫ్ఏఎల్ఎస్ ఆంకాలజీ) కాన్ఫరెన్స్‌ను శుక్రవారం ప్రారంభమైంది. బంజారాహిల్స్‌లోని ఆస్పత్రి ఆడిటోరియంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ గ్యాస్ట్రో ఎండోస్కోపిక్ సర్జన్స్ (ఐఏజీఈఎస్) అధ్యక్షులు డాక్టర్ ఈశ్వర మూర్తితో కలసి సంయుక్తంగా మూడు రోజుల కాన్ఫరెన్స్‌ను ఆస్పత్రి సీఈవో ఆర్‌వీ ప్రభాకర్ రావు, ఎండీలు డా. టీయస్ రావులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి చైర్మన్ నందమూరి బాలకష్ణ వర్చువల్‌గా పాల్గొన్నారు.

ఈ కాన్ఫరెన్స్ లో దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి వచ్చిన 100 మందికి పైగా మినిమల్ యాక్సెస్ సర్జన్స్ పాల్గొన్నారు. వీరందరూ ఈ మూడు రోజుల పాటూ అనుభవాలను,నైపుణ్యాన్ని తమ సహచరులతో పంచుకోవడమే కాకుండా లాప్రోస్కోపిక్ సర్జరీలో అందుబాటులోనికి వచ్చిన అత్యాధునిక పరిజ్ఞానాన్ని కూడా చర్చించనున్నారు. తద్వారా ఒకరి వద్ద నుంచి మరొకరు నేర్చుకోవడమే కాకుండా తమ తమ నైపుణ్యాలు మరింత మెరుగుపరచుకోవడానికి ఈ కాన్ఫరెన్స్ వేదికగా మారనుంది. దీంతో పాటూ కాన్ఫరెన్స్ లో పాల్గొనే వారికి "ఎఫ్ఏఎల్ఎస్ ఆంకాలజీ" ఫెలోషిప్ పరీక్షలో పాల్గొనడానికి కూడా ఈ కాన్ఫరెన్స్ లో అవకాశం కల్పిస్తూ తద్వారా ఆయా అభ్యర్థులు తమ తమ ప్రజ్ఞాపాటవాలను పరీక్షించుకోవడానికి వీలవుతుందనీ ఇలా ఎంతో అట్టహాసంగా నిర్వహిస్తున్నమని తెలిపారు.

ఈ సందర్భంగా సీఈఓ డా.ఆర్ వి ప్రభాకర రావు మాట్లాడుతూ నియమిత సమయాలలో రోగులకు సేవలు అందిస్తున్న వైద్యులకు మధ్య విజ్ఞాన మార్పిడి ఎంతో అవసరమని అన్నారు. అనుభవాలను ఇచ్చి పుచ్చుకోవడం ద్వారా వైద్యులు కొత్త పరిజ్ఞానాలతో పాటూ సరికొత్త టెక్నిక్‌లను అవగాహన చేసుకోవడానికి వీలవుతుందని అనారు. తద్వారా తాము చికిత్స అందించే రోగులకు మరింత మెరుగైన చికిత్స అందించడానికి వీలవుతుందని చెప్పారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఈ కాన్ఫరెన్స్ లో సరికొత్త అనుభవాలు నేర్పించే పాఠాలు ఎంతగానో పాల్గొంటున్న వారికి ఉపయోగపడుతాయని ఆశిస్తున్నట్టు చెప్పారు.

అనంతరం మెడికల్ డైరెక్టర్ మాటలాడుతూ... ఎప్పటికపుడు అందుబాటులోనికి వస్తున్న సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో పాటూ చికిత్సలో వస్తున్న మార్పులను నిరంతరం తెలుసుకుంటూ ఉండాల్సిందేనన్నారు. ఈ కాన్ఫరెన్స్ లో కూడా కేస్ స్టడీ ప్రజంటేషన్ తో పాటూ జరిగే పలు కీలక చర్చలలో అందరూ ఉత్సాహంగా పాల్గొని నిపుణుల వద్ద నుండి నేర్చుకోవాలని సూచించారు.

అనంతరం ఐఏజీఈఎస్ అధ్యక్షులు డా.ఈశ్వర మూర్తి మాట్లాడుతూ ఈ కాన్ఫరెన్స్‌ను నిర్వహించడానికి వీలు కలిపించిన హాస్పిటల్ యాజమాన్యానికి కతజ్ఞతలు తెలియజేశారు. ఇంతటి భారీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న నిర్వాహక కమిటీ సభ్యులను అభినందించారు. కాన్ఫరెన్స్‌లో పాల్గొంటున్న వారందరూ విజ్ఞానాన్ని సముపార్జించేలా సద్వినియోగం చేసుకుంటారన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డైరెక్టర్ అకడమిక్స్ యాడ్ లైఫ్ డా.కల్పనా రఘునాథ్,డా ఫణికోటేశ్వరావు వైద్యులు,సిబ్బంది పాల్గొన్నారు.

కంచె పోయి.. బారికేడ్లు వచ్చే..



నవతెలంగాణ-బంజారా హిల్స్

అధికారం అందేదాకా ఒకటి అధికారం అందినాక మరొకటి అనే సామెత నిజం చేశారని పలువురు తెలంగాణ సామాన్య ప్రజానీకం నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని తప్పుపడుతూ విమర్శలు గుప్పించారు. ప్రగతి భవన్ ప్రజా దర్బార్ గా మారుస్తామని చెప్పి ఒక రోజు ముచ్చటే చేశారని ఎద్దేవా చేశారు. వివరాల్లోకెళ్తే.. ప్రజా భవన్ వద్ద ముళ్ల కంచెలు తొలగించి శుక్రవారం ప్రజా దర్బార్ ఏర్పాటు చేశారు. దాంతో చాలా మంది అక్కడకు చేరుకున్నారు. అయితే బారికేడ్లు ఏర్పాటు చేసి కొందరిని లోపలకు వెళ్లనీయకపోవడంతో వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డిని కలిసి తమ సమస్యలు నేరుగా చెప్పుకునే అవకాశం ఇచ్చినట్టే ఇచ్చి నిరాశపరచాలని పలువురు మహిళలు సాధారణ ప్రజానీకం వాపోయారు. మళ్లీ బారికేడ్లు ఏర్పాటుచేసి తమని వెళ్లకుండా అడ్డుకోవడం కొంత బాధను కలిగించిందని ఆవేదన వ్యక్తపరిచారు.

ఇదిలా ఉండగా తెలంగాణ అసలు దొంగలు, బీహార్ బ్యాచ్ అంటూ మాజీ సీఎం, మంత్రులు మాజీ సీఎస్ పలువురు కమిషనర్ల ఫోటోలతో ఓ బ్యానర్ ఏర్పాటు చేసి కొందరు లోపలికి వచ్చే సమయంలో పోలీసులు వారిని అరెస్ట్ చేసి పంజాగుట్ట పోలీస్ స్టేషన్ తరలించారు.అలాగే ప్రజాభవన్ లోపలికి వెళ్లిన ఓ వ్యక్తి ఏకంగా మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర రావు పేరును మట్టితో కనబడకుండా మూసివేసే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నారు.

కొందరు సెల్ఫీల కోసం వారు వచ్చిన సమస్యలు పక్కనపెట్టి లోపలికి అనుమతి లేకుండానే వెళుతూ పలు రకాల కార్యక్రమాలు చేస్తున్నారని , సెక్యూరిటీ సిబ్బంది నిబంధనల ప్రకారం ప్రోటోకాల్ పాటిస్తూ ఒకరి సమస్యలు పరిష్కారం అయిన తర్వాత మరొకరి సమస్యలు పరిష్కరించే ప్రక్రియ మొదలుపెట్టి ముందుగా 10 నుంచి 5 మందిని లోనికి అనుమతించి వారు వచ్చిన తర్వాత మిగతా వారిని అనుమతించే ప్రక్రియ ప్రారంభించనున్నట్లు సమాచారం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే ఆ ప్రక్రియ మొదలు పెడతామని ప్రజా దర్బార్ ప్రజల కష్టసుఖాల కోసమే ఏర్పాటుచేసిన కార్యక్రమంగా తెలియజేస్తూ ప్రజల అదృష్టం వేరకే ఈ ప్రక్రియ ప్రారంభిస్తామని పోలీసులు, ప్రభుత్వ అధికారులు తెలిపారు.

ఓయూలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-ఓయూ

పీజీ పూర్తి చేసిన దివ్యాంగ యువతి రజినీకి ఉద్యోగం ఫైల్ పై నూతన ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి తొలి సంతకం చేసి తన హామీని నెరవేర్చిన సందర్భంగా ఓయూ జేఏసీ, ఓయు దివ్యాంగ స్కాలర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఓయూలో రేవంత్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. దివ్యాంగుల జేఏసీ చైర్మెన్ పల్స అంజనేయులు గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉన్న తెలంగాణ జన సమితి పార్టీ అధ్యక్షుడు కోదండరామ్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్రంలో వివిధ యూనివర్సిటీలలో పీజీ, పీహెచ్డీ ఇతర ఉన్నత విద్య చదివిన నిరుద్యోగ దివ్యాంగులు చాలామంది ఉన్నారని.. వారికి సంబంధించిన రిజర్వేషన్‌ను పెంచాలని, శారీరక వికలాంగుల రోస్టర్ పాయింట్‌ను 10 లోపల తగ్గించాలని, దివ్యాంగ బందును ప్రవేశపెట్టాలని కోరారు. దివ్యాంగులు పెన్షన్‌తో పాటు ఉద్యోగ ఉపాధి పొంది తమ కాళ్ళ మీద తాము నిలబడాలని కోరుకుంటున్నారన్నారు. యూనివ ర్సిటీలో ఉన్న బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు ఇతర కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగాలలో మొదటి ప్రాధాన్యం దివ్యాంగులకు కల్పించాలని, ఈ ప్రజా ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రీసెర్చ్ స్కాలర్స్ గాండ్ల సుమన్, నరేష్ నాయక్, నాగరాజు, శంకర్, గుర్రం రమేష్ పాల్గొన్నారు.



సాంకేతిక మార్పులపై ప్యాకేజింగ్ రంగ జాతీయ సదస్సు

నవతెలంగాణ-బంజారాహిల్స్

ఇండియన్ ఇనిస్ట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ (ఐఐపీ) సంస్థ రెండు రోజుల పాటు హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఈ సదస్సు బంజారా హిల్స్ హెూటల్ పార్క్ హయత్‌లో జరిగింది. దేశంలోని పలు ఫుడ్, ఫార్మా సంస్థలకు చెందిన ప్రతినిధులు, ప్రముఖులు ఈ సదస్సుకు హాజరయ్యారు. ప్యాకేజింగ్ రంగంలో వస్తున్న సాంకేతిక మార్పులు, ప్యాకేజింగ్ ఉత్పత్తుల తయారీ,ఈ రంగంలో వస్తున్న కొత్త మార్పుల ఆవిష్కరణలతో వ్యాపార రంగ అభివృద్ధిపై సదస్సు ఏర్పాటు చేయగా తెలంగాణ ఐటీ డిపార్ట్ మెంట్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ,పరిశ్రమలు, వాణిజ్య రంగ ప్రిన్సిపల్ సెక్రటరీ, జయేశ్ రంజన్,(ఐఏఎస్), ఐఐపీ వైస్ చైర్మెన్ ఎస్.ఎల్ రాజు,ఐఐపీ హైదరాబాద్ చైర్మెన్ శంకర్ పటేల్, వరల్డ్ ప్యాకేజింగ్ ఆర్గనైజేషన్ గ్లోబల్ అంబాసిడర్ ఏవీపీఎస్ చక్రవర్తి, ,ఐఐపీ తెలంగాణ చైర్మెన్ సి.శేఖర్ రెడ్డి, పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

అనంతరం జయేష్ రంజన్ మాట్లాడుతూ ప్రపంచీకరణ పెరుగుతున్న క్రమంలో ప్యాకేజింగ్‌లో నాణ్యమైన ఉత్పత్తులను అందించడమే కాకుండా, పర్యావరణంపై తక్కువ ప్రభావం చూపేలా మార్కెట్‌లో ఉత్పత్తులకు డిమాండ్ ఉందన్నారు. ఈ ప్రత్యేక థీమ్ 'ప్యాకేజింగ్ - ఇన్నోవేషన్ ఫర్ ఫ్యూచర్ ప్లానెట్' అనేది చాల ముఖ్యమైన అంశమని భవిష్యత్తులో కొత్త ఆవిష్కరణల కోసం(ఎంఎస్ఎంఈ) విభాగాన్ని సాంకేతికంగా పురోగతిని సాధించాల్సిన అవసరం వుందని అన్నారు. ఈ సంవత్సరం మిల్లెట్ సంవత్సరం అనేక స్టార్టప్‌లు మిల్లెట్‌పై ఉత్పత్తుల కోసం చొరవ తీసుకున్నాయని, ఈ రంగంలో కూడా భవిష్యత్తులో మరిన్ని ఆలోచనలతో కొత్త ఆవిష్కరణలు తీసుకొచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఏవీపీఎస్ చక్రవర్తి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి రంగంలో ఆయా సంస్థల అభివృద్ధిలో ప్యాకేజింగ్ రంగం కీలక పాత్ర పోషిస్తున్నదన్నారు.అందులో ప్రజలకు కావాల్సిన ఆహార ఉత్పత్తులు, ఫార్మా రంగంతో పాటు ఇతర అనేక ఉత్పత్తులను వినియోగదారులకు అందించే క్రమంలో ఈ రంగం కృషి చేస్తోందనీ ప్రస్తుతం ఫుడ్, ఫార్మా ఇండస్ట్రీలో వస్తున్న మార్పులకనుగుణంగా ప్యాకేజీ రంగం కొత్త విధానాలను అనుసరించటం వల్ల ఇటీవల ఇండస్ట్రీ గ్రోత్ మరింతగా పెరిగిందన్నారు. కోవిడ్ 19 లాంటి విపత్కర పరిస్థితుల్లో కూడ ప్యాకేజీ రంగం మెరుగైన సేవలు అందించిందని, స్టార్టప్ సంస్థలకు కూడా ఈ రంగంలో అనేక అవకాశాలుంటాయనీ తెలిపారు.

సి.శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ నిర్వహించిన జాతీయ సదస్సు ద్వారా ఈ రంగంలో వున్న అవకాశాలపై అవగాహన కల్పించటంతో పాటు ప్యాకేజింగ్ రంగంలో కొత్త ఆవిష్కరణలకు దోహదపడుతుందన్నారు.భవిష్యత్తులో ఐఐపితో కలసి పని చేయటానికి తమను ఆహ్వానించినందుకు ఆనందం వ్యక్తం చేస్తున్ననీ తెలిపారు. వైస్ ప్రెసిడెంట్ అవినాష్ కుమార్ తల్వార్, మాట్లాడుతూ ప్యాకేజింగ్ రంగంలో రాబోయే దశాబ్దాలలో మరింత ఎదగడానికి కొత్త ఆవిష్కరణలు కీలకంగా మారుతాయనీ ప్రపంచ వ్యాప్తంగా ఉత్పత్తులను వినియోగదారులకు అందించే క్రమంలో వారి అభిరుచుల అంచనాలకు అనుగుణంగా సరసమైన ధరలో అందించటం చాలా ముఖ్యమని తెలిపారు. శంకర్ పటేల్, ఐఐపి, చైర్మన్, హైదరాబాద్ వారు మాట్లాడుతూ...ప్రపంచంలో అనేక రంగాలలో భారతదేశం ముందుకు దూసుకుపోతోందన్నారు.అందులో ప్యాకేజింగ్ పరిశ్రమలో కూడా ఆవిష్కరణలు చాల అవసరమనీ అలాంటి ఆవిష్కరణల గురించి చర్చిస్తూ ప్యాకేజింగ్ రంగ అభివృద్ధికి ఈ సదస్సులు ఎంతగానో దోహదపడతాయనీ తెలిపారు.

నిర్వీర్యంగా ఉన్న విద్యావ్యవస్థను బలోపేతం చేయాలి

- ఎస్టీయూటీఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఇష్తకారుద్దీన్, ప్రధాన కార్యదర్శి రామ సుబ్బారావు

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఏనుముల రేవంత రెడ్డికి రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూటీఎస్) తరపున హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఇష్తకారుద్దీన్, ప్రధాన కార్యదర్శి రామ సుబ్బారావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలు గత పదేండ్లుగా నిర్వీర్యస్థితిలో ఉన్నందున తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ఉపాధ్యాయుల భర్తీ, మధ్యస్థంగా నిలిచిన బదిలీలు, ప్రమోషన్లు, ఎన్నో ఎండ్లుగా నిలిచిపోయిన పండితులు, పీఈటీల అప్‌గ్రేడ్ పోస్టుల సమస్యతో పాటు మంజూరై భర్తీ కాకుండా నిలిచి పోయిన ప్రైమరీ హెచ్ఎం (ఎల్ఎఫ్ఎల్) పోస్టులు వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఉన్నతి, ఎఫ్ఎల్ఎన్ తొలిమెట్టు

ఉన్నత పాఠశాల విద్యావిధానంలో గత ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన 'ఉన్నతి' విద్యా విధానాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులకు కష్టతరంగా చేశారనీ జిల్లా అధ్యక్షులు ఇష్తకారుద్దీన్, ప్రధాన కార్యదర్శి రామసుబ్బారావు గుర్తుచేశారు.

'ఉన్నతి'తో పాటు ప్రైమరీ విద్యావిధానంలో అమలు చేస్తున్న తొలిమెట్టుని(ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ) సులభతరంగా చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలి

- భారత లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు



నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాష్ట్రానికి రెండోవ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన ఎ.రేవంత్ రెడ్డికి, రాష్ట్ర మంత్రి వర్గానికి భారత లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. బంగారు తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం కాపాడాలని, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని కోరారు.ఉచితాల పేరుతో ప్రజలను సోమరిపోతుల్లా తయారు చేయరాదని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను లాభసాటిగా కొనసాగించాలని, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు.పేద, మధ్యతరగతి ప్రజల మన్నలను పొందేలా పాలన అందించాలని ఆయన సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE R.R.DIST., AT: HAYATHNAGAR O.S. NO. 476 OF 2022

Between:
Sri.Mir Bakhtiar Ali .....Plaintiff
And
Sri.P.Madhusudhan Reddy .....Defendant

"Please take notice that the above named plaintiff filed suit for declaration of legal heirs against Defendant. The above suit is posted to **22-12-2023** for appearance. Above named defendant intend to oppose the claim of the plaintiff are hereby summoned to appear either in person or through an advocate with your deffence, on the above said date at **10-30 AM** before the honble court. Failing which the suit will be heard and decided exparte.

Schedule of property

All that the agrl land admeasuring Ac.2-17Gts., in.sy.No.118. Ac. 1-29 Gts., in sy. No. 119, and Ac. 14-08 Gts., in sy. No 120, totally Ac. 18-06 Gts., situated at Thatti Annaram, Abdullahpurmet Mandal, R.R. Dist., and bounded by:
East: Land of survey of india,
West: Survey No.121 and 122,
North: Survey No. 121,
South: Road.

(BY ORDER OF THE HONBLE COURT)
G.SRINIVAS REDDY, Advocate,
H.No.17-2-Madannapet, Saidabad, Hyd.,Cell: 9391150884

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE: RANGA REDDY DISTRICT AT: L.B.NAGAR O.S. No. 1075 of 2022

Between:-
Aenugu Pramod Reddy ... Plaintiff
AND
A. Srikanth & others ... Defendants

To,
1. A. Srikanth, S/o. A. Laxmoji, Aged Major, Occ: Business, R/o.H.No.3-15, Gundlapally Village and Mandal, Nalagonda District. (Defendant No.1)
2. A.Yellamma, W/o. A.Venkatesh, Aged Major, Occ: Housewife, R/o.H.No.11-3-99, Road No.15, Venkateshwara Colony, L.B.Nagar, Saroornagar Mandal, R.R.District. (Defendant No.2)
3. K.Bhagyalaxmi,W/oD.Hemanth Kumar, Aged Major, Occ Business, R/o.H.No.1-52/3, Kumaribasthi, Shaikpet, Madhapur, Hyderabad. (Defendant No.5)
4. V.Vijay Kumar Reddy, S/o.Yadi Reddy, Aged Major, Occ: Business, H.No.3-1-158/1/A, Bahadurguda, Shivapuri Colony, L.B.Nagar, R.R.District. (Defendant No.6)
5. M.Shekar, S/o.M.Bachaiah, Aged Major, Occ: Business, R/o.H.No. 1-48, Cherukupally Village, Gundlapally Mandal, Nalagonda District. (Defendant No.7)

...Defendants No.1, 2, 5 to 7

NOTICE

Please take Notice that, the Plaintiff filed a Suit for Perpetual Injunction against the Defendants, wherein the Hon'ble Court was pleased to Order to serve the notice to You and the same is posted on 18/12/2023 at 10-30 a.m., for your appearance and if you fail to appear before the Hon'ble Court the matter will be decided on merits. Hence the Notice.

// By Order of the Court //
G.MADHUSUDAN REDDY Advocate, 4239/1999
Flat No.107, IInd Floor, City Central Apartments, Beside South India Shopping Mall, Margadarshi Colony, Kothapet, Hyderabad-35

IN THE COURT OF THE III ADDL, DISTRICT JUDGE AT KARIMNAGAR. O.P.No. (119) of 2022.

Between:-
Kondagurla Basavaiah and others. ...Petitioners.
And
Md Ahmed Ali @ Mohammad Haimath and others. ...Respondents.

To,
R-1:- Md Ahmed Ali @ Mohammad Haimath, S/o. Mahamood Ali, Age 32 years, Occupation: Driver of Lorry bearing No. AP-29-U-1077, R/o. H.No. 17-1-30/7/11-A, Edi Bazar, RC Nagar, Hyderabad.

Whereas the above named Petitioners filed a Petition Under Section 166 (1) (c) of M.V. Act for grant of compensation on account of the Death in a motor vehicle accident involving the **Lorry bearing No. AP-29-U-1077 being driven by you** as mentioned above and whereas the Notices sent to you by the Court several times and by post are returned as un-served. Hence substitute service is ordered against you.

Take Notice that the above O.P. is stands posted to **22-12-2023** for your appearance and Counter if any, and in case your failure to appear by person or through an Advocate on the said date at **10.30 a.m.** before the Court mentioned above, the matter will be heard and determined in accordance with law.

//BY ORDER OF THE COURT//
Sd/-
(E. DILLESHWAR REDDY)
Advocate, Karimnagar, Telangana State.

IN THE COURT OF THE HON'BLE IX.ADDL.DISTRICT JUDGE, RANGAREDDY DISTRICT, AT L.B.NAGAR O.S.NO. 1493 OF 2022

BETWEEN:
MAISAMMA ALIAS SHANKARAMMA AND ANOTHER ... PLAINTIFFS
AND
TALARI YADAIAH AND OTHERS ...DEFENDANTS

To,
D13. MANDAVA SITA RAMA RAO, S/o Late Satyanarayana, R/o 406, BNR Apartments, Block-A, Upparpally, Hyderabad-500048.
D14. DUKKIPATI BHASKAR RAO, S/o Late Venkateswara Rao, R/o 76-4-33, Ishwarya Apartments, Meduri Satyanarayana Street, Gandhipuram, Rajamundry, E.G. District-533103, A.P.

NOTICE

The Plaintiff herein filed the above suit for Partition and Separate Possession against the Defendants and the same is pending. The Hon'ble Court ordered to issue Notice for your appearance by way of this Publication in the said suit and the case is posted for your appearance on 22.12.2023 at 10.30 A.M. either personally or through your counsel or otherwise the matter will be adjudicated in due process of Law. Hence, this Notice.

[BY ORDER OF THE COURT]
B.KRISHNA KUMAR Advocate,
#5-146, HYD Road, Shankarpally, R.R.District.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ మహ్మద్ సోహైల్ అహ్మద్, తండ్రి మొహమ్మద్ ఖలీల్ అహ్మద్, నివాసం: హాఫీజ్ బాబానగర్ , హైదరాబాద్, తెలంగాణ వారి సూచనల మేరకు, బాలాపూర్ గ్రామంకు రెవెన్యూ మండలం, రంగారెడ్డి జిల్లా, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, తెలంగాణ వద్దగల సర్వే నెం.లు 271/2/అ, 272/ఇ, 271/2/అ/1, 272/ఈ, 271/1/ఇ, 272/అ, 271/1/అ, 272/ఆ లోని 166.70చ.గ.లు. పూర్తి విస్తీర్ణంలో ఓపెన్ ప్లాట్ నెం.లు 7& 8 కి సంబంధించి యజమాని మహ్మద్ జైనులాబ్దీన్ తండ్రి మహ్మద్ తాజుద్దీన్, నివాసం: బాలాపూర్, రంగారెడ్డి జిల్లా-తెలంగాణ వారితో అమ్మకపు ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు బహిరంగ ప్రకటన ద్వారా సాధారణ ప్రజలకు తెలియజేస్తున్నాము. నా క్లయింట్లు కొంత మొత్తాన్ని అడ్వాన్స్‌గా కూడా చెల్లించారు. పేర్కొన్న ఆస్తిపై ఏదైనా హక్కు క్లెయిమ్ లేదా అభ్యంతరం ఉన్న వ్యక్తి 7 రోజులలోపు అన్ని ఒరిజినల్ మద్దతు పత్రాలతో దిగువ సంతకందారులను సంప్రదించాలి, లేని పక్షంలో పేర్కొన్న విక్రయ లావాదేవీ పూర్తవుతుంది మరియు ఆ తర్వాత ఎలాంటి క్లెయిమ్ లేదా అభ్యంతరం ఏదైనా ఉంటే పరిగణలోకి తీసుకోబడదు.

మహ్మద్ ఇక్బాల్ అహ్మద్
LL.B; MBA; LL.M
అడ్వకేట్ హైకోర్టు-టి.ఎస్.
ఆఫీస్: బహేతి రెసిడెన్సీ, ఇంటి నెం.16-11-20/13/2, సబ్-రిజిస్ట్రార్ ఆఫీస్ ప్రక్కన, ఆజంపుర, మలక్‌పేట్.

IN THE COURT OF THE HON'BLE PRI DISTRICT & SESSIONS JUDGE CUM FAMILY COURT: MEDCHAL-MALKAJGIRI DIST. AT: KUSHAIGUDA-MALKAJGIRI M.V.OP.No. 5 OF 2020

Between:
G.Nandhini ....Petitioner
And
Sidramaina Raju. ....Respondent No.2

To,
R2) Sidramaina Raju S/o.S. Narsimhlu, R/o.H.No.11-126-1, Mallam Basth, Bollaram Jinnaram, Sangareddy District, T.S.

Please take notice that Petitioner above named filed the above M.V.O.P No. 5 of 2020 against Respon dents for award of compensation under M.V.Act, you are hereby required to appear in this court on **26/12/2023** may appear before the above said Court at **10:30 am** either in person or through advocate on which intend to reply in support or defense and filing your counter etc. failing which the matter will be heard and decided exparte.

(By order of the Court)
V.LAKSHMAN GOUD ADVOCATE,
1-23-318, Bhoodevi Nagar, Alwal, Secunderabad, Cell: 9951183297 counsel for Petitioner.

IN THE COURT OF THE HON'BLE XX JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT: HYDERABAD O.S.No.3923 OF 2023

Between:
Priti Agarwal and other .....Plaintiffs
And
M.R.O.and another .....Defendants

To,
All Concerned

Take notice that the Plaintiff has filed the Suit O.S.No. 3923 of 2023 on the file of the XX Junior Civil Judge, City Civil Court, Hyderabad to declare the legal status of the plaintiffs as legal heirs of late Dinesh Agarwal and all concerned has been arrayed as Defendant 2 in the said suit. Anybody having any objection or claim regarding the same are required to enter appearance personally or through duly instructed counsel on **21-12-2023 at 10:30 a.m.** in the said court. On failure to appear on the said date you will be set ex-parte and the matter will be decided in your absence

//BY ORDER OF THE COURT//
MANISH KUMAR AGARWAL ADVOCATE
Flat.No.107, 1st Floor Ratan Vatika, 21-2-442, Charkaman, Matti Ka Sher, Hyderabad-500002. T.S Ph: 9848027336

IN THE COURT OF THE HONOURABLE VIII JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT HYDERABAD I.A.NO. 367 OF 2018 in O.S.NO. 1972 OF 2018

Between:
Hazrath Habeeb Mujtaba Al Aidroos ...... Petitioner/Plaintiff
and
Habeeb Mohammed & another ....Respondents/Defendant

To
M/s Facebook,
Rep. by its Managing Director, Corporate office at Plot No.11, Software Units Layout, Infocity Madhapur, Hyderabad - T.S. ....Respondent No.2

Take notice that the Petitioner/ Plaintiff has filed the above suit for Injunction against the Respondents herein, in the said suit has filed I.A.No.367/2018 for grant of Ad interim Injuction, and the said I.A. is posted to 26-12-2023 for your appearance, in case if you fails to appear before the above court in the above matter on 26-12-2023 at 10-30 Am in person or through Counsel the matter will be decided as per law

//BY ORDER OF THE COURT//
S. RAJ KUMAR Advocate
3-6-128/3, Hyderguda Hyderabad - TS Cell : 9848082821

IN THE COURT OF THE ADDL. SENIOR CIVIL JUDGE: BHONGIR I.A. NO. 91 OF 2023 in O.S. NO. 52 OF 2019

Between
Kodimala Srivardhan Reddy .....Petitioner/Plaintiff
and
Kodimala Maliz Reddy & others .....Respondents/ Defendants No.1 to 5
and
Ponnam Anuradha & others .....Respondents/ Proposed Defendants No. 6 to 9

TO
R-6: PONNAM ANURADHA, W/o. late Muraligoud, aged 50 yrs, occ: Housewife,
R-7: PONNAM TARUN GOUD, S/o. late Muraligoud, aged 35 yrs, occ: Business
R-8: PONNAM KESARI GOUD, S/o. late Muraligoud, aged 30 yrs, occ: Busines
R9: PONNAM MAMATHA, D/o. late Muraligoud, aged 28 yrs, occ: Business
All R/o.H.No.1-39, Mamatha Nilayam, BODUPPAL (V) Ghatkesar (M) Medchal-Malkajgiri dist.

NOTICE

Take notice that the petitioner-plaintiff filed the above I.A. in the above main suit against you and other defendants U/O. XXII Rule 3 & 4 CPC before the Hon'ble Addl. Senior Civil Judge, Bhongir for partition and the above I.A. is posted on 21-12-2023 for your appearance before the said court. If you failed to appear either in person or through Advocate on 21-12-2023 at 10-30 am before the said court, the matter will be decided in exparte.

(BY ORDER OF THE HON'BEL COURT)
BOBBALA KESHAVA REDDY ADVOCATE BHONGIR
Date: 08-12-23
Place: BHONGIR

IN THE COURT OF THE HON'BLE ADDL. JUNIOR CIVIL JUDGE CUM VII ADDL JUDICIAL MAGISTRATE AT: HAYATHNAGAR O.S. No. 397 of 2021

Between:
M.Sudha Rani @ Ch Sudha Rani .....Plaintiff
And
K.Kiran & others .....Defendants

To,
K.Kiran S/oK.Kesav Rao (Defen dant No.1) R/o.H.No.3-4-526/29, Flat No.102, Vinutna villa, Lingampally, Hyderabad-27
Patha Lakshmi W/o P.Shekar (Defendant No.2) R/o.H.No.1-1-4 / 4,(1-19/1), Jawahar Nagar, Chikkadpally, Hyderabad
Vennelakanti Srinivas kumar (Defendant No.3) R/o.H.No.2-3-73 4/C/22, ShankernAGAR, Near 6th circle, Amberpet, Hyderabad-13
Present Address: Plot No.174, sripuram colony. Malakpet, Hyd

Whereas you are arrayed as Defendant No.1 and 3 you are hereby instructed to apper in this court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accomplained by some person able to answer all such questions on the **20-12-2023 at 10-30 O'clock.**

(BY ORDER OF COURT)
M/s.BHUVANESHWARI DEVI-B & ASSOCIATES
2-2-880, AMEERPET, HYDERABAD - 500 013,

PUBLIC NOTICE

The general public hereby informed that to **PANYALA SAIKIRAN GOUD S/O. PANYALA YADA GOUD** Aged about 31 years, Occ: Business, R/o. House No.13-13/3/2, Opp Alind, Nehru Nagar, Serilingampally Village & Mandal, Rangareddy District., has approached the Shriram Finance Ltd., Kukatpally Branch., by put his documents by way of mortgage in respect of Schedule of Property to secure the future Liability towards Loan amount. If any person or person's having any objections. Right, claim, title, interest over the Schedule of Property shall approach the undersigned with support of their claim within seven days, failing which the loan amount shall be sanctioned to **PANYALA SAIKIRAN GOUD S/O. PANYALA YADA GOUD**, and no claim or no objection of any kind thereafter will be entertained.

SCHEDULE OF THE PROPERTY

All that the House bearing No.13-13/3/2/B, PTIN No.1120009611, having plinth area 280 Sft., (ACC), admeasuring 100 Sq.Yds., Situated at Nehru Nagar Colony, Serilingampally Village & Mandal, Under GHMC Serilingampally Circle, Rangareddy District., and bounded by:
NORTH : 20'-0" Wide Road.
SOUTH : 10'-0" Wide Road.
EAST : Neighbour's House.
WEST : House No.13-13/3/2.

By
R. VENKATESHWAR RAO Advocate, & Panel Advocate of SHRIRAM FINANCE LTD.
5-3-29, Near Ramalayam Temple, Kukatpally, Hyderabad - 72. Cell.: 9391093566, 8519985749 Email : Venkateshwarraoadv@gmail.com

---

IN THE COURT OF THE HONOURABLE VIII JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT HYDERABAD O.S.NO. 1972 OF 2018

Between:
Hazrath Habeeb Mujtaba Al Aidroos ...... Plaintiff
and
Habeeb Mohammed & another ...... Defendants

To
M/s Facebook, Rep. by its Managing Director, Corporate office at Plot No.11, Software Units Layout, Infocity Madhapur, Hyderabad - T.S. ......(Defendant No.2)

Take notice that the Plaintiff has filed the above suit for perpetual Injunction against the Defendants herein, and the said suit is pending and posted to 26-12-2023 for your appearance, in case if you fails to appear before the above court in the above matter on 26-12-2023 at 10.30 A.M. the matter will be decided as per law

//BY ORDER OF THE COURT//
S. RAJ KUMAR Advocate
3-6-128/3, Hyderguda Hyderabad - TS Cell : 9848082821

IN THE COURT OF THE IV ADDL JUNIOR CIVIL JUDGE AT : L.B. NAGAR O S No. 1061 of 2022

Between:
Smt. Kamarapu Jyothsna ...Petitioner/Plaintiff
And
Sri Kammari Jambula Chary and others ... Respondent/ Defendant

To,
2. Sri Bommagni Bikshmaiah s/o Late B.Laxmaiah,Age :62, Occ: Business , r/oH.No. 2-53/1, Sita Homes, Phase-3, Almasguda Village, Balapur Mandal, Ranga reddy District,, 500058. (D-2)
3. Komarapu Shobha d/o Basawaiah, w/o K.Ramu, Aged About : 47 Years, Occ: House Hold, r/o H.No. 2-2-735/10, 3 rd Floor, 3-B, Pochammabasthi, Amberpet,Hyderabad. (D-3)

Whereas the above-named plaintiff has filed the above suit for partition in O S. No. 1061/2022 against you. You are hereby summoned to appear before the Hon'ble court in person on 23 -12-2023 at 10.30 am for your appearance.

Therefore you are hereby directed to appear before the IV Addl. Junior Civil Judge, Rangareddy, At L.B Nagar on 23-12-2023 at 10-30 am either in person are through counsel, otherwise the matter will be decided ex-party in your absence.

(By the order of the court)
P. Amba Shankar Advocate
H.No. 7-286/1, Srishakthinagar, Balapoor, Hyderabad. Ph. 9440348468

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE: RANGA REDDY DISTRICT AT: L.B.NAGAR I.A. NO. 407 OF 2022 IN O.S. NO. 1075 OF 2022

Between:-
Aenugu Pramod Reddy ... Petitioner/Plaintiff
AND
A. Srikanth & others ... Respondents/Defendants

To,
1. A. Srikanth, S/o. A. Laxmoji, Aged Major, Occ: Business, R/o.H.No.3-15,Gundlapally Village and Mandal, Nalagonda District. (Respondent/Defendant No.1)
2. A.Yellamma, W/o. A.Venkatesh, Aged Major, Occ: Housewife, R/o.H.No.11-3-99, Road No.15, Venkateshwara Colony, L.B.Nagar Saroornagar Mandal, R.R.District. (Respondent/Defendant No.2)
3.K.Bhagyalaxmi, W/o.D.Hemanth Kumar, Aged Major, Occ : Business, R/o.H.No.1-52/3, Kuma ribasthi, Shaikpet, Madhapur, Hyd (Respondent/Defendant No.5)
4. V.Vijay Kumar Reddy, S/o.Yadi Reddy, Aged Major, Occ: Business, H.No.3-1-158/1/A, Bahadurguda, Shivapuri Colony, L.B.Nagar, R.R.District. (Respondent/Defendant No.6)
5. M.Shekar, S/o.M.Bachaiah, Aged Major, Occ: Business, R/o.H.No. 1-48, Cherukupally Village, Gundlapally Mandal, Nalagonda District. (Respondent/Defendant No.7)

...Defendants No.1, 2, 5 to 7

NOTICE

Please take Notice that, the Petitioner/Plaintiff filed a Suit for Perpetual Injunction against the Respondents/Defendants vide O.S.No. 1075/2022 on the file of the Hon'ble Prl. Junior Civil Judge, R.R.District., along with the Suit the Petitioners/Plaintiffs filed a Petition for grant of Ad-Interim Injunction in favour of the Petitioners/Plaintiffs Under Order-39 Rule-1 & 2 Read With Section 151 Of C.P.C., against you, wherein the Hon'ble Court was pleased to Order to serve the notice to You and the same is posted on 18/12/2023 at 10-30 a.m., for your appearance and if you fail to appear before the Hon'ble Court the matter will be decided on merits. Hence the Notice.

// By Order of the Court //
G.MADHUSUDAN REDDY Advocate,
4239/1999 Flat No.107, IInd Floor, City Central Apartments, Beside South India Shopping Mall, Margadarshi Colony, Kothapet, hyd-35

IN THE COURT OF HON'BLE XIX JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT HYDERABAD. O.S.NO. 3109 OF 2021

Between:-
Indian Bank, Hyderabad Main Branch Koti, Hyderabad. .....Plaintiff
And
Smt. Sunitha Guvvani .....Defendant

To,
Smt.Sunitha Guvvani, Prop. M/s. Sunitha Agro Products,H.No.8-3-1 62/A10/2, Sanjay Nagar, Yousufguda, Hyderabad. .....Defendant

Whereas the above named Plaintiff has filed the suit for recovery of amount against the Defendant and the case is posted for your appearance on **14-12-2023**. Therefore you are hereby summoned to appear either in person or through Advocate with your defenses if any on **14-12-2023 at 10.30 AM** before the Hon'ble Court, failing which the case will be heard and decided as per law.

// BY ORDER OF THE COURT //
RAKESH KUMAR HEDA, ADVOCATE.
610-A, 6th floor, Amrutha Estates, Himayatnagar, Hyderabad - 29.

PUBLICATION ON ORDERS OF COURT

Take notice that **Smt. Teppali Laxmi** and her children filed suit for declaring to be the legal heirs of Late **Sri Teppali Rathnakar** before Hon'ble Junior Civil Judge at Choutuppal in OS. No. 312/2023 and upon which the Hon'ble court was pleased to direct issue paper publication for inviting objections. Accordingly, any person objecting to the claims of **Teppali Laxmi** may appear either in person or through their counsel before the Hon'ble Junior Civil Judge at Choutuppal on the next date of hearing **26.12.2023** and in the absence of the same the Hon'ble court may pass such orders as prayed for.

DACHEPALLY CHANDRA BABU ADVOCATE
#11-10-69/1, Plot No.100, SBI Colony, Road No.3, Kothapet, Hyderabad-500 035. Cell: 9100166685.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE AT HAYATHNAGAR O.S.No. 851 OF 2023

BETWEEN:
1. Gopagoni Maramma W/o Late Gopagoni Lakshmaiah Aged 55 years Occ: Pvt Employee,
2. Gopagoni Linga Swamy S/o Late Gopagoni Lakshmaiah Aged 38 years Occ: Pvt Employee,
3. Gopagoni Shiva kumar S/o Late Gopagoni Lakshmaiah Aged 33 years Occ: Pvt Employee,
4. Midde Shilaja D/o Late Gopagoni Lakshmaiah, W/o Medde Yadaiah,Aged 35 years Occ: Pvt Employee,
All are Resident at H.No.4-156/4, Tallyellemal Village, Chityal Mandal, Nalgonda Dist. ..Plaintiff/s
AND
1. All concened
2. The Mandal Tahasildhar officer Hayathnagar Having office at Hayathnagar village & Mandal. R.R Dist .Telangana. ..Defendant/s

Sirs,
Whereas the above named Plaintiffs have filed the above suit seeking the declaration as legal heirs of Late Gopagoni Lakshmaiah. Therefore, all concerned are hereby requested to appear before the Hon'ble court at 10:30 A.M. on 19-12-2023 either in person or through Counsel duly instructed if you have any objection. Otherwise the matter will be heard and decided exparte in your absence.

SCHEDULE PROPERTY

All that part and parcel of land bearing All tht part and parcel of open Plot No.29, admeasuring of 182 Sq yards in Sy No.35,37, and 39, ward No.4, Block No.11, situated at Anmgal Hayathnagar Village, Hayathnagar Revenue Mandal, Ranga Reddy District L.B nagar municipality, Registration sub Hyderabad east,and bounded on;North : 25 wide Road, South : Plot No.31,East : Plot No.29 part,West : land of Sri Anantha Reddy

(Bumanandham Ganji) ADVOCATE,
Hayathnagar, Hyd. Ph: 9392552949,

IN THE COURT OF THEHON'BLE SENIOR CIVIL JUDGE-CUM-ASSISTANT SESSONS JUDGE, AT: CHEVELLA I.A.No. 378 of 2021 IN O.S.No. 297 of 2022

BETWEEN:
Smt.R.Indiramma ...Petitioner/Plaintiff
And
Smt.R.Laxnamma And others ...Respondents/Defendants

To,
R-1.Smt.R.Laxmamma, W/o.Late R.Narayana Reddy, Aged about 87 years, Occ: Housewife. R/o.Singa poor Village, Shankerpally Mandal, Ranga Reddy District
R-4.Smt.Chakrampally Mallamma, W/o.Prabhakar Reddy, Aged 58 years. Occ: Housewife,R/o.H.No. 3-2. Bhanur, Patanchenu, Sanga Reddy District-502 305
R-5.Smt. Ramannolla Laxmi, W/o. R.Penta Reddy, Aged 49 years. Occ: Housewife. R/o.H.No. 1-46, Baireddyguda, Cheemaldari, R.R.District-50111
R-9.Rayannagari Chandrasekhar Reddy. S/o.R.Krishna Reddy. Aged about 36 years. Occ: Agriculture. R/o.H.No.1-25, Singapoor Village. Shankerpally Mandal. R.R.District
R-10.Nagiredla Chandra Mohan Reddy. S/o.N.V.Ramana Reddy, Aged about 53 years. Occ: Busi ness. R/o.H.No.2-38, Gandipet Village And Mandal, R.R.District
R-11.Gogineni Sridhar, S/o. G.Venkateshwar Rao, Aged 37 years, Occ: Business, R/o.H.No.2-2-18/28. DD Colony, Amberpet. Hyderabad-500007
R-12.Kondakalla Madhusudhan Reddy, S/o.K.Ramakrishna Reddy, Aged about 42 years, Occ: Busi ness, R/o.H.No.5-45. Manikonda Village. Uppalguda. Gandipet Mandal. Ranga Reddy District
R-16.M/s.IB Developers. Rep.by its Managing Partners (2) Isanka Mastan Reddy (2) Ballela Sridhar Reddy. Office at Flat No.201, MagnaLake View Apartmentrs, Khanamet Village. Serilingampally Mandal, Hyderabad-500 081
R-18.Mungi Janga Reddy, s/o. Chandra Reddy. Aged about 44 years. Occ: Businest. R/o.H.No.3-147, Kokapet Village. Gandipet Mandal, R.R.District
R-20.G.Ramesh Yadav, S/o. Komuraiah Yadav, Aged about 52 years, Occ: Business R/o.Narsingi Village, Rajendranagar Mandal, Ranga Reddy District

...Respondents No.1, 4, 5, 9 to 12, 16, 18 and 20/ Defendants No.1, 4, 5, 9 to 12, 16, 18 and 20

Take notice that the above named Petitioner/Plaintiff has filed the above Suit for Partition and Separate Possession of the Suit Schedule Property and also declaration to declare the Registered Documents as null and void and not binding on her to the extent of her share against the Defendants herein in respect of the **SUIT SCHEDULE PROPERTY** and also filed I.A.No.378/2021 and the said case is stands posted to **28/12/2023** for your appearance and Counter Statement. Hence, you are hereby directed to appear before the above Court on **28/12/2023 at 10.30 a.m.** either in person or through an Advocate, failing which the matter will be decided, basing on the documents available on record.

(BY ORDER OF THE COURT)
Sd/-
M/S.ABDULWAHID BASHA, Advocate
#8-7-98/85/8, Sai Kuteer. Road No.1. Agricultural Colony. Hastinapuram, Hyderabad Counsel for the Petitioner/Plaintiff

---

IN THE COURT OF TH HON'BLE SENIOR CIVILJUDGE-CUM-ASSISTANT SESSONS JUDGE, AT: CHEVELLA O.S.No. 297 of 2022

BETWEEN:
Smt.R.Indiramma ...Petitioner/Plaintiff
And
Smt.R.Laxnamma And others ...Respondents/Defendants

To,
D-1.Smt.R.Laxmamma, W/o.Late R.Narayana Reddy, Aged about 87 years, Occ: Housewife. R/o.Singa poor Village, Shankerpally Mandal, Ranga Reddy District
D-4.Smt.Chakrampally Mallamma, W/o.Prabhakar Reddy, Aged 58 years. Occ: Housewife,R/o.H.No. 3-2. Bhanur, Patanchenu, Sanga Reddy District-502 305
D-5.Smt. Ramannolla Laxmi, W/o. R.Penta Reddy, Aged 49 years. Occ: Housewife. R/o.H.No. 1-46, Baireddyguda, Cheemaldari, R.R.District-50111
D-9.Rayannagari Chandrasekhar Reddy. S/o.R.Krishna Reddy. Aged about 36 years. Occ: Agriculture. R/o.H.No.1-25, Singapoor Village. Shankerpally Mandal. R.R.District
D-10.Nagiredla Chandra Mohan Reddy. S/o.N.V.Ramana Reddy, Aged about 53 years. Occ: Busi ness. R/o.H.No.2-38, Gandipet Village And Mandal, R.R.District
D-11.Gogineni Sridhar, S/o. G.Venkateshwar Rao, Aged 37 years, Occ: Business, R/o.H.No.2-2-18/28. DD Colony, Amberpet. Hyderabad-500007
D-12.Kondakalla Madhusudhan Reddy, S/o.K.Ramakrishna Reddy, Aged about 42 years, Occ: Busi ness, R/o.H.No.5-45. Manikonda Village. Uppalguda. Gandipet Mandal. Ranga Reddy District
D-16.M/s.IB Developers. Rep.by its Managing Partners (2) Isanka Mastan Reddy (2) Ballela Sridhar Reddy. Office at Flat No.201, MagnaLake View Apartmentrs, Khanamet Village. Serilingampally Mandal, Hyderabad-500 081
D-18.Mungi Janga Reddy, s/o. Chandra Reddy. Aged about 44 years. Occ: Businest. R/o.H.No.3-147, Kokapet Village. Gandipet Mandal, R.R.District
D-20.G.Ramesh Yadav, S/o. Komuraiah Yadav, Aged about 52 years, Occ: Business R/o.Narsingi Village, Rajendranagar Mandal, Ranga Reddy District
21.Joshi Surekha, W/o. Manikya Rao. Aged about 65 years, Occ: Housewife. R/o.H.No.2-3, Fathe pur Village. Shankerpally Mandal, R.R.District

..Defendents No.1, 4, 5, 9 to 12, 16, 18 and 20

Take notice that the above named Plaintiff has filed the above Suit for Partition and Separate Possession of the Suit Schedule Property and also declaration to declare the Registered Documents as null and void and not binding on her to the extent of her share against the Defendants herein in respect of the **SUIT SCHEDULE PROPERTY** and the said suit is stands posted to **28/12/2023** for your appearance and Written Statement. Hence, you are hereby directed to appear before the above Court on **28/12/2023 at 10.30 a.m.** either in person or through an Advocate, failing which the matter will be decided, basing on the documents available on record.

(BY ORDER OF THE COURT)
Sd/-
M/S. ABDULWAHID BASHA, Advocate
#8-7-98/85/8, Sai Kuteer. Road No.1. Agricultural Colony. Hastinapuram, Hyderabad Counsel for the Petitioner/Plaintiff



మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి శుక్రవారం గాంధీ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మాణిక్ రావు ఠాక్రేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి దంపతులు పుష్పగుచ్ఛం అందజేసి, ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ- బడంగ్ పేట్



మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని శుక్రవారం ఆమె నివాసంలో జల్‌పల్లి మున్సిపల్ పరిధిలోని పహాడీ షరీఫ్ గ్రామ 14వ వార్డు కౌన్సిలర్ దస్తగిర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యేను పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. తర్వాత పుష్పగుచ్ఛం అందజేసి, ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ- బడంగ్ పేట్

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



• మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ- బడంగ్‌పేట్

సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి కాంట్రాక్టర్‌కు సూచించారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 23వ డివిజన్ ఎస్‌బీఆర్ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం కార్పొరేటర్ రాళ్లగూడెం సంతోషి శ్రీనివాస్ రెడ్డితో కలిసి మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అన్ని డివిజన్లలోని ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఎంతో కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి పనులను పూర్తి చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ దీపాలు, తాగునీటి సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, డీఈఈ జ్యోతి రెడ్డి, ఏఈఈ వినీల్ గౌడ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆర్టీసీలో మహాలక్ష్మి





గ్రేటర్‌లో రోజూ సుమారు 12 లక్షల మంది ప్రయాణం
దీనిలో 50శాతం మహిళా ప్రయాణికులే..!

నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎస్ఆర్టీసీ బస్సుల్లో ఇక నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం అమలు కానుంది. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని మహిళలందరికి నేటి నుంచి ఈ సదుపాయం అందుబాటులోకి రానుంది. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో మహాలక్ష్మి పథకం ఒకటి. నేడు సోనియాగాంధీ పుట్టిన రోజు కానుకగా తెలంగాణ ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తూ జీవో విడుదల చేసింది. అందుకనుగుణంగా టీఎస్ఆర్టీసీ సైతం ఏర్పాట్లను పూర్తిచేసింది. నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభిస్తారు. మధ్యాహ్నం తర్వాత నగరం, రాష్ట్రంలోని బాలికలు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఆర్డనరీ, మెట్రో, సబర్బన్, పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చు.

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మొత్తం 25 డిపోలుండగా.. వీటపరిధిలో సుమారు 2800 వరకు ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయి. ఈ బస్సుల్లో ప్రతిరోజూ సుమారు 12లక్షల మంది నగరంలోని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి రాకపోకలు సాగిస్తున్నారు. ఇందులో మహిళా ప్రయాణికులు దాదాపు 40శాతం వరకు ఉంటారు. ప్రస్తుతానికి టీఎస్ఆర్టీసీకి టికెట్ల జారీ ద్వారా ప్రతిరోజూ సుమారు 3.80 కోట్ల నుంచి 4కోట్లపైగా ఆదాయం లభిస్తోంది. మొత్తం 12లక్షల మంది ప్రయాణికుల్లో... బాలికలు, మహిళలు, ట్రాన్స్‌జెండర్స్ కలిపి సుమారు 5–6లక్షల మంది ఉంటారని టీఎస్ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. అంటే మహిళా ప్రయాణికుల ద్వారా ఆర్టీసీకి రోజువారి ఆదాయం 1.50కోట్ల నుంచి 2కోట్లు వరకు ఉంటుందని తెలిపారు. ఇక ఉచిత ప్రయాణం నేపథ్యంలో ప్రయివేటు వాహనాల ద్వారా గమ్యాలకు వెళ్లేవారు ఇకపై ఆర్టీసీలో ప్రయాణిస్తారని తద్వారా ప్రయాణికులు పెరుగుతారని అధికారుల అంచనా. మొత్తానికి ఒక రోజుకు ఆర్టీసీకి ప్రభుత్వం సుమారు రూ. రెండు కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

కర్నాటక తరహాలో అమలు..!

తెలంగాణలో నేటి నుంచి అమలులోకి రానున్న మహాలక్ష్మీ పథకాన్ని ప్రస్తుతానికి కర్నాటక తరహాలో అమలు చేయనున్నారు. అనంతరం ఇక్కడి అవసరాలకు తగ్గట్టుగా మార్పులు చేయనున్నట్టు టీఎస్ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.కర్నాటకలో అక్కడ ఇలాంటి గ్యారెంటీలను ప్రకటించి అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. అక్కడ కూడా మహిళల ఉచిత ప్రయాణం అనే పథకాన్ని కాంగ్రెస్ అమలులోకి తెచ్చింది. మొదట్లో అమలు సందర్భంగా కొన్నిరకాల ఇబ్బందులు ఎదురైనప్పటికీ.. తర్వాత అంతా సర్దుకుపోయింది. కర్నాటక ప్రభుత్వం ఈ ఏడాది జూన్ నుంచి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి అనుమతి ఇచ్చింది. ఇందులో ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మాత్రమే మహిళలకు ఉచిత ప్రయాణ అవకాశం కల్పించింది. ఈ పథకం అమలులోకి వచ్చాక ఆర్టీసీలో ప్రయాణించే మహిళల సంఖ్య గణనీయంగా పెరిగింది. కర్నాటకలో కొత్త ప్రభుత్వం వచ్చిన ప్రారంభంలో ఫోటో గుర్తింపు కార్డు, అడ్రస్ ప్రూఫ్ చూపించినా సరే బస్సుల్లో ప్రయాణానికి అనుమతించారు. ఆ తర్వాత అక్కడి ప్రభుత్వం స్మార్ట్ కార్డులను తీసుకొచ్చింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరించి అమలు చేసింది. అంతేగాక ఆ రాష్ట్రానికి చెందిన మహిళలకు మాత్రమే వర్తింపజేసింది. అది కూడా కేవలం సిటీ, ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల వరకు మాత్రమే ఉచితం అమలు చేసింది. వేరే రాష్ట్రాలకు వెళ్లే కర్ణాటక బస్సులకు ఈ పథకం వర్తించదు. కానీ మనదగ్గర తెలంగాణ పరిధి వరకు అనుమతిం చనున్నారు. అలాగే రాష్ట్రంలోని మహిళలతో పాటు ఇతర రాష్ట్రాలకు సంబంధించిన వారు ఇక్కడి ప్రభుత్వం జారీ చేసిన ఓటర్ కార్డు, ఆధార్ కార్డుతో పాటు ఏదైనా కార్డు ఒకటి చూపించి ఉచిత జర్నీ చేయవచ్చు.

మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం సంతోషకరం. కాంగ్రెస్ పార్టీ దీన్ని అమలు చేసినందుకు ధన్యవాదాలు.
సుష్మ
అంబర్‌పేట

రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ - సంతోష్ నగర్

ఓల్డ్ మలక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు కొమిరెల్లి రాజశేఖర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నూతన సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి శుక్రవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు ఇబ్బందులు పడకుండా ఇనుప భారీ గేట్లను తొలగించి.. ప్రగతి భవన్ పేరు మార్చడం చారిత్రాత్మక విషయమని అన్నారు. ప్రగతి భవన్ పేరును జ్యోతిరావు పూలే భవనంగా మార్చి ప్రజా దర్బార్‌గా నామకరణం చేయడం హర్షణీయమన్నారు. ఇకనుంచి జ్యోతిరావు పూలే భవనం ప్రజలకు అందుబాటులో ఉంటుందని, రాష్ట్ర ప్రజలందరూ తమ తమ సమస్యలను తెలియపరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బాబు శ్రీనివాస్, గ్రేటర్ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ చౌకి రవికుమార్, నాయకులు ఆకుల రాజు, రామకృష్ణ, వేముల విజయకుమార్, చల్లారి కృపాకర్ రెడ్డి, చేగి రెడ్డి మదన్మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గౌరెల్లిలో అభివృద్ధి వేగవంతం

సర్పంచ్ తుడుం మల్లేష్

నవతెలంగాణ - అబ్దుల్లాపూర్ మెట్

సంక్షేమ అభివృద్ధిలో భాగంగా గ్రామంలో అభివృద్ధిని మరింత వేగవంతం చేయడం జరుగుతుందని గౌరెల్లి సర్పంచ్ తుడుం మల్లేష్ అన్నారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ రెండు నెలల కిందట గ్రామంలోని ఇందిరమ్మ కాలనీ నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు



నూతనంగా కృష్ణ వాటర్ పైప్ లైన్ పనులు నిర్వహిస్తుండగా.. అంతలోనే శాసన సభ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులకు అంతరాయం ఏర్పడిందన్నారు. ఎన్నికల కోడ్ ముగియడంతో తిరిగి పైప్ లైన్ పనులను పునః ప్రారంభించినట్లు తెలిపారు.ఈ పైపులైను పూర్తయితే గ్రామంలో మంచినీటి సమస్య తీరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కేసీఆర్ కోలుకోవాలని ప్రత్యేక పూజలు



నవతెలంగాణ - చైతన్యపురి

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరగా కోలుకోవాలని మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్కేపురంలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అరవింద శర్మ మాట్లాడుతూ గజ్వేల్లోని తన ఫామ్ హౌస్‌లోని బాత్ రూమ్‌లో కాలుజారి కిందపడి చిన్న గాయమైందన్నారు. యశోద ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నాడని చెప్పారు. త్వరగా కోలుకొని ప్రజా సమస్యలపై పోరాటం చేస్తారని అన్నారు. మూడు కోట్ల తెలంగాణ ప్రజల దీవెనలు ఎల్లప్పుడూ కేసీఆర్‌కు ఉంటాయని అన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం పరితపించే నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్కే పురం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, నాయకులు న్యాల కొండ శ్రీనివాస్ రెడ్డి, గొడుగు శ్రీనివాస్, మురళీధర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, కంచర్ల శేఖర్ ,వల్లారి రమేష్, బాలు శ్రీ, ముచ్చింతల జగన్, మహేందర్ రెడ్డి, శ్రీరాములు, పబ్బు శేఖర్, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

వైన్స్‌ను తొలగించాలి : యాదగిరి



నవతెలంగాణ - నాగోల్

జనావాసాల మధ్య ఉన్న వైన్స్‌ను తొలగించాలని బీఎస్పీ ఎల్బీనగర్ ఇంచార్జ్ జక్కా యాదగిరి పటేల్ డిమాండ్ చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గం అధ్యక్షుడు గువ్వల సాయి రామకృష్ణ ముదిరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాగోల్ డివిజన్ జైపూర్ కాలనీలో శ్రీ వెంకటేశ్వర వైన్సును తొలగించాలని కోరారు. జనావాసాల మధ్య వైన్స్ ఉండడం వలన స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జైపురి కాలనీ రోడ్డు నుండి మహిళలు, యువత నడుచుకుంటూ వెళ్తున్నప్పుడు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే ఈ వైన్స్‌ను తొలగించాలన్నారు. జైపూరి కాలనీలో కాకుండా బండ్లగూడ మెయిన్ రోడ్డుకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వేముగంటి సంపత్, కార్యదర్శి కట్ల కుమార్, అనగల్ల స్వామి మహేష్, బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా రావి, వేప చెట్టుకు కళ్యాణం



నవతెలంగాణ - చైతన్యపురి

ఆర్కే పురం డివిజన్‌లోని ఇన్కమ్ టాక్స్ కాలనీలో ఇన్కమ్ టాక్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఆధ్వర్యంలో కార్తీక మాసంలో భాగంగా శుక్రవారం అశ్వత లక్ష్మి నారాయణ స్వరూపం రావి, వేప చెట్టుకు కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రకృతిని పూజించే సంస్కృతి మనది అని కొనియాడారు. ఆ ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరీపై ఉందన్నారు. అనంతరం వనభోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాధా ధీరజ్ రెడ్డి, శ్రీధర్, కాలనీ ప్రెసిడెంట్ రాజా శ్రీ రామరావు, సొసైటీ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, ఉమెన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ అన్నపూర్ణ, వైస్ ప్రెసిడెంట్ నీలిమ (ఆర్టిస్టిక్ క్లయిక్ ప్రీ స్కూల్), సెక్రటరీ రాధా, రామస్వామి, వెంకటరమణ, మునిపల్లి శ్రీనివాస్ (ప్రత్యంగిరా టెంపుల్), ఉదయభాను, భాస్కర్ (వారాహి దేవాలయం), రామ్మోహన్, సాంబశివరావు, ఉషా పాల్గొన్నారు.



మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్‌లో సామ రాఘవరెడ్డి(85) అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బడంగ్ పేట్ నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిగురింత నరసింహారెడ్డి, సామ ప్రభాకర్ రెడ్డిలు శుక్రవారం రాఘవరెడ్డి పార్థివ దేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నవతెలంగాణ - బడంగ్‌పేట్

• అనతి కాలంలోనే వందలాది ఉద్యోగాలు సాధించడంలో సఫలీకృతం
• సేవ చేస్తూనే లక్ష్యం వైపు పరుగులు..



పోలీసు ఉద్యోగాలకు కేరాఫ్ నందు ఆర్మీ అకాడమీ

నవతెలంగాణ - చైతన్యపురి

నల్గొండ జిల్లా చందంపేట మండలం బొల్లారం గ్రామానికి చెందిన నందులాల్ నాయక్ చిన్నప్పుడే తల్లిని కోల్పోయాడు. అనేక బాధలు భరిస్తూ ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలో చదువుకున్నాడు. ఇంటర్మీడియట్ తెనాలిలో, డిగ్రీ హైదరాబాద్‌లో పూర్తి చేశాడు. హైదరాబాద్‌లో ఒకవైపు చదువుతూనే ఖాళీ సమయంలో కేటరింగ్ పనులు చేస్తూ.. తన కుటుంబంపై భారం పడకుండా చదువును కొనసాగించాడు. కడపలో పీటీ పూర్తి చేశాడు. అనంతరం 2016లో లాల్ సింగ్ నాయక్, ప్రో కబడ్డీ శ్రీనివాస్‌ల దగ్గర అసిస్టెంట్ గా పనిచేసి మెలకువలు నేర్చుకున్నాడు. సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశంతో 2018లో ఫిజికల్ ట్రైనింగ్ స్టార్ట్ చేసి ఎంతోమందికి ఉపాధి కల్పించడంతోపాటు, పేద విద్యార్థులకు గ్రౌండ్ శిక్షణను ఉచితంగా అందజేసేవాడు. అంతేకాకుండా వారికి కావాల్సినవి, హాస్టల్లో ఉండేందుకు వసతి కోసం ఫీజులు కూడా చెల్లించేవాడు. నందు ఆర్మీ ఫిజికల్ అకాడమీ స్థాపించినప్పటినుంచి ఎన్నో సేవా కార్యక్రమాలు, బ్లడ్ డొనేషన్ లాంటి క్యాంపులు నిర్వహించాడు. సుమారుగా 200 మంది విద్యార్థులచే నందు ఆర్మీ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలును గుర్తించి గవర్నర్ నుంచి సర్టిఫికెట్ అందుకోవడం జరిగింది.

2018లో సుమారుగా 200 మంది కానిస్టేబుల్ ఉద్యోగాలు, 45 మంది ఎస్ఐ ఉద్యోగాలు, ఆర్మీలో 5 జీడి కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. నిరంతరం కష్టపడుతూ విద్యార్థుల లక్ష్యమే నందు ఆర్మీ అకాడమీ లక్ష్యం అని భావించి..ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ మంచి ఫలితాలు రాబడుతున్నామని తెలిపారు. 2023లో గ్రూప్ డి లో 111 మంది, జీడి కానిస్టేబుల్‌లో 60 పైగా ఉద్యోగాలు, ఢిల్లీ నోటిఫికేషన్లు భాగంగా 6 ఎస్ఐ ఉద్యోగాలు, సాధించడం జరిగింది. ఇటీవల తెలంగాణలో జరిగిన పోలీసు ఉద్యోగుల భర్తీలలో నందు ఆర్మీ అకాడమీ నుండి 64 మంది ఎస్ఐలు, 550 మంది కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు.

చిన్నప్పుడే తల్లిని కోల్పోయి అనేక బాధలు భరిస్తూ.. తాను భవిష్యత్‌లో అవ్వాలనుకున్న పీటీ చదువును పూర్తి చేశాడు. ఇప్పుడు పోలీస్ ఉద్యోగాలకు ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు ఆశాకిరణంగా మారి.. ఎందరో జీవితాల్లో వెలుగులు నింపుతున్న దిల్‌సుఖ్‌నగర్‌లోని నందు ఆర్మీ అకాడమీ చైర్మన్ నందులాల్ నాయక్. ఒకవైపు పీటీగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే ఉదయం, సాయంత్రం సమయంలో పోలీస్ ఉద్యోగాలకు ప్రిపేరయ్యే విద్యార్థులకు గ్రౌండ్ శిక్షణ ఇస్తూనే, సేవా కార్యక్రమాలు చేస్తూ అందరీ మన్ననలు పొందుతున్నారు నందులాల్ నాయక్.

విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడమే మా లక్ష్యం



విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడానికి నందు ఆర్మీ అకాడమీ ఎల్లప్పుడూ ముందు ఉంటుంది. విద్యార్థులు ఆలోచనలను తన ఆలోచనగా మలుచుకొని ఎన్నో అద్భుతమైన రిజల్ట్ ఇస్తుంది. వందలాదిమంది నిరుద్యోగ యువతకు భరోసా కల్పిస్తూ, వారికి గ్రౌండ్ శిక్షణ ఇస్తూ, వారిని పోలీసు యూనిఫాంలో చూడాలనే లక్ష్యంతో అకాడమీ పనిచేస్తుంది. పోలీస్ ఉద్యోగం సాధించాలంటే గ్రౌండ్ శిక్షణ ఎంతో ముఖ్యం. చాలామంది యువత చదువులో ముందుండి, గ్రౌండ్ శిక్షణలో వెనుకబడి పోతున్నారు. వారి కోసమే ఈ అకాడమీ స్థాపించడం జరిగింది. భవిష్యత్‌లో తమ అకాడమీ నుండి ఎంతోమంది విద్యార్థులను ఉన్నత స్థానంలో చూడాలన్నదే తన ఆకాంక్ష. పేద విద్యార్థులకు ఎల్లప్పుడూ మా అకాడమీ ప్రోత్సాహం ఉంటుందన్నారు.

నాకు గ్రౌండ్ సౌకర్యం కల్పించి, అవకాశం కల్పించిన మిషన్ భగీరథ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, తలకొండపల్లి జడ్పీటీసి ఉప్పల వెంకటేష్ గుప్తాలకు ఎల్లప్పుడు రుణపడి ఉంటాను. నందు ఆర్మీ అకాడమీకి సహకారం అందించిన కాంగ్రెస్ పార్టీ ఆదివాసి కోఆర్డినేటర్ నేనావత్ కిషన్ నాయక్, పీసీసీ మెంబర్ జాల నరసింహ రెడ్డి వాలీబాల్ శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు. గ్రౌండ్ సౌకర్యం కల్పిస్తే.. మరింత మంది పేద విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తా..

చైర్మెన్ నందు లాల్ నాయక్



మల్ రెడ్డి రంగారెడ్డికి శుభాకాంక్షలు



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

ఈ ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా గెలుపొందిన మల్ రెడ్డి రంగారెడ్డిని పెద్ద అంబర్ పేట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి జైపాల్ రెడ్డి, నాయకులు మోడెపు శ్రీనివాస్ గౌడ్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం పలువురు పార్టీ కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యేగా మల్‌రెడ్డి గెలుపొందడం సంతోషంగా ఉందన్నారు. ప్రజా సంక్షేమ అభి వృద్ధి ప్రదాత, బడుగు, బలహీన వర్గాల ఆశాదీపం మల్ రెడ్డి రంగారెడ్డి అని కొనియాడారు.

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి ఘన సన్మానం



నవతెలంగాణ - చైతన్యపురి

మిర్యాల గూడెం నియోజకవర్గం నుండి నూతనంగా ఎన్నికైన శాసన సభ్యులు బత్తుల లక్ష్మా రెడ్డిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ మేరకు శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డిలు ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి, శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 9న సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా ఆరు గ్యారెంటీలలో రెండు గ్యారెంటీలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇచ్చిన హామీలను త్వరగా అమలు చేసి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపూర సైదులు, కళ్యాణ్, వంగాల శ్రీకాంత్ రెడ్డి, అక్బర్, రాజు నాయక్, సలీమ్, చంద్, సూరి, ప్రేమ్ నాయక్, ఇస్మాయిల్, భాస్కర్, రవి పాల్గొన్నారు.

'అలా ఆలోచించడం తప్పు, అన్న భార్య అంటే అమ్మతో సమానం నేను వదినను అలాంటి దృష్టితో చూడను' అనేవాడు. కానీ ఆమె మాత్రం ప్రదీప్‌ను రెచ్చగొడుతూ ఉండేది. పైగా 'నువ్వు నేను చెప్పినట్టు వినకపోతే ఊరికి పంపించేస్తాను' అని బెదిరించేది.

సరిదిద్దాల్సిన వారే తప్పు చేస్తే...



మంచైనా చెడైనా పిల్లలు పెద్దల నుండే నేర్చుకుంటారు. కాబట్టి ఇంట్లో పెద్దలు చాలా జాగ్రత్తగా మసలుకోవాలి. ఎప్పటికప్పుడు పిల్లల్లో మంచి మార్పు వచ్చేలా ప్రయత్నించాలి. పిల్లలు తప్పు దారిలో నడుస్తున్నారేమో చూసుకోవాలి. పొరపాటునా ఏదైనా తప్పు చేస్తే వారికి అర్థమయ్యేలా మంచీ చెడూ చెప్పాలి. ఆ బాధ్యత పెద్దవారిదే. సాధారణంగా ప్రతి ఇంట్లో జరిగేది ఇదే. అంతేకానీ పెద్దవాళ్ళే పిల్లలతో తప్పు చేయించే సందర్భాలు చాలా తక్కువ. కానీ అలాంటి పెద్దలు కూడా ఉంటారని, దాని వల్ల కలిగే పర్యావసానాలు ఎలా ఉంటాయో ఈ వారం ఐద్వా అదాలత్ చదివితే మీకే అర్థమవుతుంది.

ప్రదీప్ తన పెద్దమ్మ ఇంట్లో ఉంటున్నాడు. ఆ ఇంట్లో తన పెద్దమ్మ, అన్న, వదిన ఉంటారు. వాళ్ళ అన్నయ్య రాము ఎక్కువగా బిజినెస్ పని మీద వేరే నగరాలకు వెళుతుంటాడు. ఇక ఆ ఇంట్లో ఉండేది ఇద్దరు ఆడవాళ్ళు. ప్రదీప్ వాళ్ళకు సాయంగా ఉండేవాడు. షాపుకు వెళ్ళి సరుకులు తీసుకురావడం, ఏదైనా అవసరం అయితే వదినను, పెద్దమ్మను బండిపై బయటకు తీసుకు వెళ్ళడం చేసేవాడు. వుండేది పెద్దమ్మ వాళ్ళ ఇంట్లో అయినా సొంత ఇంట్లో మాదిరిగా ఉండే వాడు. ప్రదీప్ వాషిన్‌మిషన్‌లో బట్టలు వేసేవాడు. వాటిని ఆరబెట్టడంతో పాటు, అప్పుడప్పుడు వంట కూడా చేసే వాడు. అంతా బాగానే ఉంది కదా అనుకుంటున్న సమయంలో ఓ సమస్య వచ్చి పడింది. రాముకు పెండ్లయి ఐదేండ్లు అవుతున్నా పిల్లలు పుట్టలేదు. రాములోనే లోపం వుంది. ఆ విషయం తెలిసి కూడా వాళ్ళ పెద్దమ్మ రాముకు రమ్యను ఇచ్చి పెండ్లి చేసింది. పెండ్లప్పటి నుండి ఆ విషయం రమ్యకు చెప్పకుండా రాము బిజినెస్ పనంటూ ఎప్పుడూ బయటకు వెళుతుంటాడు. ఊళ్ళో ఉన్నా ఏదో ఒక పనుందంటూ ఎప్పుడూ బయటే ఉండేవాడు.

పెండ్లయి ఐదేండ్లు అవుతున్న పిల్లలు పుట్టలేదని ప్రదీప్ పెద్దమ్మ కొడలినే తిట్టేది. ఈ సారి రాము వచ్చిన తర్వాత ఎలాగొలా నచ్చజెప్పి ఆస్పత్రికి తీసుకువెళ్ళాలని అనుకుంది రమ్య. ప్రదీప్‌కి చెప్పి డాక్టర్ అపాయింట్‌మెంట్ తీసుకుంది. డాక్టర్ ఇద్దరికీ అన్ని రకాల పరీక్షలు చేసిన రాముకు అసలు పిల్లలు పుట్టే అవకాశం లేదని చెప్పారు. ఇదే విషయాన్ని ఇంటికి వచ్చిన తర్వాత రమ్య అత్తకు చెప్పింది. దాంతో ఆమె నలుగురికి విషయం తెలిస్తే కొడుకును చిన్న చూపు చూస్తారని బతిమలాడుకుంది. దానికి రాము 'నాకు ఈ లోపం వుందని తెలిసి కూడా దాచి చెప్పి రమ్య జీవితం నాశనం చేశాను. తనకు విడాకులు ఇచ్చి వేరే అబ్బాయితో పెండ్లి చేస్తాను' అన్నాడు. దానికి ఆమె ఒప్పుకోలేదు. గుడికి, బాబాల దగ్గరకు రమ్యను తీసుకుని తిరిగేది. కానీ రాము మాత్రం రమ్యతో 'విడాకులు తీసుకొని ఇంకో పెండ్లి చేసుకో' అనేవాడు. కానీ రమ్య మాత్రం విడాకులు ఇవ్వడానికి ఇష్టపడలేదు.

'నాకు పిల్లలు పుట్టకపోయినా పర్లేదు నేను మీతోనే ఉంటాను' అంది. ఇద్దరూ మంచిగా వున్నారు. కానీ రాము వాళ్ళ అమ్మ మాత్రం ఎలాగైనా కొడుకు, కోడలికి పిల్లలు పుట్టే విధంగా చేస్తే సమాజంలో తన పరువు నిలబడుతుం దనుకుంది. దీని గురించే ఆలోచిస్తున్న ఆమెకు ప్రదీప్ కనిపించాడు. ఎలాగైనా ప్రదీప్‌తో కొడలికి పిల్లలు పుట్టేలా చేయాలి అనుకుంది. రాము లేని సమయంలో రమ్యతో మాట్లాడమని, తనకు ఏమైనా కావాలంటే ఇవ్వమని చెప్పేది. కానీ రమ్య మరిదిని కొడుకుతో సమానంగా చూసుకునేది. ప్రదీప్‌కు కూడా వదినపై వేరే అభిప్రాయం ఉండేది కాదు. కానీ పెద్దమ్మ దానికి విరుద్ధంగా 'వదిన చాలా అందంగా వుంది, ఆమెను చూస్తే నీకు ఎలాంటి ఆలోచనలు రావడం లేదా' అంటూ ప్రదీప్‌తో అంటుండేది.

'అలా ఆలోచించడం తప్పు, అన్న భార్య అంటే అమ్మతో సమానం నేను వదినను అలాంటి దృష్టితో చూడను' అనేవాడు. కానీ ఆమె మాత్రం ప్రదీప్‌ను రెచ్చగొడుతూ ఉండేది. పైగా 'నువ్వు నేను చెప్పినట్టు వినకపోతే ఊరికి పంపించేస్తాను' అని బెదిరించేది. నగరంలో ఉండటానికి వేరే దారి లేని ప్రదీప్ 'వద్దు పెద్దమ్మ, నేను బాగా చదువుకుని ఉద్యోగం సంపాదించాలి నేను హైదరాబాద్‌లోనే ఉంటాను. నన్ను ఊరికి పంపించవద్దు' అంటూ బతిమలాడుకున్నాడు.

'అయితే నేను చెప్పినట్టే చెయ్యాలి' అని అతని దగ్గర మాట తీసుకుంది. కోడలికి పాలల్లో మందు మంది కలిపి నిద్రపోయిన తర్వాత ప్రదీప్‌ను ఆమె రూమ్‌లోకి పంపించేది. ఇలా మూడు రోజులు చేసిన తర్వాత అతనికి బాధగా అనిపించింది. తను చేసేది చాలా పెద్ద తప్పు అనిపించి ఐద్వా లీగల్‌సెల్‌కు వచ్చాడు.



'మా పెద్దమ్మ ఇంట్లో ఇలా జరుగుతుంది. బటయ ఉండి చదువుకునే ఆర్థిక స్థోమత నాకు లేదు. అందుకే అక్కడే ఉండాల్సి వస్తుంది' అని చెప్పాడు. 'అక్కడ ఉండడం నాకు ఇష్టం లేదు, మీరే నాకు ఏదైనా దారి చూపించండి. మా వదినకు ఇప్పుడు మూడో నెల. మా పెద్దమ్మ చాలా సంతోషంగా ఉంది. కానీ అన్నా, వదినల మధ్య గొడవలు జరుగుతున్నాయి'. 'నిన్ను వేరే వ్యక్తిని పెండ్లి చేసుకోమని చెప్పాను. దానికి నువ్వు ఒప్పుకోలేదు. కానీ ఇప్పుడు ఎవరితోనే సంబంధం పెట్టుకున్నావు, నువ్వు నాకు వద్దు' అంటున్నాడు. 'అసలు వదినకు తాను ఎలా గర్భవతి అయ్యిందో కూడా తెలియదు. మొత్తం తెలిసిన పెద్దమ్మ మాత్రం నోరు విప్పి మాట్లాడడం లేదు. ఎలా అయితే ఏమిటి కోడలు గర్భవతి అయ్యింది. నలుగురిలో పరువు నిలబడింది అనుకుంటుంది. నన్ను నమ్మిన మా వదినకు నేను చాలా అన్యాయం చేశాను. ఇప్పుడు ఆమె ముందుకు వెళ్ళలేకపోతున్నాను' అన్నాడు.

అతను చెప్పింది మొత్తం విన్న తర్వాత మేము అందరినీ పిలిచి మాట్లాడాము. 'నీ ఇష్టంతో సంబంధ లేకుండా నువ్వు తల్లివి అవుతున్నావు. మీ అత్తయ్య వల్లనే ఇలా జరిగింది. మీరు గర్భవతి కావడానికి కారణం ప్రదీప్. అతన్ని అలా చేయమని ప్రోత్సహించింది, బెదిరించింది మీ అత్తయ్య. కొడుక్కి ఎలాగో పిల్లలు పుట్టే అవకాశం లేదు కాబట్టి ఆమె ఇంత దారుణంగా ఆలోచించింది. నువ్వు వాళ్లపై కేసు పెట్టవచ్చు. వాళ్ళను జైలుకు పంపవచ్చు. మీకు తెలియకుండా, అభిప్రాయం లేకుండా ఇలా చేయడం చాలా పెద్ద తప్పు. కాబట్టి మీరు ఆలోచించి నిర్ణయం తీసుకోండి. మీరు రాముతో కలిసి వుండాలా లేదా, గుర్భం వుంచుకోవాలా వద్దా అనేది మీ ఇష్టం. మీరు ఏం చేయాలనకుం టున్నారో మీ ఇష్టం. నువ్వు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా దానికి మేము నీకు సపోర్ట్ చేస్తాం' అని చెప్పాం.

'ఇలాంటి వాళ్ళ మధ్య నేను ఉండను. ఎవరి స్వార్థం వాళ్ళు చూసుకున్నారు. నా భర్త కూడా నన్ను అనుమానించాడు. అందుకే నా కడుపులో ఉన్న బిడ్డను నేనే చూసుకుంటాను. వీళ్ళతో మాత్రం కలిసి బతకను. నా బతుకు నేను చూసుకుంటాను. నాకు ఎలాంటి సాయం కావాలన్నా మీ దగ్గరకు వస్తాను. నాకు అండగా నిలబడినందుకు మీకు ధన్యవాదాలు' అని చెప్పి రమ్య వెళ్ళిపోయింది.

'ఇలాంటి వాళ్ళ మధ్య నేను ఉండను. ఎవరి స్వార్థం వాళ్ళు చూసుకున్నారు. నా భర్త కూడా నన్ను అనుమానించాడు. అందుకే నా కడుపులో ఉన్న బిడ్డను నేనే చూసుకుంటాను. వీళ్ళతో మాత్రం కలిసి బతకను. నా బతుకు నేను చూసుకుంటాను. నాకు ఎలాంటి సాయం కావాలన్నా మీ దగ్గరకు వస్తాను. నాకు అండగా నిలబడినందుకు మీకు ధన్యవాదాలు' అని చెప్పి రమ్య వెళ్ళిపోయింది.

ఐద్వా అదాలత్ సెల్: 9490098024

- వై. వరలక్ష్మి, 9948794051



ఖర్చులు తగ్గించుకోవాలనుకుంటే..?

చిన్న చిన్న పద్ధతుల్లో డబ్బు ఆదా చేయాలని అనుకుంటుంటాం. కానీ ఎలా చేయాలో తెలియదు. ఇక్కడ కొన్ని టిప్స్, ట్రిక్స్ ఉన్నాయి.. చూడండి.

- తక్షణం అవసరం లేని వస్తువులని కొనకూడదు.
- అప్పు చేస్తే, తీర్చడానికే సరిపోతుంది, సేవ్ చేయడానికి ఏం మిగలదు.
- వారమంతా పక్కన పెట్టిన డబ్బులని వారాంతంలో బ్యాంక్‌లో వేసేయండి, ఆ ఎకౌంట్ నుండి అత్యవసరం అయితే తప్ప మనీ బయటకి తీయకూడదు అని రూల్ పెట్టుకోండి.
- అనుకోకుండా వచ్చిన బోనస్, అదనపు ఆదాయం లాంటి డబ్బులని ఎక్స్‌ట్రా ఎకౌంట్‌లో వేయండి.
- బయట తినడం తగ్గించి ఇంటి భోజనమే తీసుకోండి, ఆరోగ్యానికి ఆరోగ్యం, ఆదాకి ఆదా.
- బయటకి వెళ్ళినప్పుడు వాటర్ బాటిల్ కొనుక్కునే అలవాటు తగ్గించండి. మీతో పాటూ మంచినీరు తీసుకు వెళ్ళండి.
- అవసరం లేని వస్తువులని ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలో అమ్మేయండి.
- షాపింగ్ వెళ్ళినప్పుడు లిస్ట్ రాసుకుని, దాని ప్రకారమే కొనండి.
- వాడని సబ్‌స్క్రిప్షన్స్ ఉంటే, క్యాన్సిల్ చేయండి. కమోడిటీ యాప్స్‌ని అన్‌ఇన్‌స్టాల్ చేసేయండి.
- వీలున్నంత వరకూ క్యాష్ పేమెంట్ చేయండి. ఎన్ని డబ్బులు ఖర్చు అయ్యాయో మీకు తెలుస్తుంది.
- వారానికి ఒక రోజు "నో మనీ స్పెండింగ్ డే" అని పెట్టుకుని ఆ రోజున ప్రాణావసరమయితే తప్ప ఎలాంటి ఖర్చూ పెట్టకండి.
- అన్నింటికంటే ముందు రోజుకి ఎంత ఖర్చు అవుతోందో ఒక లెక్క వేసుకోండి.
- లైబ్రరీల్లో పుస్తకాలు తీసుకోండి.. మీకు మరీ నచ్చితే తప్ప కొనకండి.
- ఊరికే సేవింగ్ చేయాలనుకుని సేవ్ చేయడం కాకుండా, మీ, మీ పిల్లల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని సేవ్ చేయండి.
- ఏదైనా వస్తువు కొనే ముందు ఇంట్లో ఉన్నవి రీసైకిల్ చేయవచ్చేమో చూడండి.
- బాగా నచ్చిన వస్తువు కొనాలనిపిస్తే 24 గంటలు ఆగండి... ఆ తర్వాత కూడా ఆ వస్తువు ఇంకా నచ్చితే అప్పుడు కొనుక్కోండి.
- బయటకి వెళ్ళినప్పుడు ఒక కాఫీ తాగితే, ఇంటికొచ్చాక ఆ కాఫీకి అయిన ఖర్చు ఒక ఎకౌంట్‌లో వేయండి.
- వారానికి సరిపడా మీల్ ప్లాన్ చేసుకుని ఆ ప్రకారం వస్తువులు తెచ్చుకుంటే ఒక ఐడియా ఉంటుంది, అనవసరమైన ఖర్చు ఉండదు.
- పాడయిపోని వస్తువులని బల్క్‌లో తెచ్చుకోండి, కొంచెం డబ్బులు కలిసి వస్తాయి.
- బేసిక్ టైలరింగ్ నేర్చుకుంటే తెలియని ఖర్చు తగ్గుతుంది.
- వీలున్నంత వరకూ గిఫ్ట్స్ ఇంట్లో తయారు చేయవచ్చేమో చూడండి.. లేదు కొనాలి అంటే ముందే కొనండి, లాస్ట్ మినిట్ షాపింగ్‌లో ఎప్పుడూ ఎక్కువ డబ్బు ఖర్చవుతుంది.

రోజుకో మంత్రి..ఎమ్మెల్యే...

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో దర్బార్‌కు ఎలాంటి ఆటంకాలు లేకుండా, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అది సజావుగా కొనసాగేలా చూడాలంటూ వారిని ఆయన ఆదేశించారు. వినతుల స్వీకరణ, సమస్యల పరిష్కారానికి ఎక్కువ సమయం తీసుకోకుండా, సులభంగా ఉండేందుకు వీలుగా రోజుకో మంత్రి, ఎమ్మెల్యే దర్బార్‌లో ఉండేలా నిర్ణయించాలని ఆయన భావిస్తున్నట్టు తెలిసింది. దీంతోపాటు జిల్లాల వారీగా దరఖాస్తుదారులను, వారి అర్జీలను విడగొట్టి.. ఒక్కో జిల్లాకు ఒక్కో ప్రత్యేక అధికారిని నియమించేందుకు ఆయన కసరత్తు చేయాలంటూ ఉన్నతాధికారులకు సూచించారు. తద్వారా త్వరితగతిన దరఖాస్తులు పరిష్కరమయ్యేలా చూడాలంటూ ఆదేశించారు.

మహిళలే టార్గెట్‌గా..సైకో కిల్లర్ హత్యలు



(మొదటిపేజీ తరువాయి)

పరిశీలించగా.. సర్వాబీ అదృశ్యమైన రోజు ధారూర్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన మాల కిష్టప్ప (45) అనే వ్యక్తి వెంట వెళ్లినట్టు గుర్తించారు. ఈ ఆధారాలతో తట్టేపల్లి అడవిలో నిందితుడు కిష్టప్పను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతన్ని విచారించగా సర్వాబీని హత్యచేసినట్టు నేరం అంగీకరించాడు. తాండూరు పట్టణంలోని అడ్డా వద్ద సర్వాబీకి ఓ గ్రామంలో పని ఉందని చెప్పి ఆమెను జహీరాబాద్ వైపు వెళ్లే బస్సులో కిష్టప్ప తీసుకెళ్లాడు. తట్టేపల్లి అడవి ప్రాంతానికి తీసుకెళ్లి ఆమె చీర కొంగుతోనే హత్య చేసి ఆమె వద్ద ఉన్న చైన్లు, మొబైల్ ఫోన్, రూ.1000 నగదును తీసుకుని స్వగ్రామానికి వెళ్లిపోయాడు.

అడ్డా మహిళా కూలీలే టార్గెట్

మహిళలను హత్య చేస్తూ సైకోయిజం ప్రదర్శిస్తున్నట్టుగా పోలీసులు అనుమానాలను వ్యక్తం చేశారు. గతంలో వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు హత్యలు, యాలాల, ధారూర్, తాండూరు పోలీస్‌స్టేషన్లలో ఆరు హత్య కేసులు నమోదయ్యాయి. ఇందులో 5 హత్య కేసుల్లో ఎలాంటి ఆధారాలు లేకుండా హత్యలు చేయడంతో వాటిని కొట్టివేసినట్టుగా పోలీసులు వెల్లడించారు. కేవలం చిల్లర ఖర్చుల కోసమే.. మహిళలను హత్య చేసి.. వారి వద్ద ఉన్న నగదు, వస్తువులను అపహరిస్తున్నట్టు విచారణలో తేలింది. గత హత్య కేసుల్లో నిందితుడు 2021 నుంచి 2023 వరకు రెండేండ్ల పాటు జైల్లో ఉన్నాడు. రెండు నెలల క్రితమే బయటకు వచ్చిన కిష్టప్ప ఒక సైకోలా మారి హత్యలకు పాల్పడుతున్నాడు. హంతకుడు కిష్టప్ప ఆధారాల్లేకుండా ఇంకా ఎన్నో హత్యలు చేసి ఉండొచ్చని పోలీసు అధికారులు భావిస్తున్నారు.

పక్కా ఆధారాలతో రిమాండ్

ఇదివరకు చేసిన ఆరు హత్యల్లో ఎలాంటి ఆధారాలు లేనప్పటికీ ఈ 7వ హత్య కేసులో పక్కా ఆధారాలను సేకరించారు. హంతకుడు మృతురాలిని వెంట తీసుకెళుతున్నట్టు సీసీ ఫుటేజీలతో పాటు హత్య చేసిన ప్రాంతాల వివరాలను అతని ద్వారానే పక్కాగా నమోదు చేశారు. ఈ ఆధారాలతో కోర్టులో నిందితుడిని హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద మృతురాలి సెల్‌ఫోన్, చైన్‌తో పాటు రూ.1000ల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నిందితుడు కిష్టప్పకు శిక్ష పడే విధంగా అన్ని ఆధారాలను సేకరించినట్టు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో తాండూరు పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేవంత్‌కు ఖాళీ గల్లా

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి–హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికల్లో భారీ విజయం సాధించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సర్కారును ప్రభుత్వ ఖజానా వెక్కిరిస్తున్నది. గద్దెదిగిన బీఆర్‌ఎస్, కొత్తగా ఎన్నికైన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఖాళీ గల్లాను అందించింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ. 3.05 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని ఆర్థికశాఖ అధికారులు చెబుతున్నారు. కాగా తాజాగా ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు పోటాపోటీగా మ్యానిఫెస్టోలు ప్రకట ించాయి. హామీల మీద హామీలు గుప్పించాయి. అయితే అనూహ్యంగా అధికారపగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆర్థికపరమైన అంశాల్లో చుక్కలు కనిపించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రధానంగా పోలింగ్‌కు ముందు ఎన్నికల కమిషన్ రైతుబంధును నిలిపేసిన సంగతి తెలిసిందే. ఫలితాల తర్వాత పదిరోజుల్లో రైతుబంధు నిధులను నేరుగా ఖాతాల్లో వేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి సైతం ప్రకటించారు. అయితే ప్రస్తుతం ఆర్థికశాఖ వ్యవహారాలు ఏమాత్రం అందుకు అనుకూలంగా లేవనే వార్తలు వస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం సర్కారీ ఖజానా ఖాళీ అయిందనే ప్రచారం సచివాలయంలో జరుగుతున్నది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఏడాదికి రెండు విడతలుగా రైతుబంధు నిధులు విడుదలయ్యేవి.

ప్రతి ఆరునెలలకు 70 లక్షల మంది రైతులకు రూ.7500 కోట్ల చొప్పున ఏడాదిలో రెండుసార్లు పెట్టుబడిసొ మ్ము కింద రూ. 15,000 కోట్లు ప్రభుత్వం ఇచ్చేది. వానాకాలం, ఎండాకాలం సీజన్లల్లో రైతులకు ఆయా పంటల సాగు కోసం పెట్టుబడి కింద ఈ సొమ్మును అందజేసేవారు. గత కేసీఆర్ సర్కారు రైతులకు మాత్రమే ఈ సొమ్ము ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, కౌలు రైతులు, రైతు కూలీలకు సైతం రైతుబంధును వర్తింపజేస్తామని ఎన్నికల ముందు హామీఇచ్చింది. అయితే కాంగ్రెస్ సర్కారు 10 నుంచి 15 ఎకరాల్లోపు ఉన్న రైతులకు మాత్రమే రైతుబంధును వర్తింపజేసే ఆలోచనలో ఉన్నట్టు తెలిసింది. స్లాబును తగ్గించడం ద్వారా ఏడాదికి అయ్యే ఖర్చులో నుంచి సుమారు రూ. 7000 కోట్లు మిగిలే అవకాశం ఉన్నట్టు అధికారులు అంటున్నారు. వీటిని ఇతర పథకాలను సర్దుబాటు చేయడానికి వీలుంటుందనే భావనలో వారున్నారు. అయితే దీనిపై అధికారికంగా ఇంకా కసరత్తు జరగాల్సి ఉంది. దీంతో పథకం అమలు ఆలస్యమయ్యే పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి.

మంత్రివర్గ విస్తరణ తర్వాత రైతుబంధుపై దృష్టిపెట్టే అవకాశముంది. మొత్తం ప్రక్రియ అంతా పూర్తిచేసి నిధులు విడుదలయ్యే నాటికి జనవరి రెండో వారం దాటనుందని తెలిసింది. నిధుల సమీకరణపై ఆర్థిక శాఖ అధికారులు చర్చోపచర్చలు చేస్తున్నారు.

ఆస్పత్రిలో మాజీ సీఎం కేసీఆర్

(మొదటిపేజీ తరువాయి)

మాజీ మంత్రి హరీశ్ రావు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులున్నారు. ఆయనకు ఎక్స్ రే, స్కానింగ్ తదితర పరీక్షలు చేసిన వైద్యులు ఎడమ కాలు తుంటి ఎముక విరిగినట్టు నిర్ధారించారు. దాన్ని రిప్లేస్ చేయడానికి శస్త్రచికిత్స అవసరమని తెలిపారు. తను కోలుకునేందుకు ఆరు నుంచి ఎనిమిది వారాల సమయం పడుతుందని చెప్పారు. ఈ మేరకు యశోద ఆస్పత్రి బులెటిన్ విడుదల చేసింది. కేసీఆర్ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు ప్రకటించారు. శుక్రవారం సాయంత్రం ఆయనకు శస్త్రచికిత్స చేశారు..

కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై సీఎం రేవంత్ రెడ్డి ఆరా తీశారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు అప్ డేట్ అందించాలని వైద్యారోగ్యశాఖ కార్యదర్శిని ఆదేశించారు. దీంతో ఆస్పత్రికి వెళ్లిన రిజ్వీ కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు.

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని నేతలు, అభిమానులు, కార్యకర్తలు ఆందోళన చెందొద్దని కోరారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు కె.జానారెడ్డి, ఆయన కుమారుడు, నాగార్జున సాగర్ నియోజకవర్గ శాసనసభ్యులు జయవీర్ రెడ్డి పరామర్శించిన వారిలో ఉన్నారు. మాజీ ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ, ఇన్ఫెక్షన్ సోకే ప్రమాదం ఉన్నందున కార్యకర్తలు ఎవరూ ఆస్పత్రి వద్దకు రావద్దని సూచించారు. కేసీఆర్ ఆరోగ్యం కోసం ఇంటి వద్దనే ఉండి ప్రార్థనలు చేయాలని కోరారు. కేసీఆర్ కు గాయమైన సంగతి తెలిసి బాధపడ్డట్టు జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పూర్తి ఆరోగ్యంతో కోలుకుని ప్రజలకు, సమాజానికి సేవలందిస్తారని ఆకాంక్షించారు. ఏపీ మాజీ సీఎం చంద్రబాబునాయుడు, రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై తదితర ప్రముఖులు కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీమంత్రి కేటీఆర్ కు ఫోన్ చేసి అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పోటెత్తిన అభిమానులు, కార్యకర్తలు

యశోద ఆస్పత్రి కేసీఆర్ అభిమానులు, కార్యకర్తలతో నిండిపోయింది. మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ మంత్రులు జగదీష్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, ఇంద్రకరణ్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావుబీ గంగుల కమలాకర్, వేముల ప్రశాంత్ రెడ్డి సహా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ చైర్మెన్లు, ప్రజాప్రతినిధులు కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు.

మెగా డీఎస్సీ ప్రకటన ఎప్పుడు?

(మొదటిపేజీ తరువాయి)

మంత్రులు ప్రమాణస్వీకారం చేశారు. అదేరోజు మొదటి క్యాబినెట్ సమావేశాన్ని నిర్వహించారు. అయితే డీఎస్సీ గురించి ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో మెగా డీఎస్సీ ఎప్పుడు ప్రకటిస్తారనే దానికోసం ఉపాధ్యాయ అభ్యర్థులు లక్షలాది మంది ఎదురుచూస్తున్నారు. మంత్రులకు ఇంకా శాఖలు కేటాయించలేదు. విద్యామంత్రి రాగానే ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, డీఎస్సీ రాతపరీక్షల తేదీలపై స్పష్టత వచ్చే అవకాశమున్నది. అయితే ఉపాధ్యాయ పోస్టుల భర్తీ జిల్లా నియామక కమిటీ (డీఎస్సీ)కి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారి ఆరా తీసినట్టు తెలిసింది. ఉపాధ్యాయ పోస్టుల వివరాలను ఆమె సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. దీంతో నిరుద్యోగ యువతలో మరింత ఆసక్తి పెరిగింది. రాష్ట్రంలో 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లాస్థాయి నియామక కమిటీ (డీఎస్సీ) నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ సెప్టెంబర్ ఆరో తేదీన విడుదల చేసిన విషయం తెలిసిందే. 2,575 సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ) పోస్టులకు 66,376 మంది, 611 లాంగ్వేజ్ పండితులు (ఎల్పీ) పోస్టులకు 12,339 మంది, 164 ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ) పోస్టులకు 6,856 మంది, 1,739 స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) పోస్టులకు 91,931 మంది కలిపి మొత్తం 5,089 ఉపాధ్యాయ పోస్టులకు 1,77,502 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నవంబర్ 20 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో జరిగే రాతపరీక్షలను విద్యాశాఖ వాయిదా వేసింది. వాటి నిర్వహణ తేదీలు ఇంకా ఖరారు కాలేదు. కాంగ్రెస్ హామీనిచ్చినట్టుగా మెగా డీఎస్సీ ప్రకటిస్తుందనీ, ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య పెరుగుతుందని నిరుద్యోగులు ఆశిస్తున్నారు. విద్యాశాఖ మంత్రి వచ్చిన తర్వాతే ఈ అంశాలపై స్పష్టత వచ్చే అవకాశముందని తెలుస్తున్నది.

పోస్టులను పెంచి డీఎస్సీ నోటిఫికేషన్ తిరిగి ఇవ్వాలి : డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం

కాంగ్రెస్ హామీ ఇచ్చినట్టుగానే ఉపాధ్యాయ పోస్టుల సంఖ్యను పెంచి డీఎస్సీ నోటిఫికేషన్‌ను తిరిగి ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం అధ్యక్షులు రావుల రామ్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు కేవలం 5,089 ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి అభ్యర్థులకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ ప్రకటిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఆ హామీని నిలబెట్టుకోవాలని కోరారు.

81 వేల కోట్ల అప్పు ఎందుకైంది?

(మొదటిపేజీ తరువాయి)

తయారు చేయాలనీ, దీనిలో ఏఏ సంస్థల నుంచి ఏ రూపంలో నిధులు వచ్చాయి? వాటిని ఎలా ఖర్చు చేశారు? దారి మళ్లించిన నిధులు ఎన్ని? వాటిని ఎవరి ఆదేశాల మేరకు మళ్లించారు? మళ్లింపు నిధుల్ని ఎక్కడ ఎలా వినియోగించారు? విద్యుత్ సంస్థల అప్పులు పెరగడానికి కారణాలు ఏంటి? రాష్ట్ర ప్రభుత్వం ఆ శాఖకు ఇచ్చిన నిధులు ఎన్ని? అనే అంశాలన్నీ ఆ నివేదికలో ఉండాలని స్పష్టంగా చెప్పినట్టు తెలిసింది. దీనిపై మరోసారి పూర్తిస్థాయి సమీక్ష చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు చెప్పారు.

ప్రభాకరరావు దుమ్మా

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్షా సమావేశానికి టీఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకరరావు హాజరుకాలేదు. ఈనెల 3వ తేదీ ఎన్నికల ఫలితాలు వెలువడగానే 4న ఆయన తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అయితే గురువారం జరిగిన తొలి మంత్రివర్గ సమావేశంలో ప్రభాకరరావును పిలిపించాలని ప్రత్యేకంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఆయన రాజీనామాను ఆమోదించవద్దని ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సునీల్‌శర్మకు చెప్పారు. అయితే ఉత్తర ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎన్పీడీసీఎల్) సీఎమ్‌డీ ఏ గోపాలరావు గురువారం తన పదవికి రాజీనామా చేశారు. దాన్ని ఆమోదించకపోవడంతో శుక్రవారం జరిగిన సమీక్షకు హాజరయ్యారు.

సమాచారం లేదు

సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన విద్యుత్‌శాఖ సమీక్షా సమావేశానికి హాజరుకావాలని సచివాలయం నుంచి కానీ, విద్యుత్ శాఖ నుంచి కానీ తనకు ఎలాంటి సమాచారం లేదని టీఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన పేరుమీద ఓ పత్రికా ప్రకటన సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. తనను ఆహ్వానిస్తే మీటింగ్‌కు తప్పకుండా వెళ్లేవాడిననీ, ముఖ్యమంత్రి పిలిస్తే ఎందుకు వెళ్లనంటూ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ ఎల్పీ నేతగా కేసీఆరే..

- ఎస్సీ, ఎస్టీ తరగతుల నుంచి ఉప నేతలు
- కడియం శ్రీహరికి ఛాన్స్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) శాసనసభాపక్ష నేతగా ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆరే ఎన్నిక కానున్నారు. శనివారం ఉదయం 9 గంటలకు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించే ఆ పార్టీ శాసనసభాపక్ష సమావేశంలో ఆయన్ను ఎమ్మెల్యేలు తమ నేతగా ఎన్నుకోనున్నారు. ఉప నేతలుగా దళిత, బీసీ తరగతులకు చెందిన వారిని కేసీఆర్ ఎంపిక చేసినట్టు సమాచారం. వీరిలో ఎస్సీల నుంచి సీనియర్ నేత, స్టేషన్ ఘన్‌పూర్ నుంచి గెలిచిన కడియం శ్రీహరికి అవకాశం దక్కనుంది. బీసీల నుంచి మరో నేతను ఎన్నుకోనున్నట్టు సమాచారం. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుల్లో ఎవరో ఒకరు ఎల్పీ నేత అయ్యే అవకాశముందనే వార్తలు వచ్చినా... చివరకు తానే ఉండాలని కేసీఆర్ నిర్ణయించుకున్నట్టు బీఆర్‌ఎస్ వర్గాలు తెలిపాయి.

మణిపూర్ విద్యార్థులు సహాయం కోసం సంప్రదించండి

- లీగల్ సర్వీసెస్ అథారిటీ

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

అల్లర్ల నేపథ్యంలో తెలంగాణలో ఉన్నమణిపూర్ విద్యార్థులు అవసరమైన సహాయం కోసం తమను సంప్రదించాలని తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సుప్రీంకోర్టు నియమించిన జస్టిస్ గీతా మిట్టల్ కమిటీ సూచనల అమలులో భాగంగా సహకారాన్ని అందించనున్నట్టు తెలిపారు. మణిపూర్ అవతల భద్రత, విద్య, నివాసం తదితర అవసరాల కోసం ఇబ్బంది పడుతున్న ఆ రాష్ట్రానికి చెందిన విద్యార్థులు 94406 21436లో సంప్రదించాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పునరావాస శిబిరాల్లో ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని కమిటీ ఈ సూచన చేసింది.

మహువా మెయిత్రాపై బహిష్కరణ వేటు

లోక్‌సభలో తీర్మానం ఆమోదం • మహువాకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వని స్పీకర్

ప్రతిపక్షాల వాకౌట్
గాంధీ విగ్రహం వద్ద నిరసన







నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

డబ్బులు తీసుకుని ప్రశ్నలు అడిగారనే (క్యాష్ ఫర్ క్వారీ) ఆరోపణలను ఎదుర్కొంటున్న టీఎంసీ ఎంపీ మహువా మెయిత్రాపై బహిష్కరణ వేటు పడింది. లోక్‌సభ నైతిక విలువల కమిటీ ఇచ్చిన నివేదికను పరిగణనలోకి తీసుకోవాలన్న తీర్మానాన్ని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి లోక్‌సభ ముందుకు శుక్రవారం తెచ్చారు. ఆమెను లోక్‌సభ నుంచి బహిష్కరించాలంటూ 500 పేజీల నివేదకను ఎథిక్స్ కమిటీ సిఫారసు చేసింది. దీనిపై చర్చ జరిపిన అనంతరం ఓటింగ్ నిర్వహించారు.

నివేదికను లోక్‌సభ ఆమోదించడంతో ఆమెను లోక్‌సభ నుంచి బహిష్కరిస్తున్నట్టు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ 'ఎంపీ మహువా మెయిత్రా ప్రవర్తన అనైతికంగా, ఎంపీగా అసభ్యకరంగా ఉందని కమిటీ చేసిన తీర్మానాలను ఈ సభ అంగీకరించింది. కాబట్టి, ఆమె ఎంపీగా కొనసాగడం సరికాదు' అన్నారు. నివేదికపై చర్చ సందర్భంగా.. మాట్లాడేందుకు మహువా మెయిత్రీకి అవకాశం ఇవ్వాలని స్పీకర్‌కు కాంగ్రెస్ నేతలు అధీర్ రంజన్ చౌదరి, మనీష్ తివారీ తదితరులు విజ్ఞప్తి చేశారు. స్పీకర్ అందుకు నిరాకరించారు. దీంతో ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. అనంతరం పార్లమెంట్ ముఖద్వారం వద్ద నిరసన తెలిపి, అక్కడ నుంచి మహాత్మా గాంధీ విగ్రహం వద్దకు ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు.

ఇది మీ పతనానికి నాంది: మెయిత్రా

లోక్‌సభ నుంచి తనను బహిష్కరించడంపై మహువా మెయిత్రా పార్లమెంటు వెలుపల నిప్పులు చెరిగారు. సభలో చెప్పాలను కున్నదంతా పార్లమెంట్ ఆవర ణంలో మీడియాకు మెయిత్రా వివరిం చారు. తనను బహిష్కరించే హక్కు ఎథిక్స్ కమిటీకి లేదని అన్నారు. ఇది మీ (బీజేపీ) ముగింపునకు ఆరంభమంటూ ఘాటుగా విమర్శించారు. 'దుర్గా మాత వచ్చింది.

ఇక చూసుకుందాం. వినాశనం సంభవించినప్పుడు మొదట కనుమరుగయ్యేది వివేకమే, వస్త్రాపహరణను వాళ్ల మొదలుపెట్టారు. ఇక మహాభారత యుద్ధాన్ని చూస్తారు' అంటూ బీజేపీ సర్కార్‌పై ఘాటు విమర్శలు చేశారు. 'నాకు 49 సంవత్సరాలు, నేను వచ్చే 30 సంవత్సరాలు పార్లమెంటు లోపల, వెలుపల మీతో పోరాడతాను' అని అన్నారు.

'ఈ కేసులో ఎటువంటి ఆధారాలు లేకుండా ఎథిక్స్ కమిటీ నన్ను బహిష్కరిం చాలని నిర్ణయించింది. ఎక్కడా నగదు, లేదా బహుమతులకు సంబంధించిన ఆధారాలు లేవు. పార్లమెంటరీ లాగిన్ షేరింగ్‌ను నియంత్రించడానికి ఎటు వంటి నియమాలు లేవు' అని అన్నారు. ఎథిక్స్ కమిటీ ప్రతి నిబంధనను ఉల్లంఘించిందని, తమను అణగదొక్కేందుకు ఈ కమిటీని ఓ ఆయుధంగా ఉపయోగిస్తున్నారని విమర్శించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం ఇద్దరు వ్యక్తులు చెప్పిన మాటలను నమ్మి తనను దోషిగా నిర్ధారించారని విమర్శించారు. రేపు మా ఇంటికి సీబీఐని పంపి నన్ను వేధిస్తారేమోనని మండిపడ్డారు.

టీఎంసీ లోక్‌సభ నేత సుదీప్ బంద్యోపాధ్యాయ మాట్లాడుతూ మహువా మెయిత్రాకు న్యాయం నిరాకరించబడిందని అన్నారు. కాంగ్రెస్ ఎంపీ అధీర్ రంజన్ చౌదరి మాట్లాడుతూ 'ఇది నిరాధారమైన వాస్తవాల ఆధారంగా, ప్రతీకార భావనతో జరిగింది' అని విమర్శించారు.

లోక్‌సభలో ప్రతిపక్షాల ఆందోళన... సభ వాయిదాల పర్వం

తొలిత ఉదయం 11 గంటలకు ప్రారంభమైన లోక్‌సభలో టీఎంసీ ఎంపీ మహువా మెయిత్రాపై ఎథిక్స్ కమిటీ రూపొందించిన రిపోర్టుపై చర్చ జరగాలని ప్రతిపక్షాలు ఆందోళన చేశాయి. ప్రతిపక్ష సభ్యుల నినాదాలతో సభ హెూరెత్తింది. దీంతో సభ ప్రారంభమైన నాలుగు నిమిషాలకే మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో అదే పరిస్థితి నెలకొంది. దీంతో సభ ప్రారంభమైన ఏడు నిమిషాలకే మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళనల మధ్యే 500 పేజీలతో కూడిన నివేదికను బీజేపీ ఎంపీ, ఎథిక్స్ కమిటీ చైర్మెన్ విజయ్ సోన్కర్ ప్రవేశపెట్టారు. ఎథిక్స్ కమిటీ నివేదిక కాపీ తమకు ఇవ్వాలని, ఓటింగ్‌కు ముందు చర్చ జరుపాలనీ, టీఎంసీ ఎంపీ మెయిత్రీ తన వాదన వినిపించేందుకు అవకాశం ఇవ్వాలని స్పీకర్‌ను ప్రతిపక్ష ఎంపీలు కోరారు. అయితే అందుకు స్పీకర్ ఓం బిర్లా నిరాకరించారు. 2005లో స్పీకర్ సోమనాథ్ ఛటర్జీ తీసుకున్న నిర్ణయాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. డబ్బులు తీసుకుని ప్రశ్నలు అడిగారనే ఆరోపణలను ఎదుర్కొన్న 10 మంది ఎంపీలకు సభలో మాట్లాడేందుకు అప్పటి స్పీకర్ సోమ్‌నాథ్ ఛటర్జీ అనుమతి నిరాకరించారని అన్నారు. నాటి స్పీకర్లు పాటించిన సంప్రదాయాన్నే తాను అనుసరిస్తున్నట్టు ఓం బిర్లా చెప్పారు. అయితే చర్చ సందర్భంగా వివిధ పార్టీల నేతలు ఆమెపై బహిష్కరణ వేటు వేయడాన్ని తప్పు పట్టారు. చర్చ ముగిసిన తరువాత ఓటింగ్‌కు స్పీకర్ ఓం బిర్లా ప్రయత్నించారు. స్పీకర్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మహువా మెయిత్రాకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు సభను వాకౌట్ చేశారు.



ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజం
ప్రజా తీర్పును గౌరవిస్తాం

- పార్టీకి ద్రోహం చేసిన వారిని క్షమించేది లేదు
- ప్రజా సమస్యలపైన పోరాడేది ఎర్రజెండానే : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ- కూసుమంచి

ఎన్నికల్లో గెలుపోటములు సహజమేనని, ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండల కేంద్రంలోని పద్మారెడ్డి భవనంలో శుక్రవారం జరిగిన పార్టీ మండల స్థాయి జనరల్ బాడీ సమావేశంలో తమ్మినేని పాల్గొని ప్రసంగించారు. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పును గౌరవిస్తామని తెలిపారు. సీపీఐ(ఎం) నిరంతరం ప్రజల పక్షాన ఉంటుందని, ఏ పార్టీ గెలిచినా ప్రజల కష్టాలేమీ పోవని, ప్రజా సమస్యలు ఉన్నంతకాలం వాటి పరిష్కారం కోసం పార్టీ నిరంతరం ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు నిర్వహిస్తుందని స్పష్టంచేశారు. గెలుపునకు పొంగేది లేదు.. ఓటమికి కృంగిపోయేది లేదని తెలిపారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అభినందించారు. గడిచిన తొమ్మిదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరించిం దన్నారు. అందుకే ఈసారి కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అవకాశం ఇచ్చారని, ఈ అవకాశాన్ని ఉపయోగిం చుకొని ప్రజలకు మంచి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పాలేరు నియోజకవర్గంలో డబ్బు ప్రభావం కొనసాగిందని, ఒక్కొక్క ఓటుకి మూడు నుంచి నాలుగు వేల రూపాయలు ఇచ్చి ఓట్లను కొనుగోలు చేశారని, ఈ ధన ప్రవాహం ప్రజాస్వామ్యానికి హానికరమన్నారు. అక్కడక్కడ పార్టీకి ద్రోహం చేసిన వ్యక్తులను క్షమించేది లేదని తెలిపారు. పార్టీ కోసం నిరంతరం శ్రమించిన వ్యక్తులకు, ఆయా గ్రామశాఖలకు ధన్యవాదాలు తెలిపారు.

మల్లెల సన్మతరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ పాలేరు డివిజన్ ఇన్‌చార్జి బండి రమేష్, మండల ఇన్‌చార్జి బుగ్గవీటి సరళ, మండల కార్యదర్శి యడవల్లి రమణారెడ్డి, తోటకూరి రాజు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు ఎర్రబోయిన భారతి, జోన్ కన్వీనర్లు, మండల కమిటీ సభ్యులు, గ్రామ శాఖ కార్యదర్శులు, సీనియర్ నాయకులు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.



కమ్మేసిన పొగమంచు


నవతెలంగాణ-మోర్తాడ్/రెంజల్

నిజామాబాద్ జిల్లాలోని పలు గ్రామాల్లో పొగమంచు కమ్మేసింది. చలికాలం ప్రారంభం కావడం.. అలాగే మిచౌంగ్ తుఫాను ప్రభావంతో గ్రామాలు పూర్తిగా పొగమంచుతో కమ్ముకున్నాయి. శుక్రవారం ఉదయం నిజామాబాద్ జిల్లా కేంద్రంతో పాటు, మోర్తాడ్, రెంజల్ మండలంలోని పలు గ్రామాల్లో పొగ మంచు కమ్ముకుంది. ఉదయం ఏడున్నర కావస్తున్నప్పటికీ పొగ మంచు తొలగకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించని పరిస్థితి. దాంతో వాహనదారులు తమ వాహనాల లైట్లు వేసుకుని ప్రయాణం కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్వల్ప దూరంలోనే ఉన్న ప్రజలు ఎవరూ కూడా కనిపించకుండా భారీ పొగ మంచు ఏర్పడటంతో ప్రజలు బయటకు రావడానికి సైతం ఇబ్బందులకు గురయ్యారు.

తాటి చెట్టుపై నుంచి పడి గీతకార్మికుడు మృతి

నవతెలంగాణ - వీణవంక

ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు ప్రాణం కోల్పోయారు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉయ్యాల చందర్(42) శుక్రవారం ఉదయం కల్లు తీయడానికి చెట్టు ఎక్కి దిగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన చందర్ అక్కడికక్కడే మృతిచెందాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న వీణవంక ఎస్ఐ ఆసిఫ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.





ఇప్పుడైనా సమస్యలు పరిష్కరిస్తారా..!

- కొత్త ప్రభుత్వంపై ఆర్టిజన్ ఉద్యోగుల ఆశలు
- చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు
- స్టాండింగ్ ఆర్డర్ రద్దుకు డిమాండ్

నవతెలంగాణ -కల్వకుర్తి

ఆర్టిజన్ ఉద్యోగులు కొత్త ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇప్పుడైనా తమ సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయా అని ఎదురు చూస్తున్నారు. 2017లో రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న దాదాపు 23, 660 మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తున్నట్టు సీఎం ప్రకటించారు. అయితే ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనం ఇవ్వకుండా స్టాండింగ్ ఆర్డర్ పేరుతో ప్రత్యేక సర్వీసు రూల్స్ ఏర్పాటు చేశారు. దీంతో విద్యుత్ శాఖలో క్షేత్ర స్థాయిలో కీలకంగా ప్రధాన పాత్ర పోషిస్తున్న ఆర్టిజన్ కార్మికులు చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే పలువురు ఆర్టిజన్ ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ ఆత్మహత్య చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వారి సమస్యలు పరిష్కరిస్తామని గతంలో ఆ పార్టీ ముఖ్య నాయకులు హామీ ఇచ్చారు. విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న ఆర్టిజన్ ఉద్యోగులకు ఉన్న స్టాండింగ్ ఆర్డర్స్‌ను రద్దు చేసి ఏపీఎస్ఈబి రూల్స్ వర్తింపజేయాలనే డిమాండ్ కొంతకాలంగా కార్మికుల నుంచి వస్తుంది. గతంలో ఉద్యోగులు సంస్థ యాజమాన్యానికి సమ్మె నోటీసు సైతం ఇచ్చి సమ్మెలోకి వెళ్లగా సీఎం కేసీఆర్ మొండి వైఖరి అవలంబించి ఉద్యోగ సంఘాలను బెదిరించి సమ్మె విరమింపజేసిన విషయం తెలిసిందే. దీంతో విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులు అందరూ ఈ అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచారని తెలుస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో ఆర్టిజన్ కార్మికుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే ఆశతో ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులతో చర్చించి న్యాయం చేయాలని కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందలు తెలిపిన కాంగ్రెస్ శాసనసభ పక్ష కార్యాలయ కార్యదర్శి పి. శ్రీకాంత్.



తుఫానుతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

వరంగల్ కలెక్టరేట్ ఎదుట ఏఐకేఎంఎస్ ధర్నా

నవతెలంగాణ-వరంగల్

మూడు రోజులుగా వచ్చిన మిచౌంగ్ తుఫాన్, ప్రభావంతో పడిన వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులను ఆర్థికంగా ఆదు కోవాలని, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతూ శుక్రవారం అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మొగిలి ప్రతాపరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు రాచర్ల బాలరాజు మాట్లాడుతూ.. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల తుఫానుతో రైతులు, కౌలు రైతులు భారీగా నష్టపోయారన్నారు.

జిల్లాలోని మెజారిటీ మండలాల్లో 1.50 లక్షల ఎకరాల్లో వరిపంటను రైతులు నష్టపోయారని, దాదాపు 40 వేల ఎకరాల్లో పత్తి, పసుపు, మిర్చి పంటలు, కూరగాయల తోటలు నష్టపోయారని తెలిపారు. గత మార్చి, ఏప్రిల్ నెలలో రైతులు భారీగా పంట నష్టపోగా, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఆర్థిక సాయం అందించడంలో పక్షపాత వైఖరి అవలంబించిందని విమర్శించారు. అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు, వారికి అనుకూలమైన వారికి మాత్రమే పంట నష్టపరిహారం ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు కొత్త ప్రభుత్వంలో అలా జరగకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం ఏవో శ్రీకాంత్‌కి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్న అప్పారావు, రైతులు భాషపాక అశోక్, ఇనుముల కృష్ణ, గంధ్రతి హరి బాబు, ఎండీ అక్బర్, అమర్, సుద్దాల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులకు బెదిరింపులు

ఎమ్మెల్యే ఫోన్ నెంబర్ నుంచి కాల్స్

- మైనంపల్లిని ఓడిస్తారా అంటూ.. పోలీస్ స్టేషన్లలో కేసు నమోదు
- రాచకొండ సీపీకి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఫిర్యాదు



నవతెలంగాణ-సిటీబ్యూరో

మల్కాజిగిరి బీఆర్ఎస్ నేతలను బెదిరింపు కాల్స్ కలవర పెడుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఫోన్ నెంబర్‌తో ఆగంతకులు బెదిరింపు కాల్స్ చేస్తున్నారు. తమ ఎమ్మెల్యే నెంబర్‌తో ఈ రకమైన కాల్స్ రావడంతో బీఆర్ఎస్ నాయకులు ఆశ్చర్య పోయారు. మల్కాజిగిరిలోని బీఆర్ఎస్ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, కార్పొరేటర్ల భర్తలు, మరికొందరు బీఆర్ఎస్ నాయకులకు రెండు, మూడ్రోజులుగా ఫోన్ కాల్స్ వస్తున్నాయి. 'మా అన్న మైనంపల్లినే ఓడిస్తారా.. మీ అంతు చూస్తాం. ఖబడ్దార్ బిడ్డా.. వారం రోజుల్లో మర్డరైపోతరు' అంటూ బెదిరింపులకు పాల్పడు తున్నారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఫోన్ నెంబర్‌తో కాల్స్ వస్తుండటంతో బాధి తులు ఆందోళన చెం దుతున్నారు. ఈ విష యమై వారు మల్కా జిగిరి, నేరేడ్ మెట్, అల్వాల్ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. గౌతంనగర్ కార్పొరేటర్ భర్త రాముయాదవ్, నేరేడ్‌మెట్ డివిజన్ కార్పొరేటర్ భర్త ఉపేందర్‌రెడ్డి, జవహర్‌నగర్ కార్పొరేటర్ మురుగేష్, మల్కాజిగిరి మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, మౌలాలి మాజీ కార్పొరేటర్ భర్త అమీనుద్దీన్, అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి చెందిన మరికొంతమంది అనుచరులకు బెదిరింపు ఫోన్ కాల్స్ వచ్చినట్టు ఫిర్యాదు చేశారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఓటమిపాలు కావడంతో ఆయన అనుచరులే ఇలా బెదిరింపులకు పాల్పడుతున్నట్టు బీఆర్ఎస్ నాయకులు అనుమానిస్తున్నారు. మైనంపల్లి అనుచరులు టెక్నాలజీని ఉపయోగించి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఫోన్ నెంబర్‌తో ఇలా బెదిరింపులకు దిగుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం రాచకొండ సీపీ చౌహాన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.

పది మందికి బెదిరింపు కాల్స్

దాదాపు 10 మందికి బెదిరింపు కాల్స్ వచ్చాయి. ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లకు బెదిరింపు కాల్స్ రావడం హేయమైన చర్య. పోలీసులు తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇది చాలా సీరియస్ కేసు. స్పూఫింగ్ కూడా ఇండియాలో బ్యాన్ ఉంది. ఆన్‌లైన్ యాప్ ద్వారా కాల్స్ చేసినట్టు బాధితులు చెబుతున్నారు.

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

కలెక్టరేట్ ఎదుట డిగ్రీ విద్యార్థినుల ధర్నా

- ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్
- ప్రిన్సిపాల్ సస్పెండ్‌తో ఆందోళన విరమణ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రిన్సిపాల్ ఎస్.దివ్యరాణిని సస్పెండ్ చేయాలంటూ కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లా బూరుగూడ గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులు శుక్రవారం రోడ్డెక్కారు. కళాశాల నుంచి విద్యార్థినులు కలెక్టరేట్ వరకు ర్యాలీగా చేరుకొని ధర్నా చేశారు. ప్రిన్సిపాల్ దివ్యరాణి తమను మానసికంగా వేధిస్తున్నారని, ఆమెను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కళాశాలకు వచ్చే ఆహార పదార్థాలను బయటకు తీసుకెళ్తున్నారని, ఉన్నతాధికారులు వచ్చినప్పుడు తమకు కనీసం కలిసే అవకాశం కూడా ఇవ్వడం లేదని అన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే బాత్రూమ్‌ల వద్ద నిలబెట్టడం, చెప్పుల వద్ద కూర్చోబెట్టి.. అన్నం తినమనడం లాంటివి చేస్తున్నారని ఏడుస్తూ చెప్పారు. నాణ్యమైన వస్తువులు తమకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ బాధను ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదని, అందుకే ధర్నా చేస్తున్నట్టు వివరించారు. విద్యార్థినులకు డీఆర్ఓ సురేష్, డిటిడిఓ రమాదేవి, డిఎస్‌పి వెంకటరమణ, పిటిజి ప్రిన్సిపాల్ సురేష్ నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ వారు వినిపించుకోలేదు. దీంతో గిరిజన శాఖ అసిస్టెంట్ కమిషనర్ సోమనాథ్ శర్మతో పిటిజి ప్రిన్సిపాల్ సురేష్ ఫోన్‌లో మాట్లాడి విద్యార్థినులతో మాట్లాడించారు. ఐదుగురు విద్యార్థినుల బృందాన్ని అధికారులు కలెక్టర్ బోర్కడే హేమంత్ వద్దకు తీసుకెళ్లారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి సమస్యలు వివరించారు. అప్పటికే అసిస్టెంట్ కమిషనర్ సోమనాథ్ శర్మ ప్రిన్సిపాల్ దివ్యరాణిని సస్పెండ్ చేసినట్టు తెలియజేశారు. వారు బయటకు వచ్చి విద్యార్థినులతో జరిగిన విషయాన్ని చెప్పడంతో శాంతించారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

జాప్యం దేనికి?

- సరైన స్పందనను తెలియజేయండి
- పూణే ఉప ఎన్నిక నిర్వహణపై
- ఈసీకి బాంబే హైకోర్టు ఆదేశాలు



న్యూఢిల్లీ : మహారాష్ట్రలోని పూణే లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నికపై బాంబే హైకోర్టు స్పందించింది. ఈ ఉప ఎన్నికలో ఆలస్యంపై సరైన స్పందన తెలియజేయాలని ఎన్నికల సంఘాన్ని (ఈసీ) బాంబే హైకోర్టు కోరింది. ఎనిమిది నెలలుగా ఉప ఎన్నిక ఎందుకు నిర్వహించలేదని బాంబే హైకోర్టు ద్విసభ్య డివిజన్ బెంచ్.. ఈసీని ప్రశ్నించింది. న్యాయమూర్తులు గౌతమ్ ఎస్. పటేల్, కమల్ ఆర్. ఖాటాతో కూడిన ధర్మాసనం ఉప ఎన్నికలో గెలిచిన వ్యక్తికి పదవీ కాలం తక్కువ సమయమే ఉంటుందనీ, 2024 సాధారణ ఎన్నికల సన్నాహాలను ఈ పోల్ ప్రభావితం చేస్తుందన్న ఈసీ హేతుబద్ధతతో ప్రాథమికంగా విభేదిస్తున్నట్టు వెల్లడించింది. ఈసీ నుంచి సంతృప్తికరమైన స్పందన రాకపోతే సోమవారం (డిసెంబర్ 11) కోర్టు ఉత్తర్వులు జారీ చేస్తుందని వారు తెలిపారు. ఈ నియోజకవర్గానికి ఉప ఎన్నిక నిర్వహించకూడదని ఈసీ జారీ చేసిన ఆదేశాలను సవాలు చేస్తూ సుఘోష్ జోషి దాఖలు చేసిన పిటిషన్‌ను ధర్మాసనం విచారిస్తున్నది. పూణే స్థానానికి.. సిట్టింగ్ ఎంపీ, బీజేపీ నాయకుడు గిరీష్ బాపట్ మార్చిలో మరణించటంతో.. ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. అయితే, దేశవ్యాప్తంగా ఇటీవల ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరిగి ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఎన్నికలతో పాటే పూణే ఎన్నిక జరుగుతుందని భావించినప్పటికీ అలా జరగకపోవటం గమనార్హం.

వారి వివరాలివ్వండి

- 'ఈశాన్యం'లో పత్రాలు లేని వలసదారుల సమాచారమివ్వండి :అసోం పౌరసత్వ కేసులో కేంద్రానికి సుప్రీం ఆదేశాలు



న్యూఢిల్లీ : ఈశాన్య రాష్ట్రాల్లో అక్రమ వలసలపై సుప్రీంకోర్టు స్పందించింది. మార్చి 24, 1971 తర్వాత ఈశాన్య రాష్ట్రాలకు అక్రమంగా వచ్చిన వలసదారుల వివరాలు అందించాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఈ సమస్యను పరిష్కరించడానికి పరిపాలనా స్థాయిలో తీసుకున్న చర్యల గురించి, ప్రత్యేకించి అసోం గురించి తెలియజేయాలని సుప్రీంకోర్టు చెప్పింది. అసోం రాష్ట్రానికి పార్లమెంటు ఆమోదంతో పౌరసత్వ చట్టం 1955లో చొప్పించబడిన సెక్షన్ 6ఏకు వ్యతిరేకంగా, మద్దతుగా దాఖలైన పిటిషన్‌ల సమూహాన్ని విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు నుంచి ఈ ఆదేశాలు వచ్చాయి.


పత్రాలు లేకుండా రాష్ట్రంలోకి ప్రవేశించిన వలసదారుల విషయంలో చట్టంలోని సెక్షన్ 6ఏను.. 1985లో రాష్ట్రంలోని విదేశీయుల వ్యతిరేక ఆందోళన నాయకులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఈ సమస్యను పరిష్కరించడానికి ఒప్పంద పత్రానికి అనుగుణంగా పార్లమెంటు ఆమోదించింది. ఇది అసోం ఒప్పందంగా ప్రసిద్ధి చెందింది. జనవరి 1, 1966 వరకు అసోంలో ప్రవేశించిన విదేశీ వలసదారులు భారతీయ పౌరులుగా మారడానికి ఇది అనుమతిస్తుంది. ఆ తేదీ తర్వాత మార్చి 24, 1971 వరకు ప్రవేశించిన వారిని కూడా వారు నమోదు చేసుకున్నట్టయితే, వారి ఓటు హక్కును పౌరసత్వం కోసం పరిగణించాలనే నిబంధనను జోడించారు. అయితే, పార్లమెంటు ఆమోదించిన ఈ వివాదాస్పద సెక్షన్‌కు అనేక పిటిషన్‌లు మద్దతుగా ఉండగా, మరికొందరు దేశం మొత్తానికి ఉమ్మడి పౌరసత్వ నియమం ఉండాలనీ, అలాంటి వలసదారులను అసోంలో పౌరులుగా, ఓటర్లుగా మార్చడానికి అనుమతించటాన్ని వ్యతిరేకిస్తున్నారు.

విదేశాల్లో మరణించిన విద్యార్థులు 403 మంది



- కెనడాలో అత్యధికంగా 91 మంది
- ఐదేండ్లకు సంబంధించిన సమాచారాన్ని వెల్లడించిన కేంద్రం

న్యూఢిల్లీ : విదేశాల్లో భారత విద్యార్థుల మరణాలపై కేంద్రం సమాచారం వెల్లడించింది. 2018 నుంచి విదేశాల్లో మొత్తం 403 మంది భారతీయ విద్యార్థులు మరణించారు. ఇందులో కెనడాలో అత్యధికంగా 91 మంది మరణించారు. సహజ కారణాలు, ప్రమాదాలు, వైద్య పరిస్థితులతో సహా వివిధ కారణాల వల్ల మరణాలు సంభవించాయని భారత విదేశాంగ శాఖ సహాయ మంత్రి వి మురళీధరన్ రాజ్యసభకు లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో తెలియజేశారు. 2018 నుంచి విదేశాల్లో మరణించిన ఉన్నత విద్యా సంస్థల్లో చదువుతున్న భారతీయ విద్యార్థుల మరణాలపై సమాచారాన్ని అందించాలని కోరుతూ తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) ఎంపీ మౌసం బెనజీర్ నూర్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా మంత్రి ఈ ప్రకటన చేశారు. విదేశాల్లో చదువుతున్న భారతీయ విద్యార్థుల భద్రత, శ్రేయస్సును నిర్ధారించడానికి భారత ప్రభుత్వం ఏదైనా చర్యలు అమలు చేసిందా అని కూడా ఆమె అడిగారు. 34 దేశాలలో కెనడా విదేశాలలో అత్యధిక సంఖ్యలో భారతీయ విద్యార్థుల మరణాలకు కారణమవుతున్నదని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.



తర్వాత స్థానంలో ఉన్న యూకేలో గత ఆరేండ్లలో 48 మంది విద్యార్థుల మరణాలను చూసింది. తర్వాతి స్థానాల్లో రష్యా (40 మంది), అమెరికా (36) ఆస్ట్రేలియా(35), ఉక్రెయిన్(21), జర్మనీ(20), సైప్రస్(14), ఇటలీ(10), ఫిలిప్పీన్స్ (10) దేశాలు ఉన్నాయి. కెనడాలో అత్యధిక విద్యార్థుల మరణాలపై విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి అరిందమ్ బాగ్చి స్పందించారు. ఇతర దేశాలతో పోల్చినప్పుడు కెనడాకు వెళ్లే విద్యార్థుల సంఖ్య కూడా ఎక్కువేనని తెలిపారు.

దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

- ప్రజాదర్బార్ లో వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని దళిత క్రైస్తవుల ఎస్సీ రిజర్వేషన్ సాధన సమితి (డీసీఎస్సీఆర్ఎస్ఎస్) కోరింది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి సమితి నాయకులు వినతిపత్రాన్ని సమర్పించారు. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలను అవలంభిస్తున్న ఎస్సీలను ఎస్సీలుగా గుర్తించారని, క్రైస్తవులను మాత్రమే బీసీ-సీలుగా పరిగణిస్తున్నారని పేర్కొన్నారు. వీరిని కూడా ఎస్సీ జాబితాలో చేర్చేందుకు అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం సమర్పించిన వారి ఆ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నాగళ్ల పోచయ్య ఇశ్రాయేల్, ప్రధాన కార్యదర్శి బిషప్ ఎం.సామ్యేల్, కార్యవర్గ సభ్యులు ఎం.వీరయ్య జాన్సన్, నాయకులు జైపాల్ తదితరులున్నారు.

అక్రమాలు వెలుగులోకి రావడం హర్షణీయం

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



గత ప్రభుత్వం చేసిన అక్రమాలెన్నో తాజాగా వెలుగులోకి రావడం హర్షణీయమని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత ప్రభుత్వ పాలన సమైక్యాంధ్ర పాలన కంటే అధ్వాన్నంగా సాగిందన్నారు. రాష్ట్ర అప్పు ఆరు లక్షల కోట్లకు దాటిందని తెలిపారు. మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మాణంలో సాంకేతిక, నిర్మాణ లోపాలు ఉన్నట్టు కేంద్ర జలశక్తి శాఖనే చెప్పిందని వివరించారు. ఆ ప్రాజెక్టుకు అనుమతి కూడా లేదనీ, లక్షా 20 వేల కోట్ల ఆర్థిక భారం పడిందని చెప్పారు. ఈ ప్రాజెక్టు విషయంలో అన్ని రకాలుగా కేసీఆర్ బాధ్యుడని ఆరోపించారు. ఆ ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ అనుమతి కూడా లేదని కేంద్రం చెబుతున్నదని గుర్తు చేశారు. మేడిగడ్డ ప్రాజెక్టు అక్రమాలపై ప్రభుత్వం న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై వాస్తవాలను ప్రభుత్వం వెలికి తీయడంపై హర్షం వ్యక్తం చేశారు. వాస్తవాలను ప్రజలకు తెలియ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. మహారాష్ట్రతో ఒప్పందం ఉన్నందున తుమ్మిడి హట్టి దగ్గర బ్యారేజ్ నిర్మాణం చేయాలని కోరారు. అక్కడ బ్యారేజ్‌ని నిర్మించాలని చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణాన్ని సోనియా గాంధీ పుట్టిన రోజు నుంచి అమలుకు నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు.

బీజేపీ ఎల్పీ నేతెవరో?



- రేసులో రాజాసింగ్, మహేశ్వర్‌రెడ్డి
- అనూహ్యంగా వెంకటరమణారెడ్డి పేరూ తెరపైకి
- నేడు ఎమ్మెల్యేలతో బీజేపీ అధ్యక్షులు కిషన్‌రెడ్డి భేటీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీఎల్పీ నేత ఎవరనే దానిపై ఉత్కంఠ నెలకొంది. ఆ పదవి కోసం పార్టీలో ప్రధానంగా ఇద్దరు రేసులో ఉన్నారు. రాజాసింగ్, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. కామారెడ్డిలో సీఎం కేసీఆర్(ప్రస్తుతం మాజీను, టీపీసీసీ అధ్యక్షులు, ప్రస్తుత సీఎం ఎ.రేవంత్‌రెడ్డిని ఓడించి మరీ అసెంబ్లీలో అడుగుపెట్టబోతున్న వెంకటరమణారెడ్డి పేరు కూడా అనూహ్యంగా తెరపైకి వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి ఎనిమిది మంది (గోషామహల్- రాజాసింగ్, సిర్పూర్-డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు, ఆదిలాబాద్-పాయల్ శంకర్, నిర్మల్-ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ముథోల్-రామారావు పవార్, ఆర్మూర్ పాడి రాకేశ్‌రెడ్డి, కామారెడ్డి-కె.వెంకటరమణారెడ్డి, నిజామాబాద్ అర్బన్-ధన్‌పాల్ సూర్యానారాయణ గుప్తా) ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. వీరిలో సీనియర్ ఎమ్మెల్యే రాజాసింగ్. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్కడే గెలిచారు. అయితే, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డితో సఖ్యత లేకపోవడం, తెలుగులో అనర్గళంగా మాట్లాకపోవడం ఆయనకు ప్రతిబంధంగా మారింది. బీజేపీ అధిష్టానం కూడా ఇదే కోణంలో ఆలోచిస్తున్నది. ఒకవేళ రాజాసింగ్ కాకపోతే రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేరు వినిపిస్తున్నది. ఈయన గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉండేవారు. రేవంత్‌రెడ్డిని పీసీసీ అధ్యక్షులుగా చేయడాన్ని విభేదిస్తూ ఆ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

సీఎంగా రేవంత్‌రెడ్డి ఎన్నికైన నేపథ్యంలో మహేశ్వర్‌రెడ్డిని బీజేపీ ఎల్పీ నేతగా నియమిస్తే తన వాణిని మరింత బలంగా వినిపించే అవకాశముంటుందనే ఆలోచనలో బీజేపీ ఉంది. అయితే, కాంగ్రెస్ గూటికి ఆయన తిరిగి వెళ్తాడనే చర్చ మొదలైన క్రమంలో ఆయనకు ఆ పదవి ఇచ్చి పార్టీలో ఉండేలా చూడాలనే చర్చా నడుస్తున్నది. కామారెడ్డిలో అనూహ్యంగా కేసీఆర్, రేవంత్‌రెడ్డిని ఓడగొట్టి చర్చనీయాంశమైన కె.వెంకట రమణారెడ్డిని నియమిస్తే ఎలా ఉంటుందనే ఆలోచననూ బీజేపీ నాయకత్వం చేస్తున్నది.ఈ క్రమంలోనే ఎమ్మెల్యేలుగా గెలిచిన ఎనిమిది మందితో శనివారం ఉదయం ఏడున్నర గంటలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రత్యేకంగా భేటీ కానున్నారు.

ఆ సమావేశంలోనే బీజేపీ ఎల్పీ నేతను ఖరారు చేయనున్నట్టు తెలిసింది. ఆ సమావేశం అనంతరం ఎమ్మెల్యేలతో కలిసి కిషన్‌రెడ్డి చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో పూజలు చేయనున్నారు.

ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్ ఓవైసీని నియమించిన నేపథ్యంలో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్టు రాజాసింగ్ ప్రకటించిన విషయం విదితమే.

వికలాంగులకు ఫ్రీ బస్ సౌకర్యం కల్పించాలి : వాసుదేవరెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఫ్రీ బస్ సౌకర్యం మహిళలతో పాటు వికలాంగులకు కూడా వర్తింపజేయాలని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మెన్ , బీఆర్ఎస్ నేత డాక్టర్ కెతిరెడ్డి వాసుదేవ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీనివల్ల ప్రభుత్వంపై పెద్ద భారం కూడా పడదని పేర్కొన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలలో భాగంగా మహిళలకు ఫ్రీ బస్ సౌకర్యం అమలు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి శుభాకాంక్షలు : వైఎస్ షర్మిల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వానికి వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షులు వైఎస్ షర్మిలారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదేండ్ల నియంత పాలనను నిలువునా పాతిపెట్టిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలిచ్చిన తీర్పు చారిత్రాత్మకమని పేర్కొన్నారు.

ఇప్పుడు ఏర్పాటు చేసిన ప్రజా ప్రభుత్వం మరొక్క మహత్తర ఘట్టమని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సుపరిపాలన అందించాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ సర్కారుకు ఎల్లవేళలా సహకారం, మద్దతు ఉంటుందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రులకు, కాంగ్రెస్ నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు.

దేశంలో 111 మంది మహిళా న్యాయమూర్తులు

- మూడు హైకోర్టుల్లో ఒక్క మహిళా న్యాయమూర్తి లేరు
- ఏడు హైకోర్టుల్లో కేవలం ఒక్కొక్కరే
- సుప్రీం కోర్టులో ముగ్గురు మాత్రమే




న్యూఢిల్లీ : దేశంలో సుప్రీం కోర్టు, 26 హైకోర్టుల్లో 790 మంది న్యాయమూర్తుల్లో కేవలం 111 మంది మహిళా న్యాయమూర్తులు ఉన్నారు. అయితే మూడు హైకోర్టుల్లో ఒక్క మహిళా న్యాయమూర్తి కూడా లేరు. అలాగే ఏడు హైకోర్టుల్లో ఒక్కో మహిళా న్యాయమూర్తి మాత్రమే ఉన్నారు. ఈ మేరకు రాజ్యసభలో సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ అడిగిన ప్రశ్నకు కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చింది. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టులో 34 మంది న్యాయమూర్తులుండగా, అందులో కేవలం ముగ్గురే మహిళా న్యాయమూర్తులు ఉన్నారు. ఉత్తరాఖండ్, త్రిపుర, మేఘాలయ హైకోర్టుల్లో ఒక్క మహిళా న్యాయమూర్తి కూడా లేరు. ఛత్తీస్‌గఢ్, హిమాచల్‌ప్రదేశ్, జార?ండ్, మణిపూర్, ఒరిస్సా, పాట్నా, సిక్కిం హైకోర్టుల్లో ఒక్కరు చొప్పున మహిళ న్యాయమూర్తులు ఉన్నారు. జమ్మూ కాశ్మీర్, మధ్యప్రదేశ్ హైకోర్టుల్లో మహిళా న్యాయమూర్తులు ఇద్దరు చొప్పున ఉన్నారు. రాజస్థాన్ (3), గౌహతి (4), ఆంధ్రప్రదేశ్ (5), కేరళ (5), అలహాబాద్ (6), కర్ణాటక (7), తెలంగాణ (7), కలకత్తా (8), గుజరాత్ (8), ఢిల్లీ (9) మంది మహిళా న్యాయమూర్తులు ఉన్నారు. అత్యధికంగా పంజాబ్, హర్యానా హైకోర్టులో 15 మంది మహిళా న్యాయమూర్తులు ఉన్నారు. తరువాత మద్రాస్ హైకోర్టుల్లో 12 మంది, ముంబాయి హైకోర్టులో 11 మంది మహిళా న్యాయమూర్తులు ఉన్నారు.

మిజోరంలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం

ముఖ్యమంత్రిగా లాల్‌దుహోమా ప్రమాణ స్వీకారం

గెలిచిన మూడు రాష్ట్రాల్లోనూ ముఖ్యమంత్రుల ఎంపికే పూర్తి చేయని బిజెపి



ఐజ్వాల్ : మిజోరం నూతన ముఖ్యమంత్రిగా జోరామ్ పీపుల్స్ మూవ్‌మెంట్ (జెడ్‌పిఎం) నాయకులు లాల్‌దుహోమా శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ కంభంపాటి హరిబాబు లాల్‌దుహోమా చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో 11 మంది జెడ్‌పిఎం ఎమ్మెల్యేలు కూడా మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మాజీ ముఖ్యమంత్రి, మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్) నాయకులు జోరంతంగా కూడా హాజరయ్యారు. ఎంఎన్ఎఫ్ శాసనసభా పక్షనేత లాల్ చందమా రాల్టేతోసహా ఆ పార్టీ ఎమ్మెల్యేలంతా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మరో మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నాయకులు లాల్ థన్హావ్లా కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఇటీవల మిజోరంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 40 స్థానాలకు గాను జెడ్‌పిఎం 27 స్థానాల్లో విజయం సాధించింది. ఈ నెల 5న జరిగిన సమావేశంలో లెజిస్లేచర్ పార్టీ నాయకుడిగా లాల్‌దుహోమాను, ఉప నాయకుడిగా కె.సప్దంగను ఎన్నుకున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 8 స్థానాలు గెలుచుకున్న జెడ్‌పిఎం తాజా ఎన్నికల్లో 27 స్థానాలు సాధించింది. ఎంఎన్ఎఫ్ 10 స్థానాల్లో విజయం సాధించింది.

ఇటీవల మిజోరంతో సహా ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగాయి. మిజోరంలో జెడ్‌పిఎం, తెలంగాణలో కాంగ్రెస్ విజయం సాధించగా, ఈ రెండు రాష్ట్రాల్లోనూ కొత్త ప్రభుత్వాలు కొలువుతీరాయి. బిజెపి విజయం సాధించిన మిగతా మూడు రాష్ట్రాలు ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్,

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏండ్లు జైలు

విజయనగరం : పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్లు జైలు శిక్ష విధిస్తూ ప్రత్యేక పోక్సో న్యాయస్థానం కోర్టు శుక్రవారం తీర్పు వెల్లడించింది. విజయనగరం జిల్లా గుర్ల మండలం గరికివలసకు చెందిన గుమ్మిడి ఆదినారాయణ ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో దిశ మహిళా పోలీసు స్టేషనులో 2023 ఫిబ్రవరిలో పోక్సో చట్టం ప్రకారం దిశ ఎస్ఐ ఎన్.పద్మావతి కేసు నమోదు చేశారు.

డిఎస్‌పి ఎం.వెంకటేశ్వర్లు దర్యాప్తు చేపట్టారు. అనంతరం నిందితుడిని అరెస్టు చేసి న్యాయ స్థానంలో అభియోగ పత్రం దాఖలు చేశారు.

నేరం రుజువు కావడంతో నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి కె.నాగమణి తీర్పు చెప్పారు.

పోక్సో కేసులో త్వరితగతిన నిందితుడికి శిక్ష పడే విధంగా వ్యవహరించిన దర్యాప్తు అధికారులు, ప్రాసిక్యూషన్ అధికారులను జిల్లా ఎస్పీ ఎం.దీపిక అభినందించారు.

నూతన ప్రభుత్వానికి డీవైఎఫ్ఐ అభినందనలు

- యువత ఆకాంక్షలకనుగుణంగా నియామకాలు చేపట్టాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలో నూతన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ అభినందనలు తెలిపింది. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులు, యువత ఆకాంక్షలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల్లో ప్రకటించిన మాదిరిగా రెండు లక్షల ఉద్యోగాల భర్తీకి అతిత్వరలోనే చర్యలు చేపట్టాలని కోరారు. ఎన్నికల ముందు వాయిదా పడిన గ్రూప్-2, డీఎస్సీ పోటీపరీక్షలను సత్వరమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. నోటిఫికేషన్లు ప్రకటించి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. విద్యావైద్యం, ఉపాధి కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధికి పాటుపడాలని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యబద్ధ పాలనకు కృషి చేయాలని సూచించారు. నిరుద్యోగులకు అన్యాయం జరిగితే ఉద్యమాలను చేపడతామని స్పష్టం చేశారు.

ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు పెద్ద పీట

- సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు : వైద్య ప్రవీణ్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రజాప్రభుత్వంలో ప్రజలకు పెద్ద పీట వేయబడుతున్నదని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వైద్య ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం శుభపరిణామం అన్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజల హృదయాలు గెలుచుకున్న నాయకుడని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలను తప్పకుండా నెరవేరస్తుందన్నారు. ఆయన వెంట కె. రాము, నర్సింహా నాయక్ శ్రీకాంత్, దొంతుల రంజిత్, రవి కుమార్, సందీప్ తదితరులు ఉన్నారు.

కేసీఆర్ సేవలు తెలంగాణకు అవసరం

- ఆరు హామీల అమలు కోసం పోరాడుతాం : మురళీధర్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



కేసీఆర్ సేవలు భవిష్యత్ తెలంగాణకు అవసరమనీ, ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నామని బీజేపీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్‌రావు చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వేగంగా కోలుకుని కేసీఆర్ క్రియాశీల రాజకీయాల్లోకి వస్తారని ఆకాంక్షించారు. బీజేపీ గెలవదన్న మూడు రాష్ట్రాల్లోనూ గెలిచి చూపించామన్నారు. మధ్యప్రదేశ్‌లో ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో తాము ఓడిపోతామని అందరూ చెప్పారనీ, కానీ..గతం కంటే అత్యధిక ఓట్లు, సీట్లతో గెలిచామని తెలిపారు. తెలంగాణలో మరోసారి కాంగ్రెస్ పార్టీ గెలవబోదన్నారు. బీఆర్ఎస్‌పై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను క్యాష్ చేసుకోలేకపోయామని చెప్పారు. అయితే, తెలంగాణలో బీజేపీకి పెరిగిన సీట్లు, ఓట్లు మంచిపరిణామమన్నారు. వందరోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామన్న కాంగ్రెస్ మాట నిలబెట్టుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆ హామీల అమలు కోసం బీజేపీగా కొట్లాడుతామని చెప్పారు. రాష్ట్రం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉందన్నారు. ప్రగతి భవన్ గ్రిల్స్ పగులగొట్టడం మంచిదేనని తన అభిప్రాయాన్ని వ్యక్తపర్చారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర తర్వాత బీజేపీ మూడు రాష్ట్రాలలో గెలిచిందన్నారు. ఈ ఎన్నికల తర్వాత ఇండియా కూటమి ముందుకెళ్తుందా? అనే అనుమానం మొదలైందని చెప్పారు. దేశంలోని గిరిజనులు, దళితులు, మహిళలు, యువకులు, రైతాంగం బీజేపీ, మోడీ పాలన కావాలని కోరుకుంటున్నారన్నారు. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో సీఎం ఎన్నిక కోసం పరిశీలకులను జాతీయ నాయకత్వం నియమించిందని చెప్పారు. రెండు, మూడు రోజుల్లో సీఎంల నియామకం పూర్తవుతుందని తెలిపారు.

నర్సింగ్ ఆఫీసర్ పరీక్షా ఫలితాలను విడుదల చేయాలి



- పోస్టులను భర్తీ చేయాలి: కోదండరాంకు నర్సింగ్ ఆఫీసర్స్ వినతి

నవతెలంగామ బ్యూరో - హైదరాబాద్

నర్సింగ్ ఆఫీసర్ పరీక్షా ఫలితాలను విడుదల చేయాలనీ, 5,204 ఖాళీలను భర్తీ చేయాలని రిజిస్టర్ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఆర్ఎన్ఓఏ), నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఎన్ఓఏ) కోరాయి. ఈ మేరకు ప్రభుత్వానికి విన్నవించాలని టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్‌ను ఆర్ఎన్ఓఏ అధ్యక్షురాలు సుజాత రాథోడ్, నర్సింగ్ ఆఫీసర్ రామలక్ష్మి, ఎన్ఓఏ వ్యవస్థాపకులు లక్ష్మణ్ రుధావత్, నర్సింగ్ ఆఫీసర్ సోమేశ్ కలిసి విజ్ఞప్తి చేశారు. 317 జీవో ద్వారా సమస్యలను పరిష్కరించాలని కోరారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో పనిచేస్తున్న వారికి ట్రెజరీ ద్వారా జీతాలు, హెల్త్ కార్డులు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. పదోన్నతులు కల్పించాలనీ, సాధారణ బదిలీలు చేపట్టాలన్నారు. నర్సింగ్ కాలేజీల్లో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. నర్సింగ్ డైరెక్టరేట్ నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కోదండరాం మాట్లాడుతూ త్వరలోనే ఉద్యోగ సంఘాల సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ల

సమస్యలన్నింటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 62,950	▲	170
22 క్యారెట్లు	- 57,700	▲	150
కిలో వెండి	- 80,000	-	---

చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 71
రిటైల్ (లైవ్)	రూ. 93
స్కిన్‌తో	రూ. 135
స్కిన్‌లెస్	రూ. 153

తెగని సీఎం కుర్చీ రగడ





ఇంకా కొనసాగుతూనే ఉన్న 'కమలం' గందరగోళం

- మొన్న 60 మంది ఎమ్మెల్యేలతో బలప్రదర్శన
- ఇప్పుడు ఢిల్లీ దర్బార్ ముందుకు వసుంధర

జైపూర్ : రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించినా.. ముఖ్యమంత్రి పదవి విషయంలో ఇంకా గందరగోళం కొనసాగుతూనే ఉంది. జైపూర్ నుంచి ఢిల్లీ వరకు చర్చోపచర్చలు , సమావేశాలు జరుగుతున్నా సీఎం కుర్చీ రగడ మాత్రం చల్లారటం లేదు. ఎన్నికల ఫలితాలొచ్చి వారం రోజులైనా.. బీజేపీ హైకమాండ్ నాన్చుతూనే ఉన్నది. మరోవైపు వసుంధర రాజే సీఎం పదవి కోసం శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. మిగతా నేతలతో పోలిస్తే ఆమె చాలా యాక్టివ్‌గా కనిపిస్తున్నారు. రాజస్థాన్‌లో బలనిరూపణ తర్వాత వసుంధర ఇప్పుడు ఢిల్లీకి పయనమయ్యారు. ఢిల్లీలో బీజేపీ హైకమాండ్‌ను కలవవచ్చు. బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాతో భేటీకి సమయం కావాలని కోరారు.

నిజానికి మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌ల మాదిరిగానే రాజస్థాన్‌లో కూడా ముఖ్యమంత్రి ముఖం లేకుండానే బీజేపీ ఎన్నికల్లో పోటీ చేసింది. ఇలాంటి పరిస్థితుల్లో మూడు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి ముఖాన్ని ఎన్నుకోవడం బీజేపీకి అతిపెద్ద సవాలుగా మారింది.. అయితే పాత ముఖాల కన్నా.. కొత్త వారిని తెరపైకి తెచ్చి.. 2024 లోక్‌సభ ఎన్నికల్లోకి వెళ్లాలని బీజేపీ హైకమాండ్ భావిస్తోంది.అయితే స్థానిక తిరుగుబాటును ఆపాలని చేస్తున్న ప్రయత్నాలు ఎక్కడ బెడిసికొడతాయోనన్న భయం కూడా వెంటాడుతోంది.

రేసులో పలువురు..

రాజస్థాన్ ముఖ్యమంత్రి రేసులో వసుంధర రాజే ఒక్కరే కాదు. ఎంపీ దియా కుమారి, కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్, బాబా బాలక్‌నాథ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కూడా సీఎం రేసులో ఉన్నారు. దియా కుమారి, బాబా బాలక్‌నాథ్ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా పోటీ చేశారు. దియా కుమారి బుధవారం పార్లమెంటు సభ్యత్వానికి రాజీనామా చేశారు. అయితే ఎన్నికల ఫలితాల తర్వాత వసుంధర రాజే చాలా యాక్టివ్‌గా కనిపిస్తున్నారు.

ఎన్నికల ఫలితాల అనంతరం దాదాపు 60 మంది కొత్త ఎమ్మెల్యేలతో వసుంధర రాజే తన నివాసంలో సమావేశ వ ం య్ వ్యా ం ం . వసుంధర రాజేను సీఎం చేయాలని ఈ ఎమ్మెల్యేలు మీడియా ముందు బాహాటంగానే డిమాండ్ చేశారు. అయితే, ముఖ్యమంత్రి పేరును పార్టీ పార్లమెంట రీ బోర్డు నిర్ణయిస్తుం దని, అంతకు ముందు బీజేపీ శాసనసభా పక్ష సమావేశాన్ని పిలుస్తామని బీజేపీ స్పష్టం చేసింది. అయితే ఈ భేటీ తేదీని ఇంకా ఖరారు చేయలేదు.

జైపూర్‌లో వసుంధర రాజే సత్తా చూపుతున్న ప్పటికీ, ఆమె తన క్రియాశీలతను తిరుగుబాటుగా చూడ కూడదనుకుంటున్నారు. అందుకే తాను పార్టీ క్రమశిక్షణ కలిగిన కార్యకర్తనని, పార్టీ లైన్ నుంచి ఎప్పటికీ బయటకు వెళ్లబోనని ఆమె బీజేపీ హైకమాండ్‌కు చెప్పిందట.

ఇప్పుడు ఆమె జేపీ నడ్డా నుంచి కూడా సమయం కోరారని, తొందరగానే ఇద్దరు నేతలు భేటీ కావచ్చని భావిస్తున్నారు. నడ్డాతో భేటీలో ఎమ్మెల్యేల మద్దతును ప్రస్తావిస్తూ సీఎం పదవిపై తన వాదనను వినిపించవచ్చని భావిస్తున్నారు. ఇది మాత్రమే కాదు, ఆమె తనకు సీఎం పదవి ఇవ్వాలని హై కమాండ్‌ను ఒప్పించే ప్రయత్నం చేయవచ్చు. వసుంధర రాజే రెండుసార్లు రాజస్థాన్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆమె బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురా లు కూడా.మరి మోడీ, అమిత్‌షా కనుసన్నల్లో జరిగే సీఎంల నియామ కానికి వసుంధర కు లైన్ క్లియర్ చేస్తారా..లేక మరొ కరిని ఎంపిక చేస్తారా.. అన్న ఉత్కంఠ పార్టీ వర్గాల్లో వ్యక్తమవు తోంది.

రాజస్థాన్‌లో ఉత్కంఠ

ఇప్పటి వరకు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ లో సీఎం కావడానికి ఏ నాయకుడి ప్రయత్నం కనిపించటం లేదు. పైకి మాత్రం అంతా హైకమాండ్ నిర్ణయమంటూ..లోలోన మాత్రం సీఎం కుర్చీ దక్కకపోతే తేల్చుకుందామన్న ధోరణి కనిపిస్తోందని వారి సన్నిహితుల్లో పెద్ద చర్చ. మొత్తానికి రాజస్థాన్‌లో ఊహించని సందడి కనిపిస్తోంది. వసుంధర రాజే ఎమ్మెల్యేలను కలవడం ద్వారా మద్దతు కూడగట్టేందుకు నిరంతరం ప్రయత్నిస్తున్నారు. వసుంధర ఇప్పటి వరకు 60 మందికి పైగా ఎమ్మెల్యేలను కలిశారని చెబుతున్నారు. ఈ ఎమ్మెల్యేలు కూడా వసుంధరకు మద్దతిచ్చి ముఖ్యమంత్రిని చేయాలనే డిమాండ్‌ను లేవనెత్తుతున్నారు.

బిజినెస్

బంజారాహిల్స్‌లో గోల్డెన్ పెవిలియన్ ప్రారంభం



హైదరాబాద్ : గత 35 ఏళ్లగా వైవిధ్యమైన వంటకాలతో భోజన ప్రియులను ఆకట్టుకుంటున్న గోల్డెన్ పెవిలియన్ సంస్థ తాజాగా నగరం లోని బంజారాహిల్స్‌లో తమ శాఖను ప్రారంభించింది. విజయవాడకు చెందిన ఈసంస్థ ఆంధ్రా స్టైల్ బిర్యానీ, హలీమ్‌లకు ప్రసిద్ధి. "బంజారాహిల్స్‌లో గోల్డెన్ పెవిలియన్‌ను గ్రాండ్‌గా ఆవిష్కరించడం వంటల వారసత్వానికి సంబంధించిన వేడుక, అసమానమైన భోజన అనుభవాలను అందించడంలో మా నిబద్ధతకు నిదర్శనం. ఇది కేవలం రెస్టారెంట్ మాత్రమే కాదు. ఇది ఆంధ్రా వంటకాలు కాలానుగుణమైన ఆకర్షణకు నిదర్శనం." అని గోల్డెన్ పెవిలియన్ మేనేజింగ్ డైరెక్టర్ సాజిద్ మహ్మద్ పేర్కొన్నారు. ప్రస్తుతం తమకు 80 రెస్టారెంట్‌లు ఉన్నాయన్నారు.

జెఎం ఫైనాన్షియల్ అసెట్ మేనేజ్‌మెంట్ ఆఫీసు పునరుద్ధరణ

హైదరాబాద్ : జెఎం ఫైనాన్షియల్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ నగరంలోని తమ శాఖను పునరుద్ధరించినట్లు వెల్లడించింది. బంజారాహిల్స్‌లోని ఈ శాఖను శుక్రవారం ఆ సంస్థ ఈక్విటీ సీనియర్ ఫండ్ మేనేజర్ అసిత్ భండార్కర్, స్ట్రాటజిక్ అలయన్స్ డైరెక్టర్ మనీష్ శర్మ, దక్షిణ జోనల్ హెడ్ జ్యోత్స్నా కులకర్ణి, ఎపి అండ్ తెలంగాణ రీజనల్ హెడ్ విజయ్ దినకర్ లాంచనంగా ప్రారంభించారు. నగరంలో అభివద్ధి చెందుతున్న ఆర్థిక రంగం పట్ల సంస్థ యొక్క నిబద్ధతను సూచిస్తుందన్నారు.

నిఫ్టీ @ 21వేలు

ముంబయి : ఎన్ఎస్ఇ నిఫ్టీ తొలిసారి 21 మార్క్‌ను తాకింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక వడ్డీరేట్లను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు ప్రకటించడంతో వారాంతంలో సూచీలకు కొనుగోళ్ల మద్దతు లభించింది. శుక్రవారం బిఎస్ఇ సెన్సెక్స్ 304 పాయింట్లు పెరిగి 69,826 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ 68 పాయింట్లు పెరిగి 20,969కి చేరింది. ఉదయం 20,934 వద్ద ప్రారంభమైన సూచీ.. ఓ దశలో 21,006.10 వద్ద ఆల్‌టైం గరిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది.

సెన్సెక్స్-30లో హెచ్‌సిఎల్ టెక్, జెఎస్‌డబ్ల్యూ స్టీల్, ఇన్ఫోసిస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, విప్రో, యాక్సిస్ బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, టైటన్, కోటక్ మహీంద్రా బ్యాంక్ తదితర సూచీలు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి.

చందా కొచ్చర్‌కు సుప్రీంలో నిరాశ

న్యూఢిల్లీ : క్విడ్‌ప్రోకో కేసులో ఇరుక్కున్న ఐసిఐసిఐ బ్యాంక్ మాజీ సిఇఒ చందా కొచ్చర్‌కు తాజాగా సుప్రీంకోర్టులో చుక్కెదురయ్యింది. ఇప్పటికే అనేక కేసులను ఎదుర్కొంటూ.. కోర్టుల చుట్టు తిరుగుతున్న ఆమెకు తాజాగా తన పదవీ విరమణ ప్రయోజనాలు ఇప్పించాలని సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనికి సంబంధించిన అప్పీల్‌ను స్వీకరించడానికి అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం నిరాకరించింది. ఈ ఏడాది మే నెలలో ఐసిఐసిఐ బ్యాంక్ నుంచి పదవీ విరమణ ప్రయోజనాలను కోరుతూ ఆమె చేసిన మధ్యంతర దరఖాస్తును తిరస్కరించిన బాంబే హైకోర్టు ఉత్తర్వులను సుప్రీంకోర్టు సమర్థించింది.

మార్కెట్లోకి రెడ్మీ 13సి 5జి



న్యూఢిల్లీ : షావోమి అనుబంధ బ్రాండ్ రెడ్మీ భారత మార్కెట్లోకి తన నూతన రెడ్మి 13సి 5జిని విడుదల చేసింది. ఈ కొత్త స్మార్ట్‌ఫోన్‌ను మూడు వేరియంట్లలో అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపింది. ఇందులో బేసిక్ మోడల్ 4జిబి ర్యామ్ 128జిబి మెమోరీ వేరియంట్ ధరను రూ.10,999గా నిర్ణయించింది. 8జిబి, 256జిబి మోడల్ ధరను రూ.14,499గా పేర్కొంది. వీటికి ముందస్తు ఆర్డర్లను స్వీకరిస్తున్నట్లు ఆ సంస్థ తెలిపింది. డిసెంబర్ 12 తేది నుంచి డెలివరీలను ప్రారంభించనున్నట్లు తెలిపింది. వీటిలో 50ఎంపి ఎఐ ప్రైమరీ కెమెరా సహా 5ఎంపి సెల్ఫీ కెమెరాను అమర్చింది. 18వాట్ ఫాస్ట్ ఛార్జింగ్‌తో 5000 ఎంఎహెచ్ బ్యాటరీతో అందుబాటులోకి తెచ్చింది.

హాజరు మినహాయింపు గడువు

- ఆలస్య రుసుంతో 18 వరకు పొడిగింపు : ఇంటర్ బోర్డు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చే ఏడాది ఇంటర్ వార్షిక పరీక్షలకు ప్రయివేటుగా హాజరయ్యే విద్యార్థులకు హాజరు మినహాయింపు దరఖాస్తు గడువు ఆలస్య రుసుం రూ.200తో ఈనెల 18 వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ గ్రూప్ మార్పునకు సంబంధించి దరఖాస్తు చేసేందుకూ అవకాశముందని తెలిపారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఆర్ట్స్/హ్యూమానిటీస్‌కు హాజరయ్యే విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

స్టార్‌బక్స్‌కు షాక్

ఇజ్రాయిల్ దాడులకు తీవ్ర వ్యతిరేకత

- ఈ కంపెనీ వస్తువులను బహిష్కరిస్తున్న ముస్లిం దేశాలు



న్యూయార్క్ : ఇజ్రాయిల్ , హమాస్ మధ్య యుద్ధం ముస్లిం దేశాల ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో స్టార్‌బక్స్ కంపెనీ ఉత్పత్తులను కొనటానికి వారు నిరాకరిస్తున్నారు. సేల్స్ తగ్గటంతో ఈ కంపెనీ పీకల్లోతు నష్టాల్లో మునిగిపోయింది. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ ఉద్రిక్తతల కారణంగా, సీటెల్ ఆధారిత స్టార్‌బక్స్ కార్పొరేషన్ విలువ 11 బిలియన్ డాలర్లకు తగ్గింది. దీంతో కంపెనీ మొత్తం విలువలో 9.4 శాతం నష్టపోయింది. నవంబర్ 16న రెడ్ కప్ డే ప్రమోషన్ తర్వాత 19 క్యాలెండర్ రోజుల వ్యవధిలో నెమ్మదిగా అమ్మకాలు, సెలవుల కారణంగా స్తబ్ధత నెలకొంది. ఇలా ప్రతిస్పందనల నివేదికల మధ్య స్టార్‌బక్స్ షేర్లు 8.96 శాతం పడిపోయాయి. దీంతో 11 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లిందని కంపెనీ వర్గాలు తెలిపాయి.

నష్టాల బాట ఎందుకు..?

స్టార్‌బక్స్ నష్టానికి కారణం ఇజ్రాయిల్ , పాలస్తీనా మధ్య జరిగిన యుద్ధం. పాలస్తీనాకు మద్దతుగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలు స్టార్‌బక్స్‌కు వెళ్లడం మానుకుంటున్నారు. స్టార్‌బక్స్ ఇజ్రాయిల్‌కు మద్దతుగా ఒక పోస్ట్‌ను షేర్ చేసిందని, ఆ తర్వాత దానికి వ్యతిరేకంగా నిరసన కొనసాగుతోందని, ఈ నిరసన ఆగకపోతే కంపెనీకి భారీ నష్టాలు, కష్టాలు తప్పవని నిపుణులు అంటున్నారు.

కష్టమర్ల బహిష్కరణలతో అయోమయం

స్టార్‌బక్స్ కాకుండా, ఇజ్రాయిల్‌కు మద్దతిచ్చిన కొన్ని ఇతర పెద్ద బ్రాండ్‌లూ ఉన్నాయి. నివేదిక ప్రకారం, బహిష్కరణ మధ్య ఆర్థిక సమస్యల కారణంగా ఈజిప్టులో చాలా మంది ఉద్యోగులను తొలగించారు.

ఈ పరిస్థితి మరింత దిగజారొచ్చు

స్టార్‌బక్స్ షేర్లు వరుసగా 12 స్టాక్ మార్కెట్ సెషన్‌లకు పడిపోయాయి. కంపెనీ 1992లో జాబితా చేసినప్పటి నుంచి ఇప్పుడే అత్యధికంగా నష్టపోతోంది. ఈ స్టాక్ ప్రస్తుతం ఒక్కో షేరుకు 95.80 యూఎస్‌డీ వద్ద ట్రేడవుతోంది, దీని వార్షిక గరిష్ట స్థాయి 115 యూఎస్‌డీతో వ్యాపారమవుతోంది. దీంతో సంస్థ ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య ఆర్థికంపై పడుతోంది. పరిస్థితి మెరుగుపడకపోతే కంపెనీ మరింత భారీ నష్టాలను చవిచూడాల్సి రావచ్చు అని ఆ సంస్థ వర్గాలు చెబుతున్నాయి.

స్టార్‌బక్స్ కార్పొరేషన్ సంస్థకు చెందిన ప్రధాన కార్యాలయం వాషింగ్టన్‌లోని సీటెల్‌లో ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా ఈ సంస్థ కాఫీ , కాఫీహౌస్‌లు విస్తరించి ఉన్నాయి. 50 దేశాలలో 16,858 కంటే ఎక్కువ దుకాణాలతో, స్టార్‌బక్స్ ప్రపంచంలోనే అతిపెద్ద కాఫీహౌస్ కంపెనీ. ఇందులో ఒక్క అమెరికాలోనే 11000 కంటే ఎక్కువ దుకాణాలు ఉన్నాయి. కెనడాలో 1000 కంటే ఎక్కువ. యూకేలో 700 కంటే ఎక్కువ షాపులు ఉన్నాయి. ఇజ్రాయిల్, హమాస్‌ల మధ్య యుద్ధం వల్ల తమ కంపెనీ మునిగిపోయేలా ఉన్నదన్న ఆందోళన స్టార్‌బక్స్ యాజమాన్యంలో వ్యక్తమవుతోంది.

ఓవైసీ ముందు ప్రమాణస్వీకారం చేయం

నాతోపాటు,మా ఎమ్మెల్యేలూ బైకాట్ చేస్తారు

- స్పీకర్ ముందే ప్రమాణస్వీకారం చేస్తాం : రాజాసింగ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఓవైసీ ముందు తాము ప్రమాణ స్వీకారం చేయబోమనీ, తమ పార్టీ ఎమ్మెల్యేలమంతా శనివారం అసెంబ్లీని బహిష్కరిస్తామని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రకటించారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు.

అక్బరుద్దీన్ ఓవైసీ కాసీం రజ్వీ వారసుడనీ, ఆయన్ను తెలంగాణ అసెంబ్లీకి ప్రొటెం స్పీకర్‌గా ఎన్నుకోవడమేంటని విమర్శించారు. ఎమ్మెల్యేలంతా ఆయన ముందు ప్రమాణ స్వీకారం చేయాలా? అని ప్రశ్నించారు. తానైతే ఆయన ఉంటే ప్రమాణ స్వీకారం చేయబోనని స్పష్టం చేశారు.

తమ పార్టీ ఎమ్మెల్యేలు కూడా హాజరు కాబోరని నొక్కి చెప్పారు. 2018లో ఎంతో మంది సీనియర్లు ఉన్నప్పటికీ ఎంఐఎం ఎమ్మెల్యేనే ప్రొటెం స్పీకర్‌గా కూర్చోబెట్టారనీ, అప్పుడూ తాము ప్రమాణ స్వీకారం చేయలేదని గుర్తు చేశారు.

'15 నిమిషాలు టైమిస్తే..100 కోట్ల మందిని చంపేస్తామన్న వ్యక్తి. ఇటీవల ఎన్నికల్లో ఒక పోలీస్ అధికారికి వార్నింగ్ ఇచ్చిన వ్యక్తి, భారత దేశానికి వ్యతిరేకంగా మాట్లాడే వ్యక్తి, హిందువులకు వ్యతిరేకంగా మాట్లాడే వ్యక్తి అక్బరుద్దీన్ ఓవైసీ. ఆయన్ను ప్రొటెం స్పీకర్‌గా ఎలా నియమిస్తారు?' అని ప్రశ్నించారు. దీన్నిబట్టే దోస్తులెవరు? దుష్మన్ ఎవరు? అనేదానిపై రాష్ట్ర ప్రజలు ఆలోచన చేయాలన్నారు.

సభలో ఎంతో మంది సీనియర్లు ఉన్నప్పటికీ అక్బరుద్దీన్‌కు అవకాశం ఎందుకిచ్చారని ప్రశ్నించారు. అధికారంలో బీఆర్ఎస్ ఉన్నా, టీడీపీ ఉన్నా, కాంగ్రెస్ ఉన్నా..

ఎంఐఎం నేతలను నెత్తిన పెట్టుకుని తిరుగుతారని విమర్శించారు. బీఆర్ఎస్ కారు స్టీరింగ్‌ను ఎంఐఎం చేతిలో పెడితే..ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ భయపడి చేతిని అందించిందని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ మనిషి, టిల్లు అని ఎన్ని విమర్శలు చేసినా ప్రొటెం స్పీకర్‌గా ఓవైసీకి రేవంత్ అవకాశం ఇవ్వడాన్ని తప్పుబట్టారు. కాంగ్రెస్ హయాంలో కూడా ఎంఐఎందే రాజ్యం నడుస్తున్నదని విమర్శించారు.

ఢిల్లీ లిక్కర్ స్కాంలో.. బినోయ్ బాబుకు సుప్రీం బెయిల్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాం మనీలాండరింగ్ వ్యవహారం లో నిందితుడిగా ఉన్న హైదరాబాద్ బేస్డ్ లిక్కర్ వ్యాపారి బినోయ్ బాబుకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఎటువంటి అభియోగాలు మోపబడకుండా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఒకరిని 13 నెలల పాటు కటకటాల వెనుక ఉంచడం సరికాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ హైకోర్టు బెయిల్ తిరస్కరించడంతో బినోయ్ బాబు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

ఈ పిటిషన్ శుక్రవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టిలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. తొలుత పిటిషన్ తరపు సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే వాదనలు వినిపిస్తూ... ఢిల్లీ లిక్కర్ పాలసీ రూపొందించిన తరువాత బినోయ్ బాబు ఇతర నిందితులను కలిసినట్లు దర్యాప్తు సంస్థలు చార్జ్‌షీట్‌లో పొందుపరిచాయ న్నారు. అలాంటప్పుడు ఈ స్కాంలో బినోయ్ బాబు ప్రమేయం ఎలా ఉంటుందని ప్రశ్నించారు. పెర్నర్డ్ రిచర్డ్ ఇండియా సంస్థలో రీజినల్ డైరెక్టర్‌గా మాత్రమే బినోయ్ బాబు పని చేస్తున్నారని, ఆయనకు సొంతగా నిర్ణయాలు తీసుకునే అధికారం లేదన్నారు. ఆ సంస్థ బోర్డు మాత్రమే నిర్ణయాలు తీసుకోగలదని, అలాంటప్పుడు తన పిటిషనర్‌పై ఎలా కేసు నమోదు చేస్తారని వాదించారు. ఇదంతా బోగస్ కేసని, ఎలాంటి సంబంధంలేని కేసులో పిటిషనర్‌ను 13 నెలలుగా ఎలా జైళ్లో ఉంచుతారని ప్రశ్నించారు. ఇదే వ్యవహారంలో సీబీఐ దాఖలు చేసిన కేసులో బెయిల్ వచ్చిందని వివరించారు. అయితే ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్‌కు విరుద్ధంగా పిటిషన్‌ను జైళ్లో పెట్టారని బెంచ్‌కు నివేదించారు.

అందువల్ల బినోయ్ బాబుకు బెయిల్ ఇవ్వాలని కోరారు. మధ్యలో జోక్యం చేసుకున్న జస్టిస్ ఖన్నా... ఈడీ తరపు హాజరైన అడిషనల్ సొలిసిటర్ జనరల్(ఏఎస్ జీ) ఎస్వీ రాజును వివరణ కోరారు. ఇందుకు ఏఎస్ జి రాజు అవునని సమాధానం ఇచ్చారు. అయితే ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం సిసోడియా కేసులో మాదిరిగానే బినోయ్ బాబుకు ఉత్తర్వులివ్వాలని కోరారు. బాబు సుదీర్ఘంగా జైలులో ఉన్న నేపథ్యంలో ఆదేశాలిచ్చేందుకు ధర్మాసనం నిరాకరించింది. ఈ నేరంలో నిందితుడు సాధారణ శిక్షలో సగం శిక్ష అనుభవించి ఉంటే బెయిల్‌పై విడుదల చేయాలనే క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 436 ఏ, మనీ-లాండరింగ్ కేసులకు వర్తించదన్న విజయ్ మదన్‌లాల్ తీర్పును ఏఎస్ జీ బెంచ్ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. 'ఈడీ ఒకరిని 13 నెలల పాటు ఎలాంటి అభియోగాలు మోపకుండా కటకటాల వెనుక ఉంచడం సరికాదు. ఈ కేసులో మరింత మంది నిందితులను గుర్తించాల్సి ఉంది' అని వ్యాఖ్యా నించింది. నిందితులపై ఆరోపణల విషయంలో సీబీఐ, ఈడీల మధ్య వైరు ధ్యాలున్నాయని పేర్కొంది. అందువల్ల బినోయ్ బాబుకు బెయిల్ మంజూరు చేస్తున్నట్లు వెల్లడించింది.

11న రాజ్‌భవన్‌లో 'వికసిత్ భారత్-2047' వర్క్‌షాప్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిటి ఆయోగ్, కేంద్ర ప్రభుత్వం సంయుక్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని రాజ్‌భవన్లలో ఈనెల 11న ఉదయం పది గంటలకు వికసిత్ భారత్ వర్క్‌షాప్-2047 వర్క్‌షాప్‌ను నిర్వహించనున్నారు. ఈ మేరకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ వర్చువల్ పద్ధతిలో ఈ వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. ఆయన విజన్, ఆకాంక్షలను వివరిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్లు (వీసీలు), ఉన్నత విద్యాసంస్థల బోధనా సిబ్బంది పాలొంటారని వివరించారు. వీసీతోపాటు పది మంది బోధనా సిబ్బంది ఒక్కో విశ్వవిద్యాలయం నుంచి హాజరు కావాలని సూచించారు.

గవర్నర్ల వద్ద బిల్లులు పెండింగ్.. ఇదే ప్రధాన సమస్య

గవర్నర్ అధికారాలు, రాష్ట్రాలతో ఘర్షణపై రాజ్యసభలో చర్చ

- మంత్రివర్గ సలహాలను గవర్నర్ పాటించడటం లేదు : వి.శివదాసన్, సీపీఐ(ఎం)

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

గవర్నర్ల వద్ద బిల్లుల పెండింగ్ ఈ రోజు ప్రధాన సమస్య అని కాంగ్రెస్ ఎంపీ ఎల్ హనుమంతయ్య అన్నారు. శుక్రవారం రాజ్యసభలో గవర్నర్ అధికారాలు, రాష్ట్రాలతో ఘర్షణపై చర్చ జరిగింది. ఎంపీ ఎల్.హనుమంతయ్య ప్రయివేటు మెంబర్ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లును సభ ఏకగ్రీవంగా ఆమోదించాలని, తద్వారా రాష్ట్రాలు, కేంద్రం మధ్య ఘర్షణ తగ్గుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి, కేంద్రానికి మధ్య లింక్‌గా వ్యవహరిస్తూ రాష్ట్రంలోని మంత్రి మండలి సలహాకు కట్టుబడి ఉండే రాజ్యాంగ అధిపతి గవర్నర్ అని అన్నారు. గవర్నర్ రాజకీయ రహితుడిగా, మంత్రి మండలి సలహా మేరకు, కొన్ని విచక్షణా అధికారాలతో వ్యవహరిస్తారని, అభిప్రాయ భేదాలున్నప్పుడు గవర్నర్, రాష్ట్రం బహిరంగంగా ఎలా వ్యవహరించాలనే నిబంధనలు లేవని అన్నారు. హనుమంతయ్య కొన్ని కమిషన్‌ల నివేదికల నుంచి వచ్చిన గవర్నర్‌లకు సంబంధించిన కొన్ని సిఫారసులను సభకు వివరించారు. గవర్నర్ ఎంపికలో ప్రధానమంత్రి, ఉపరాష్ట్రపతి, లోక్‌సభ స్పీకర్‌లను సంప్రదించాలని సర్కారియా కమిషన్ ప్రతిపాదించింది. ఈ ఎంపిక కోసం ప్రధానమంత్రి, స్పీకర్, హోంమంత్రి, ఉపరాష్ట్రపతి, సంబంధిత రాష్ట్ర ముఖ్యమంత్రితో కూడిన కమిటీని కమిషన్ ప్రతిపాదించింది. రాష్ట్ర గవర్నర్ సలహాకు వ్యతిరేకంగా మంత్రులపై ప్రాసిక్యూషన్‌ను అనుమతించే గవర్నర్ హక్కును సమర్థించింది. రాష్ట్ర అసెంబ్లీతో గవర్నర్‌పై అభిశంసనకు కూడా అవకాశం కల్పించింది. చాలా సార్లు, ఏండ్ల తరబడి, గవర్నర్‌ల వద్ద బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయనీ, ఇది ఈ రోజు ప్రధాన సమస్య అని హనుమంతయ్య అన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ వివరించిన రాజ్యాంగ నైతికతను పునఃపరిశీలించడానికి ఇదే సరైన సమయమని చెప్పారు. బిల్లులు పెండింగ్‌లో ఉన్న రాష్ట్రాలన్నీ ప్రతిపక్షాల పాలనలో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎంపీ అనిల్ అగర్వాల్ మాట్లాడుతూ రాజ్యాంగ గౌరవాన్ని కాపాడుతుందని, తన బిల్లును వెనక్కి తీసుకోవాలని సభ్యుడిని అభ్యర్థించారు.

మంత్రివర్గ సలహాలను గవర్నర్ పాటించడటం లేదు: వి.శివదాసన్, సీపీఐ(ఎం)

గవర్నర్ జోక్యంతో రాష్ట్ర ఆదాయానికి గండి పడుతున్నదని సీపీఐ(ఎం) ఎంపీ వి.శివదాసన్ చెప్పారు. మంత్రివర్గం సలహాలు పాటించడం గవర్నర్ విధి అని, కానీ గవర్నర్ పాటించటం లేదని అన్నారు. చాలా రాష్ట్రాలు ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని ఆయన పేర్కొన్నారు. అటవీ, విద్య, వ్యవసాయం రాష్ట్ర సబ్జెక్టులు, కానీ ఇప్పుడు అవి కేంద్ర ప్రభుత్వం కింద ఉన్నాయని సీపీఐ(ఎం) ఎంపీ శివదాసన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు మరింత స్వయంప్రతిపత్తి కోసం అభ్యర్థిస్తున్నారని, అయితే కేంద్ర ప్రభుత్వం మరింత కేంద్రీకృత పాలనకు మార్గం సుగమం చేయడానికి ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. రాష్ట్ర స్వయంప్రతిపత్తి, పంచాయతీ రాజ్ రెండింటితో సహా వికేంద్రీకరణ యుగ స్ఫూర్తి అని ఆయన చెప్పారు. అధికారాలు, పదవీకాలంతో సహా గవర్నర్ అధికారానికి సంబంధించిన ఆర్టికల్‌ను సవరించాలని రాజ్యాంగ సవరణ బిల్లుకు ప్రత్యామ్నాయంగా ప్రయివేటు మెంబర్ బిల్లు ప్రవేశపెట్టారు. ఆర్టికల్ 154 , 155, 156 సవరణను ఈ బిల్లు కోరుతుంది. వైవిధ్యంపై దాడిని, రాష్ట్ర శాసనసభల అధికారాలను తగ్గించడాన్ని మనం నిరోధించాలని శివదాసన్ కోరారు. అలాగే శివదాసన్ ఇంటర్నెట్ సదుపాయం, బహిరంగ ప్రదేశాలకు ప్రాప్యత, బాల్య సంరక్షణ కోసం ప్రైవేట్ సభ్యుల బిల్లులను ప్రవేశపెట్టారు.డా.వి.శివదాసన్ రాజ్యసభలో మూడు బిల్లులను ప్రవేశపెట్టారు. దేశంలోని పౌరులందరికీ ఉచిత ఇంటర్నెట్ సదుపాయాన్ని అందించడానికి ఉచిత ఇంటర్నెట్ హక్కు బిల్లు- 2023, పౌరులందరికీ పబ్లిక్ స్పేస్‌కు ఉచిత ప్రాప్యతను అందించే బిల్లు (ది రైట్ టు పబ్లిక్ స్పేస్ బిల్లు, 2023.), ది రైట్ టు ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ బిల్లు, 2023ను ప్రవేశపెట్టారు. ఎన్సీపీ ఎంపీ ఫౌజియా ఖాన్ వర్క్‌ప్లేస్‌లో మహిళలపై లైంగిక వేధింపుల (నివారణ, నిషేధం, పరిహారం) చట్టం-2013కు మరింత సవరణ కోరుతూ ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టారు.

చంద్రబాబు బెయిల్ రద్దు పిటిషన్ విచారణ వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు బెయిల్ రద్దు పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ వాయిదా వేసింది. చంద్రబాబుకు బెయిల్ ఇస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బేలా ఎం. త్రివేది, జస్టిస్ సతీష్ చంద్ర శర్మ ధర్మాసనం విచారించింది. నోటీసులు జారీ చేసినా ఇంకా కౌంటర్ దాఖలు చేయలేదని ప్రభుత్వం తరపు న్యాయవాది రంజిత్ కుమార్ ధర్మాసనానికి తెలిపారు. చంద్రబాబు తరపు సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే వాదనలు వినిపిస్తూ తాము కౌంటర్ దాఖలు చేయడానికి సిద్ధంగానే ఉన్నామని, కానీ 17ఏ తీర్పుతో ముడిపడి ఉందన్న విషయాన్ని సాల్వే ప్రస్తావించారు. 17ఏ వ్యవహారంపై తీర్పు ఇచ్చేటట్లయితే వాయిదా వేయాలని, లేదా విచారణ తేదీ ఖరారు చేయాలని ధర్మాసనాన్ని కోరారు. దీంతో ధర్మాసనం విచారణను జనవరి మూడో వారంలో చేపడతామని తెలిపింది. విచారణకు ఏదో ఒక తేదీ ఖరారు చేయాలని సాల్వే కోరగా.. ఆయన విజ్ఞప్తితో చంద్రబాబు బెయిల్ రద్దు పిటిషన్‌ను జనవరి 19కి వాయిదా వేసింది. ఈ లోపు కౌంటర్ దాఖలు చేయాలని చంద్రబాబు తరపు న్యాయవాదులకు, దానికి రిజాయిండర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ధర్మాసనం ఆదేశించింది.